


# ప్రజావీక్షణం

దినపత్రిక

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

PJV ప్రజా వీక్షణం టీవి

Subscribe

www.prajaveekshanam.in | సంపుటి:16 | సంచిక :96 | శుక్రవారం 27 ఫిబ్రవరి 2026 | పేజీలు : 12 | వెల:రూ.2/-

Published from : Vijayawada, Krishna, Guntur, Kakinada, Vishakhapatnam, Vijayanagaram, Prakasham, Kadapa, Kurnool, Tirupathi, Anantapur, East Godavari, West Godavari

### ఇజ్రాయెల్-భారత్ మధ్య స్వేచ్ఛా

# వాణిజ్య ఒప్పందం

- యూపీఐ పేమెంట్స్ విషయంలో ఇరు దేశాల మధ్య ఎవోయూ
- ఏఐ, వ్యవసాయం తదితర రంగాల్లో ఒప్పందాలు
- ఇజ్రాయిల్ పర్యటనలో ప్రధాని మోడీ ప్రకటన
- త్వరలోనే ఇండియా వస్తానన్న నెతన్యాహు



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి26ప్రజా వీక్షణం:**

ఇజ్రాయెల్-భారత్ మధ్య త్వరలోనే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదరనుందని ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. అలాగే ఇజ్రాయెల్‌లో కూడా త్వరలో యూపీఐ సేవలను వినియోగించుకోవచ్చని తెలిపారు. ఈ మేరకు యూపీఐ పేమెంట్స్ విషయంలో ఇరు దేశాల మధ్య ఒప్పందం కుదిరింది. యూపీఐ పేమెంట్స్‌తో పాటు ఏఐ, వ్యవసాయం తదితర రంగాల్లో ఒప్పందాలు కుదిరాయి. రెండు దేశాల మధ్య త్వరలోనే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం జరగనున్నట్టు ఇరు దేశాల ప్రధానులు సంయుక్త ప్రకటనలో వెల్లడించారు. మొత్తం 27 రంగాల్లో పరస్పర సహకారానికి ఇరు దేశాలు అంగీకరించాయి. మరోవైపు గాజాపై ప్రధాని మోదీ మరోసారి భారత్ వైఖరిని స్పష్టం చేశారు. మానవత్వం ఎప్పుడూ సంఘర్షణకు బలికాకూడదని అన్నారు. ప్రస్తుతం శాంతి ప్రణాళిక ద్వారా ఓ ముందడుగు పడిందని, ఈ ప్రయత్నాలకు భారత్ పూర్తి మద్దతుగా నిలుస్తుందని మోదీ హామీ ఇచ్చారు. త్వరలోనే భారత పర్యటనకు రావాల్సిందిగా ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహును ఆహ్వానించారు. అంతకు ముందు ఇజ్రాయెల్ పార్లమెంట్‌లో ప్రధాని మోదీ చేసిన ప్రసంగాన్ని నెతన్యాహు ప్రశంసించారు. ఆయన ప్రసంగం ప్రతి ఒక్కరినీ కదిలించిందని అన్నారు.భారత్‌కు రుణపడి ఉన్నామని అన్నారు. మోదీ తమకు స్నేహితుడు కంటే ఎక్కువని అభివర్ణించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇజ్రాయెల్ పర్యటన రెండు దేశాల మధ్య సరికొత్త మైత్రికి నాంది పలికింది. విమానాశ్రయం నుంచి ఇజ్రాయెల్ పార్లమెంట్ వరకు మోడీకి లభించిన ఘన స్వాగతం ఈ పర్యటన ప్రాధాన్యతను చాటిచెప్పింది. పర్యటనలో భాగంగా నిర్వహించిన సంయుక్త విలేకరుల సమావేశంలో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు తన వ్యక్తిగత విషయాన్ని ఒకటి పంచుకొని అందరినీ ఆశ్చర్యపరిచారు. ఈ సందర్భంగా ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి నెతన్యాహు మాట్లాడుతూ.. తన భార్యతో తన మొదటి డేట్ ఒక భారతీయ రెస్టారెంట్‌లో జరిగిందని, ఆ భోజనం అద్భుతంగా ఉండటం వల్లే వారి బంధం బలపడిందని సరదాగా వ్యాఖ్యానించారు. దీనికి తాను, తన పిల్లలు కూడా భారత్‌కు రుణపడి ఉంటామని ఆయన అనగానే ప్రధాని మోడీ నవ్వు ఆపుకోలేక పోయారు. భారతదేశంలోని అపారమైన ప్రతిభను, ఇజ్రాయెల్‌లోని సాంకేతిక పరిజ్ఞానాన్ని కలపడం ద్వారా అద్భుతాలు సృష్టించవచ్చని ఇద్దరు నేతలు ఆకాంక్షించారు. ప్రధానంగా కచ్చితమైన వ్యవసాయం, సాఫ్ట్‌వేర్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నారు. ఆవిష్కరణలు, సాంకేతికత, అభివృద్ధికి సంబంధించి రెండు దేశాల మధ్య 16 కీలక అవగాహన ఒప్పందాలు జరిగాయి.రెండు దేశాల మధ్య స్నేహాన్ని మరింత బలోపేతం చేసేందుకు త్వరలోనే భారత్‌లో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని నేతలు నిర్ణయించారు.



### కేటీఆర్, హరీశ్‌రావువి

# అన్నీ అబద్ధాలే

**కాళేశ్వరం వైఫల్యాలపై మంత్రి పొంగులేటి**

- ప్రాజెక్టులపై కేటీఆర్, హరీశ్ వ్యాఖ్యలు వాస్తవ దూరమన్న పొంగులేటి
- లక్ష కోట్లు ఖర్చు చేసినా ఫలితం శూన్యమని విమర్శ
- రాష్ట్ర నీటి ప్రయోజనాల విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని వ్యాఖ్య

**తెలంగాణ ఫిబ్రవరి 26,ప్రజా వీక్షణం:**

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టుల పేరుతో అవకతవకలు జరిగాయంటూ రాష్ట్ర సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ధ్వజమెత్తారు. లక్ష కోట్లు ఖర్చు చేసినా ఫలితం శూన్యమని విమర్శించారు. ప్రాజెక్టులపై మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు చేస్తున్న వ్యాఖ్యలు వాస్తవ దూరమని, ప్రజలను తప్పుదోవ పట్టించడమే వారి లక్ష్యమని ఆయన ఆక్షేపించారు. కాళేశ్వరం ప్రాజెక్టును రూ. 1.08 లక్షల కోట్ల అంచనాతో నిర్మించి, కేవలం 110 టీఎంసీల నీటిని మాత్రమే అందుబాటులోకి తీసుకురావడం గత పాలకుల అసమర్థతకు నిదర్శనమని పొంగులేటి మండిపడ్డారు. ఎన్నికలకు ముందే బ్యారేజీలు కుంగిపోయాయని అన్నారు.

మిగతా 2 లో

# ప్రైవేట్ స్కూళ్ల ఫీజులకు కళ్లెం వేసేలా చర్యలు

- భారతీయ విద్యాభవన్ తరహాలో స్కూళ్లు
- మౌళిక వసతులతో పాటు..బ్రేక్‌ఫాస్ట్
- విజయ డెయిరీ ద్వారా అవసరమైన పాల సరఫరా
- రవాణా కోసం ఎలక్ట్రిక్ బస్సుల వినియోగం
- విద్యారంగంపై సమీక్షలో సిఎం రేవంత్ కీలక ఆదేశాలు



**హైదరాబాద్,ఫిబ్రవరి26 ప్రజా వీక్షణం**

కోర్ అర్బన్ రీజియన్‌లో ప్రభుత్వ స్కూల్స్‌లో మౌలిక సదుపాయాల కల్పనపైన దృష్టి సారించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణంలో రాజీ పడొద్దని స్పష్టం చేశారు. భారతీయ విద్యా భవన్, జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూళ్లల్లో ఉన్న మౌలిక సదుపాయాలు ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ఉండాలని సూచించారు. గురువారం ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌పైన సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు.

మిగతా 2 లో



# వరుసగా జరిగిన దొంగతనం కేసులను విజయవంతంగా ఛేదించి నలుగురు నిందితులను అరెస్ట్ చేసిన - కాగజ్ నగర్ టౌన్ పోలీసులు.

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఫిబ్రవరి 26(ప్రజా వీక్షణం న్యూస్)**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ టౌన్ పోలీస్ వరుసగా జరిగిన దొంగతనం కేసులను విజయవంతంగా ఛేదించి నలుగురు నిందితులను అరెస్ట్ చేయడమైనది. ఈ కార్యక్రమంలో కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఎస్ పి నికితా పంత్ ఐ పి ఎస్ మాట్లాడుతూ 05-01-2026 తేదీన సుమారు మధ్యాహ్నం 04:00 గంటలకు దండే మంగా, భర్త లేట్ ప్రసాద్, వయస్సు 52 సంవత్సరాలు, ఎ ఎన్ ఎమ్ (ఈస్గమ్ పి ఎచ్ సి), నివాసం: సిర్పిల్క్ కాలనీ, కాగజ్నగర్ టౌన్, ఫిర్యాదు చేయగా, ఆమె 03-01-2026 తేదీన తన ఇంటికి తాళం వేసి హైదరాబాద్ కు వెళ్లిన సమయంలో, గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి సమయంలో ఇంటి తలుపుల తాళాలు పగులగొట్టి 7 తులాల బంగారు ఆభరణాలు మరియు 1 కిలో వెండి వస్తువులు, సుమారు రూ. 2,75,000/-విలువైన ఆస్తిని అపహరించినట్లు తెలిపినది.

బి ఎన్ యస్ చట్టాల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టడమైనది.
.07/2026 U/Sec 331(4), 305(a)

దర్యాప్తు సందర్భంగా 26-02-2026 తేదీన మధ్యాహ్నం 12:00 గంటలకు విశ్వసనీయ సమాచారంపై

ఇా1 ఇర్షాద్ పాషా ఏ తాజ్, వృత్తి: జీజదీ డ్రైవర్, నివాసం: సుభాష్ చంద్రబోస్ కాలనీ, కాగజ్ నగర్ టౌన్ అదుపులోకి తీసుకొని విచారించగా, తన సహచరులతో కలిసి ఈ నేరాన్ని చేసినట్లు ఒప్పుకున్నాడు.

**అతని సహచరులు:**

– షైక్ అంజద్, వృత్తి: సెంటరింగ్ వర్కర్, నివాసం: సిర్పిల్క్ కాలనీ, కాగజ్నగర్ టౌన్.

– మిర్జా సోహైల్ బేగ్, వృత్తి: జీజదీ డ్రైవర్, నివాసం: చింతగూడ గ్రామం, కాగజ్ నగర్ మండలం.

విచారణలో నిందితులు కలిసి ఒక గుంపుగా ఏర్పడి, సిర్పిల్క్ కాలనీ మరియు కాగజ్ నగర్ టౌన్ పరిసర ప్రాంతాల్లో తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని గృహ భేధన, దొంగతనాలు చేస్తూ సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో గత కొన్నేళ్లుగా నేరాలకు పాల్పడుతున్నట్లు ఒప్పుకున్నారు. ప్రస్తుత కేసుతో పాటు కాగజ్నగర్ టౌన్ పోలీస్ స్టేషన్లో నమోదైన మరో ఆరు ఆస్తి నేరాలలో కూడా తమ ప్రమేయం ఉన్నట్లు అంగీకరించారు. నిందితులు అపహరించిన బంగారం, వెండి ఆభరణాలను రిసీవర్లకు విక్రయించినట్లు వెల్లడించగా,

చిలుకూరి శ్రీకాంత్, వృత్తి: గోల్డ్స్మిత్, నివాసం: బాలాజీ నగర్, కాగజ్ నగర్ అదుపులోకి తీసుకొని విచారించగా, అపహరించిన ఆభరణాలను స్వీకరించి లాభం కోసం ఇతరులకు బదిలీ చేసినట్లు ఒప్పుకున్నాడు. నిందితులు ఇా1 నుండి ఇా4 వరకు అరెస్ట్ చేసి గౌరవ న్యాయస్థానంలో హాజరు పరచడమైనది. అపహరించిన ఆస్తిని చట్టబద్ధమైన పంచనామా ద్వారా స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసిన నిందితులు కాగజ్నగర్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో క్రింది కేసుల్లో కూడా ప్రమేయం కలిగియున్నారు:

1. Cr.No.07/2026 U/Sec 331(4), 305(a) BNS
2. Cr.No.228/2023 U/Sec 457, 380 IPC.






3. Cr.No.45/2025 U/Sec 331(4), 305(a) BNS
4. Cr.No.58/2025 U/Sec 331(4), 305(a) BNS
5. Cr.No.302/2025 U/Sec 331(4), 305(a) BNS
6. Cr.No.351/2025 U/Sec 331(4), 305(a) BNS
7. Cr.No.352/2025 U/Sec 331(4), 305(a) BNS

ప్రజలు తమ ఇళ్లలో బలమైన తాళాలు అమర్చుకోవడం, సి సి టి వి కెమెరాలు ఏర్పాటు చేయడం మరియు అనుమానాస్పద వ్యక్తుల కదలికలు గమనించిన వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించడమైనది.

మరింత దర్యాప్తు కొనసాగుచున్నది. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ నికితా పంత్ ఐ పి ఎస్ కాగజ్ నగర్ టౌన్ సి ఐ ప్రేమ్ కుమార్, ఎస్ ఐ సుధాకర్ మరియు కానిస్టేబుల్ లు పాల్గొన్నారు.

# కేటీఆర్, హరీశ్‌రావువి అన్నీ అబద్ధాలే

మొదటి పేజీ తరువాయి

ఆ తప్పిదాల నుంచి తప్పుకోవడానికే ఇప్పుడు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. అలాగే బీఆర్ఎస్, బీజేపీల మధ్య 'ఫెవికాల్ బంధం' ఉందన్న విషయం బహిరంగ రహస్యమేనని, అందుకే వారు ఒకరికొకరు సహకరించుకుంటున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్ర నీటి ప్రయోజనాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని మంత్రి స్పష్టం చేశారు. బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా రాష్ట్ర ప్రయోజనాల కోసం సలహాలు ఇవ్వాల్సింది పోయి, కేవలం రాజకీయ లబ్ధి కోసం విమర్శలు చేయడం దురదృష్టకరమని పొంగులేటి అన్నారు. తెలంగాణ హక్కుల కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పోరాడుతుందని, గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్ది రైతులకు మేలు చేకూర్చడమే తమ ప్రథమ ప్రాధాన్యత అని ఆయన వెల్లడించారు.

# ప్రైవేట్ స్కూళ్ల ఫీజులకు కళ్లెం వేసేలా చర్యలు

మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై సీఎం దిశానిర్దేశర చేశారు. ఈ సమావేశానికి సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు కే కేశవరావు, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళీ, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణా రెడ్డి , విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా , కళాశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేన, ఉస్మానియా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కుమార్, అంబేద్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో బ్రేక్ ఫాస్ట్ స్కీమ్‌ను పకడ్బందీగా అమలు చేయాలని మార్గనిర్దేశం చేశారు. బ్రేక్ ఫాస్ట్ స్కీమ్‌లో తప్పనిసరిగా పాలు అందజేయాలని నిర్దేశిరచారు. ఇందుకోసం విజయా డైరీ నుంచి పాలు సేకరించాలని సూచించారు. మధ్యాహ్న భోజనం నాణ్యత కోసం ఏఐ టెక్నాలజీని వినియోగించాలని దిశానిర్దేశర చేశారు. కోర్ అర్బన్ రీజియన్ మినహా మిగిలిన నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్ట్ కింద ఒక్కొక మండలంలో ఆరుట్ల స్కూల్ తరహాలో ట్రాన్స్‌పోర్ట్‌తో సహా అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ట్రాన్స్‌పోర్ట్ కోసం ఎలక్ట్రికల్ బస్సుల ఏర్పాటు పైన అధ్యాయనం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ప్రైవేట్ స్కూల్స్‌లో నిబంధనలకు మించి ఫీజులు వసూలు చేస్తే అనుమతి రద్దుతో పాటు రికవరీ చేసేలా నిబంధన విధించాలని హుకుం జారీ చేశారు. ప్రైవేట్ స్కూల్స్‌లో ఫీజుల నియంత్రణకు సంబంధించి రికమండేషన్స్‌ని ప్రజాభిప్రాయం కోసం వెబ్‌సైట్‌లో ఉంచాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు.

# బ్యాంక్ అకౌంట్ నుండి సైబర్ కేటుగాళ్లు డబ్బులను దండుకున్నారని ఆవేదన వ్యక్తం..

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఫిబ్రవరి 26(ప్రజా వీక్షణం న్యూస్)**




కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో పట్టణానికి చెందిన విశాల్ పవర్ జిమ్ నిర్వాహకుడు ఖండ్రే విశాల్ అనే యువకుడి బ్యాంక్ అకౌంట్ ల నుండి అతని ప్రమేయం లేకుండా 3 లక్షల 9 వేల రూపాయలను సైబర్ కేటుగాళ్లు దండుకున్నారు. రెండు రోజుల క్రితం అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఒక్క సారిగా ఫోన్ కు మెసేజ్ లు రావడంతో గమనించగా సైబర్ దుండగులు 500/- రూపాయల నుండి 50,000/- రూపాయల వరకు కొద్ది కొద్ది సేపటికి కొంత డబ్బును బ్యాంక్ ఖాతాల నుండి డ్రా అయ్యాయని, తనకు ఎలాంటి ప్రమేయం లేకుండా అకౌంట్ లో నుండి డబ్బులు పోవడంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. తాను ఎలాంటి లింకులను కూడా క్లిక్ చేయలేదని అయిన కూడా తన బ్యాంక్ అకౌంట్ నుండి సైబర్ కేటుగాళ్లు డబ్బులను దండుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.. అధికారులు స్పందించి తగు విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని కోరారు..

# కుటుంబ క్షేమం కోసం మద్యం సేవించి వాహనం నడపొద్దు

## ట్రాఫిక్ ఏసిపి సత్యనారయణ

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఫిబ్రవరి 26 (ప్రజా వీక్షణం న్యూస్)**

వాహనదారులు తమ కుటుంబ క్షేమాన్ని దృష్టిలో వుంచుకోని మద్యం సేవించి వాహనం నడపొద్దని వరంగల్ ట్రాఫిక్ ఏసిపి వాహనదారులకు సూచించారు. ఆరైవ్ - ఆలైవ్ రెండవ విడత కార్యక్రమములో భాగంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుపడిన వాహన దారులకు వరంగల్ కమిషనరేట్ కార్యాలయము లో ట్రాఫిక్ ట్రైనింగ్ కేంద్రంలో ట్రాఫిక్ పోలీసుల అధ్వర్యం లో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏసిపి మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు తప్పని సరిగా ట్రాఫిక్ నిబందనలు పాటించాల్సిన అవసరం ఎంతైన వుందని రోడ్లపై జరిగే రోడ్డు ప్రమాదాలకు మీరు బాధ్యులు కావద్దని, వాహన నడిపే సమయంలో తమ స్వీరక్షణకై తప్పని సరిగా రోడ్డు నియమాలు పాటించాలని, ఇటీవల కాలం రాష్ట్రంలో హత్యల కన్న రోడ్డు ప్రమాదాలో మరణించిన వారి సంఖ్య అధికమని, ఈ ప్రమాదాలు అధికంగా మద్యం మత్తులో జరిగినవి పోలీసులు గుర్తించారని, మద్యం సేవించి వాహనం నడపటం కారణంగా మీతో పాటు రోడ్డుపై నడిచి వెళ్ళేవారు, ఇతర వాహనదారులు సైతం ప్రమాదాల బారిన పడి మరణిస్తున్నారని రొడ్డు ప్రమాదాల్లో ఇంటి యజమాని మరణించడంతో ఆ కుటుంబం రోడ్డున పడుతున్నాయని ప్రస్తుతం రోడ్డు ప్రమాదాల కారణంగా ఎన్నో కుటుంబ దీనస్థితిలో తమ జీవితాలను కోనసాగిస్తూన్నాయని ఏసిపి తెలియజేసారు. ఈ కార్యక్రమములో హన్మకొండ ట్రాఫిక్ ఇన్స్‌స్పెక్టర్ సీతారెడ్డి, ట్రైనింగ్ సెంటర్ ఎస్.ఐ నారయణ పాల్గోన్నారు.






# నేడు భద్రకాళి బండ్ వద్ద రాకెట్ ప్రయోగం ట్రయల్ రన్

## హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఫిబ్రవరి 26 (ప్రజా వీక్షణం న్యూస్)**

జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా భద్రకాళి బండ్ ప్రామినాడ్ వద్ద నిర్వహించనున్న "రుద్రమ1" రాకెట్ ప్రయోగానికి ముందు ట్రయల్ రన్‌ను నేడు ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించి అన్ని శాఖలు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని ఆయన సూచించారు. గురువారం సాయంత్రం హనుమకొండ కుడా కార్యాలయంలో పోలీస్, రెవెన్యూ, విద్యా, కుడా, మున్సిపల్ తదితర శాఖల అధికారులతో పాటు రాకెట్ రూపకర్త శశాంక్ భూపతి, ఎన్ఐటి ప్రొఫెసర్ అంజన్ కుమార్, కుడా సిపిఓ అజిత్ రెడ్డి, ఈఈ భీమ్ రావు తదితరులతో కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈనెల 28వ తేదీన జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని భద్రకాళి బండ్ పై రాకెట్ ప్రయోగం నిర్వహించనున్న నేపథ్యం లో అవసరమైన ఏర్పాట్లపై సమీక్షించారు. భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, వైద్య సదుపాయాలు, ప్రజల రాకపోకలు, సమన్వయ విధానాలు తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ, 28వ తేదీన సాయంత్రం 5:30 గంటలకు భద్రకాళి బండ్ వద్ద రాకెట్ లాంచింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. అదే రోజు మధ్యాహ్నం 2:30 గంటల నుంచి 4:30 గంటల వరకు కాళోజీ కళాక్షేత్రంలో నిర్వహించనున్న సమావేశంలో ప్లానెటరీ సొసైటీ ఆఫ్ ఇండియా ఫౌండర్ సెక్రటరీ, డైరెక్టర్ ఎన్. రఘునందన్ కుమార్, ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ శేషగిరిరావు వెల్లంకి రాకెట్ ప్రయోగంపై ప్రసంగిస్తారని పేర్కొన్నారు. భద్రకాళి బండ్ ప్రామినాడ్ వద్ద రాకెట్ ప్రయోగాన్ని వీక్షించేందుకు సాయంత్రం 4 గంటల నుంచి విద్యార్థులు, శాస్త్ర విజ్ఞాన ఆసక్తి గల ప్రజలకు ఉచిత ప్రవేశం కల్పిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో డీఈవో గిరిరాజు గౌడ్, హనుమకొండ తహసీల్దార్ రవీందర్ రెడ్డి, పోలీస్, మున్సిపల్ మరియు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు..



# హనుమకొండ జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన చాహత్ బాజ్ పాయ్

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఫిబ్రవరి 26 (ప్రజా వీక్షణం న్యూస్)**

హనుమకొండ జిల్లా నూతన కలెక్టర్ గా చాహత్ బాజ్ పాయ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చాహత్ బాజ్ పాయ్ ను కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, జిల్లా రెవెన్యూ అధికారి వై.వి. గణేష్, ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ కన్నం నారాయణ, పలువురు జిల్లా అధికారులు, తహసిల్దార్లు నూతన కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ ను మర్యాద పూర్వకంగా కలిసి మొక్కలు, పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. బాధ్యతలు స్వీకరించేందుకు కలెక్టరేట్ ప్రాంగణానికి చేరుకున్న జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ కి అదనపు కలెక్టర్, అధికారులు ఘనంగా స్వాగతం పలికి పూల మొక్కలు పుష్పగుచ్చాలను అందించారు. జిల్లా కలెక్టర్ గా కలెక్టర్ ఛాంబర్ లో బాధ్యతలు స్వీకరించారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ గా పని చేసిన స్నేహ శబరిష్ బదిలీపై మహబూబాబాద్ జిల్లాకు కలెక్టర్ గా వెళ్ళగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ గా ఉన్న చాహత్ బాజ్ పాయ్ హనుమకొండ జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించారు.



# రిజర్వాయర్ లోకి దూసుకెళ్లిన షిఫ్ట్ కారు

## ప్రమాద వశాత్తు కారు పల్టీలు కొట్టి రిజర్వాయర్ లో పడింది

## డ్రైవింగ్ చేస్తున్న పవన్ మృతి చెందాడు. చరణ్ కారు అద్దాలు పగిలి బయట పడ్డాడు

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఫిబ్రవరి 26 ప్రజా వీక్షణం న్యూస్**

జనగామ జిల్లా స్టేషన్ ఘన పూర్ ప్రాంతంలో రిజర్వాయర్ లోకి షిఫ్ట్ కారు దూసుకెల్లడం జరిగింది. స్టేషన్గన్పూర్ నుండి చిల్పూర్ మండలం వైపు వెళ్తున్న షిఫ్ట్ కారు అదుపుతప్పి రిజర్వాయర్ లోకి దూసుకెళ్లింది. స్థానికుల సమాచార ప్రకారం కారు పాల్టీలు కొట్టుకుంటూ రిజర్వాయర్లో పడినట్లు తెలుస్తుంది. ప్రమాద సమయంలో కారు అద్దాలు పగలడం తో ధరావత్ చరన్(18) తీవ్ర గాయాల పాలయ్యాడు. అతడు గాయాలతో అపస్మారక స్థితిలో ఉన్నట్లు సమాచారం. వెంటనే స్థానికులు తనని ఆసుపత్రికి తరలించారు. కారు నడుపుతున్న భూక్య పవన్ ఆచూకీ తెలియకపోవడం తో సమాచారం అందుకున్న పోలీస్ సిబ్బందితో కలిసి ఎస్ఐ రాజేష్ ఘటన స్థలాన్ని చేరుకొని రిజర్వాయర్లో గాలింపు చర్యలు చేపట్టారు. అనంతరం చేపట్టిన చోదనలో భూక్య పవన్ మృతదేహం లభ్యం అయింది. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. దేశ తండా పరిసర ప్రాంతాల్లో విషద చాయలు కమ్ముకున్నాయి. పోలీసులు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.





# కొత్త బ్రేకర్ ను ప్రారంభించిన యస్ ఇ జాడే ఉత్తమ్.

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఫిబ్రవరి 26(ప్రజా వీక్షణం న్యూస్)**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఈస్గమ్ 132 /33 ౯ఐ సబ్ స్టేషన్ లో నూతన 33 ౯ఐ ఎల్కపల్లి బ్రేకర్ ను గురువారం ప్రారంభించిన ఆసిఫాబాద్ యస్ ఇ జాడే ఉత్తమ్. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గతం లో దహెగాం 33 ౯ఐ బ్రేకర్ పైన ఆరు 33/11 ౯ఐ సబ్ స్టేషన్ లు ఉండేవి, ఇప్పుడు నూతన 33 ౯ఐ ఎల్కపల్లి బ్రేకర్ ఏర్పాటు చేయడం వలన ఒక్కొక్క బ్రేకర్ పైన 3 సబ్ స్టేషన్ ల విద్యుత్ సరఫరా చేయనున్నామన్నారు. ఇది ఏర్పాటు చేయడం వలన దహెగాం, పెంచికల్పేట్ మండల విద్యుత్ సరఫరా లో అంతరాయం తగ్గుతుంది అని అన్నారు. ఈ కార్యక్రమం లో కాగజ్ నగర్ డి ఈ నాగరాజు, కన్స్ట్రక్షన్ డి ఈ వీరేష, ఏ డి ఈ లు ఇర్ఫాన్ అహ్మద్, గోపాల్, ఏ ఈ లు రాంప్రసాద్, రవీందర్ లైన్ ఇన్స్పెక్టర్ ఎమ్మాజీ సతీష్ సిబ్బంది పాల్గొన్నారు.




# ఇరిగేషన్ ప్రాజెక్ట్ పనుల పురోగతి పై సంబంధిత అధికారులతో సమీక్ష జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఫిబ్రవరి 26 (ప్రజా వీక్షణం న్యూస్)**

జే. చొక్కారావు దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద గురువారం సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టనున్న కాకతీయ కెనాల్ పనులు అత్యంత ప్రాధాన్యంతో చేపట్టాలని సూచించారు. కెనాల్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను ఆలస్యం చేయకుండా వెంటనే ప్రారంభించి, వేగవంతంగా పూర్తి చేయాలని రెవెన్యూ మరియు ఇరిగేషన్ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రాజెక్ట్ పనులు సమయానికి పూర్తయితే రైతులకు సాగునీరు అందుబాటులోకి వచ్చి వ్యవసాయ ఉత్పత్తి పెరుగుతుందని ఆమె పేర్కొన్నారు. శాఖల మధ్య సమన్వయంతో సమస్యలు తలెత్తిన వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి, వరంగల్, నర్సంపేట ఆర్డీవోలు సుమ ఉమారాణి, సంబంధిత తహసీల్దార్లు ఇరిగేషన్ శాఖల, నేషనల్ హైవే అధికారులు మరియు సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.




# జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా..

**ఆదిలాబాద్ జిల్లా 26(ప్రజా వీక్షణం న్యూస్)**




ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నిరుద్యోగ యువతీ యువకులకు సువర్ణావకాశం. 2000 పైగా ఉద్యోగ అవకాశాలు. 50 కి పైగా పాల్గొననున్న కంపెనీలు. 13 వేల నుండి 40 వేల వరకు వేతనం అవకాశం. హైదరాబాద్, ఆదిలాబాద్, నిర్మల్, ఆర్మూర్, మంచిర్యాల్, నిజామాబాద్, మహారాష్ట్ర, మరియు పలు జిల్లాలలో ఉద్యోగ అవకాశాలు. మార్చి 10 ఆదిలాబాద్ ఏఆర్ హెడ్ క్వార్టర్ లో మెగా జాబ్ మేల ఏర్పాటు. పోస్టర్ను ఆవిష్కరించిన జిల్లా ఇన్చార్జి మినిస్టర్ జూపల్లి కృష్ణారావు, ముఖ్యమంత్రి సలహాదారు వేమ్ నరేందర్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్పీ. https://docs. google. com/forms/d/e/1FAIpQLScKBZmAt_Lw0DZ5X_FAFa3dw6mH7Cvf1ytY1ZSzgBvWmNiqKg/viewform అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవలసిన లింక్. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యువకులకు మరియు ముఖ్యంగా ఆదివాసి యువతి యువకులకు అభివృద్ధి చెందాలనే సదుద్దేశంతో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మార్చి పదవ తారీఖున జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ నందు భారీ స్థాయిలో యువత పాల్గొనాలని వ్యక్తం చేశారు.

## ఐ టి డి ఎ వారి ఆధ్వర్యంలో

# కనికి గ్రామం ఎడ్లగూడ వాసులకు త్రాగునీటికి శాశ్వత పరిష్కారం..

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఫిబ్రవరి 26 (ప్రజా వీక్షణం న్యూస్)**

కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా, కౌటల మండలంలోని కనికి గ్రామ పంచాయతీ వార్డు 8 (ఎడ్లగూడ) ప్రాంతంలో సంవత్సరాల తరబడి త్రాగునీటి కొరతతో ఇబ్బంది పడుతున్న గ్రామస్తులకు గొప్ప ఊరట లభించింది. ఇటీవల ఏర్పాటు చేసిన కొత్త బోరవెల్ ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. గ్రామస్తులు మాట్లాడుతూ, "ఎన్నో ఏళ్లుగా త్రాగునీటి కోసం బాధపడుతున్నాం. ఈ బోరవెల్‌తో ఇక ముందు ఆ సమస్య తీరిపోతుంది. గ్రామ పంచాయతీ ప్రతినిధులు స్పందించి త్వరగా చర్య తీసుకోవడం ప్రశంసనీయం" అని తెలిపారు. ఈ బోరవెల్‌ను ఐ టి డి ఎ ఉట్నూర్ వారి యస్ టీ స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్ (షెడ్యూల్డ్ ట్రైబ్స్ స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్) కింద మంజూరు చేశారు. ఈ అవకాశం కల్పించినందుకు సర్పంచ్ శ్రీనివాస్ గారు ఐ టి డి ఎ అధికారులకు, సంబంధిత అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. బోరవెల్ ప్రారంభ కార్యక్రమంలో కనికి సర్పంచ్ శ్రీనివాస్, ఉప సర్పంచ్ ఓంకార్ అభిలాష్, వార్డు సభ్యురాలు ఎడ్ల భాగ్యలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి విఠల్ తదితరులు పాల్గొన్నారు. గ్రామ పెద్దలు ఎడ్ల భీమయ్య, మడే భిక్షపతి, రాస్పల్లి శ్రీనివాస్, రంగయ్య మరియు ఇతరులు కూడా ఈ కార్యక్రమంలో హాజరయ్యారు.



# మున్సిపల్ వైస్ చైర్మన్ కు విశ్రాంత గెజిటెడ్ అధికారుల సంఘం సన్మానం



**ప్రజా వీక్షణం న్యూస్, నిర్మల్ బ్యూరో ఫిబ్రవరి 26.**

నిర్మల్‌కు చెందిన విరమణ పొందిన గెజిటెడ్ అధికారుల సంఘ సభ్యులు మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్‌ను ఆయన మున్సిపల్ చాంబర్‌లో కలుసుకుని సంప్రదాయ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు హృదయపూర్వక అభినందనలు మరియు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సమావేశం అనుభవం మరియు నాయకత్వం మధ్య ఉన్న అందమైన అనుబంధాన్ని ప్రతిబింబించింది. ఈ సందర్భంగా సంఘ సభ్యులు మాట్లాడుతూడమున్సిపల్ పరిపాలనకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. విరమణ పొందిన ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తాము ఎప్పుడైనా సహకరించడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. దశాబ్దాల పరిపాలనా అనుభవం కలిగిన సీనియర్ పౌరులుగా పట్టణాభివృద్ధి కోసం తమ విలువైన సూచనలు, సలహాలు అందించడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం పరస్పర గౌరవం, సార్థకమైన సంభాషణలు, ప్రజాసేవ పట్ల ఉన్న నిబద్ధతతో సార్థకంగా జరిగింది. ఈ సన్మాన కార్యక్రమంలో సంఘ సభ్యులు డి. రామ్ రెడ్డి, జాల్దా రాజేశ్వర్, దేశ్ పాండే, గజ్జారం, గంగాధర్ యాదవ్, పి. నరసయ్య, బూరా ఉమాశంకర్, ఎల్. రాజేశ్వర్ రెడ్డి, పి. శంకర్ రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భం ఐక్యత, కృతజ్ఞతాభావం మరియు సమాజ సేవ పట్ల ఉన్న అచంచలమైన స్ఫూర్తికి నిదర్శనంగా నిలిచింది.

# కాగజ్ నగర్ పట్టణంలో పలు సమస్యలపై జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు..

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఫిబ్రవరి 26 (ప్రజా వీక్షణం న్యూస్)**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలో నెలకొన్న పలు ప్రజా సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ వైస్ చైర్మన్ డాక్టర్ అనిత ఆధ్వర్యంలో, భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) కౌన్సిలర్లు కలిసి జాయింట్ కలెక్టర్ గారిని కలుసుకుని వినతి పత్రం సమర్పించారు...పట్టణంలో ఇటీవల తీవ్రతరమైన మౌలిక వసతుల సమస్యలు ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని వారు తెలిపారు. ముఖ్యంగా రహదారుల దుస్థితి, పారిశుధ్య సమస్యలు, డ్రైనేజ్ వ్యవస్థ లోపాలు, తాగునీటి సరఫరా అంతరాయాలు వంటి అంశాలను జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు....ఈ సందర్భంగా డాక్టర్ అనిత మాట్లాడుతూ, పట్టణ అభివృద్ధి కోసం అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు పరిపాలన యంత్రాంగం చురుకుగా స్పందించాలని విజ్ఞప్తి చేశారు. జాయింట్ కలెక్టర్ సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్‌కు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు మరియు నాయకులు పాల్గొన్నారు..





# ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

**ప్రజా వీక్షణయాబాద్, ఫిబ్రవరి 26 :**

బోధన్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించారు. గురువారం ఇంటర్ సెకండియర్ పరీక్ష కొనసాగగా, విద్యార్థుల హాజరు గురించి కలెక్టర్ ఆరా తీశారు. నిబంధనలకు అనుగుణంగానే పరీక్ష నిర్వహిస్తున్నారా? అని పరిశీలించారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీటి వసతి, ప్రథమ చికిత్స సదుపాయం, ఏ.ఎన్.ఎం, టాయిలెట్స్ అందుబాటులో ఉన్నాయా అని గమనించారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సజావుగా పరీక్షలు జరిపించాలని సూచించారు. పరీక్ష పూర్తయిన వెంటనే ఆన్సర్ షీట్లు తగిన పోలీసు బందోబస్తు మధ్య నిర్దేశిత కేంద్రాలకు తరలించాలని, ఎలాంటి కాపీయింగ్ కు అవకాశం లేకుండా పూర్తి పారదర్శకంగా, పక్కాగా పరీక్షలు జరిపించాలని ఆదేశించారు. సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వాచీలు వంటి ఉపకరణాలు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించకూడదని సూచించారు. కలెక్టర్ వెంట బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో ఉన్నారు.

ప్రజావీక్షణం
దినపత్రిక

## సంపాదకీయం

# మమతా బెనర్జీ కళ్లు తెరవాలి !

బెంగాల్లో సర్ ప్రక్రియపై అభ్యంతరాలు వ్యక్తం కావడంతో అక్కడ జ్యుడిషియల్ అధికారుల అజమాయిషీలో జరగాలని ఇటీవల సుప్రీంకోర్టు ఆదేశించింది. దీంతోపాటే సర్ ప్రక్రియను అడ్డుకోరాదని మమతా బనర్జీకి సుప్రీం గట్టిగానే సూచించింది. నిజానికి సర్ ప్రక్రియ ద్వారా ఓట్లను సంస్కరించడం అవసరమే. తమిళనాట లక్షల్లో ఓట్లు తొలగించారు. గుజరాత్‌లోనూ తొలగించారు. ఇప్పుడు దక్షిణాదిలో కూడా సర్ ప్రక్రియ కొనసాగనుంది. ఈ క్రమంలో ఓట్లు తొలగింపు వల్ల ఎవరైనా తమ ఓటు నిజంగానే కోల్పోతే వారి పక్షాన ప్రభుత్వం పోరాడాలి. అంతే తప్ప అడ్డుకోవడం సరికాదు. ఇదేదో రాజ్యాంగ విఘాతం కలిగించారన్న రీతిలో ప్రచారం చేయడం విపక్షాలకు తగదు. ఎన్నికల కమిషన్ ఏం చేసినా, ఎలా చేసినా విమర్శించే విపక్ష స్థానంలో ఉన్న కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, డిఎంకెపార్టీలు తీవ్రంగా అడ్డుపడు తున్నాయి. బ్యాలెట్ బాక్స్ లతో ఓటింగ్ విధానం ఎలక్ట్రానిక్ ఓటింగ్ పద్ధతికి మారాక కొన్ని ఎన్ని కల వరకూ బాగా నడిచిందని ప్రశంసలు ఇచ్చిన పార్టీలు ఇప్పుడు ఆ విధానం వల్ల తమకు నష్టం వాటిల్లుతోందని ఘోషిస్తున్నాయి. పార్టీ ఏదైనా తమకు ఓటింగ్ అనుకూలంగా రాకపోయి ఓటమిపాలైతే ఎలక్ట్రానిక్ ఓటింగ్ ప్రక్రియలో లోటుపాట్లు ఉన్నందునే తాము ఓడిపోయామని విమర్శలు గుప్పిస్తున్నారు. విపక్ష పార్టీలు తమ స్థానాలు మారినా విమర్శలకు వెనుకాడడం లేదు. 'సర్' పేరెత్తితేనే విపక్షాల్లో అదీ అతి ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగ అపచారం జరిగిందని అంటున్నారు. ఇలా కాకుండా ఎక్కడైనా ఓట్ల తొలగింపుతో ఎవరైనా నష్టపోతే దానిని ఆధారంగా చేసుకుని పోరాడాలి. కానీ మొత్తం ప్రక్రియనే వ్యతిరేకించడం ద్వారా రాజ్యాంగాన్ని తృణీకరిస్తున్నాయని గుర్తించాలి. సుప్రీం ఇచ్చిన ఆదేశాలు లేదా సూచనలు ఆయా రాజకీయ పార్టీలకు కనువిప్పు కావాలి. ఇంకా సర్ ప్రక్రియను అప్రతిష్టపాలు చేయాలనే ఆలోచన నుంచి రాజకీయ పార్టీలు బయటపడాలి. ఎన్నికల కమిషన్ పై సవాల్ చేసిన కాంగ్రెస్ పార్టీ ఓట్ చోరీపై తమ నిరసన ధ్వనులను పెంచుతున్నాయి. ఒకపక్క ఎన్నికల కమిషన్ త్వరలో ఎన్నికలు జరిగే పశ్చిమబెంగాల్, తమిళ నాడు, కేరళ వంటి రాష్ట్రాలలో ఓటర్ల జాబితా విస్తృత సవరణ (సర్) కార్యక్రమాన్ని చేపట్టగా కాంగ్రెస్ అధ్యక్షు డు రాహుల్గాంధీ, 'ఓట్ చోరీ' ప్రచార కార్యక్రమాన్ని బహుళ ప్రచారం చేస్తున్నారు. బీహార్ ఎన్నికల్లో చతికిలపడినా ఓటరు జాబితా విషయంలో రాజీ పడేది లేదనే ధోరణిలో ముందుకు కదులుతున్నారు. బీహార్లో 'సర్' కార్యక్రమం చేపట్టినప్పుడు ఎన్నికల కమిషన్ను కాంగ్రెస్ పార్టీ విపరీ తంగా ఆరోపణలు గుప్పించింది. ఎన్నికల కమిషన్ తన ధోరణిలో తనప్రణాళిక ప్రకారం ఓటరు జాబితా సవరణ కార్యక్రమం చేపట్టింది. ఎన్నికలు సజావుగానే నడిపించింది. బీహార్లో అప్పటికే అధికారంలో ఉన్న పార్టీకే ప్రజలు పట్టం కట్టారు. అంటే విపక్షాల అభ్యంతరాలు ఎవరినీ కదిలించలేదన్నది సుస్పష్టం. అయినా కాంగ్రెస్ తదితర పక్షాలు తాము పట్టిన కుందేటికి మూడే కాళ్లన్న ధోరణిలో తమ పిడివాదంతో విమర్శలు గుప్పిస్తున్నాయి. ఓటు దొంగల కబంధ హస్తాల నుంచి భారత ప్రజాస్వామ్యాన్ని రక్షించే నినాదంతో కాంగ్రెస్ సంతకాల సేకరణ చేస్తోంది. బీహార్ ఫలితాల తర్వాత కాంగ్రెస్ పార్టీ తన ఆలోచనలో మార్పు తెచ్చుకోగలదని అందరూ భావించారు. కానీ అలా జరుగలేదు. కనీసం ఆది నుంచీ ఒకే మాటమీద వ్యవహా రాన్ని నడిపిస్తున్నారు. బోగస్ ఓట్లను చేర్చడం, విపక్ష అనుకూల ఓటర్లను తొలగించడం, ఓటర్ల జాబితాలో అవకతవకలకు పాల్పడడం వంటివి ఎన్నికల కమిషన్ భారతీయ జనతా పార్టీలు కలిసికట్టుగా వ్యవహరిస్తున్నాయన్నది కాంగ్రెస్ ఆరోపణలు. బిజెపి ఓటర్లకు ఆయా నియోజక వర్గాల్లో నగదు పంచుతున్నా చర్యలు తీసుకోకుండా, ఇసి సహకరిస్తోందని విపక్షాలు గట్టిగా నమ్ముతున్నాయి. తాజాగా పశ్చిమ బెంగాల్లో ఓటర్ల జాబితా సవరణ మొదలైంది. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కూడా ఎన్నికల కమిషన్పై రుసరుసలాడుతున్నారు. దేశవ్యాప్తంగా ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఒక ఉద్దేశపూర్వక కుట్రగా అభివర్ణించారు. బీహార్ లో 'సర్' అమలులో విజయవంతమైన కార్యక్రమంగా రూపొందించి దేశవ్యాప్తంగా ఇలాంటి కార్యక్రమాన్ని చేప ట్టేందుకు ఇసి నిర్ణయం తీసుకుందంటే అది ఎంతోమంచి కార్యక్రమమేననుకోవాలి. అయినా బిజెపియేతర ఇండియా కూటమిలు ప్రధానపక్షమైన కాంగ్రెస్ఎన్నికల కమిషన్ వివవరణలను ఆకళింపు చేసుకోలేకపోయింది. దానికితోడు దేశవ్యాప్త 'సర్' విచారణ కోసం నియమితులైన 16మంది బిఎల్ఎలు ఒత్తిడి వల్లనే మరణించారన్న వార్తలను ఆసరాగా చేసుకుని ఇసి ఒత్తిడిలపై కాంగ్రెస్ ధ్వజమెత్తింది. పశ్చిమ బంగలోని ధులగోరి, బిరాటి, న్యూటేన్ ఘుసురి వంటి ప్రాంతాల్లో ఎక్కువగా ఉండే బంగ్లా దేశీయులు ఓటర్ల జాబితా ఏరివేతలో తగు పత్రాలు చూపలేక అక్రమంగా వలస వచ్చినట్లు తేలినవారంతా ఇప్పుడు బంగ్లాదేశ్ దారిపట్టారు. ఇప్పుడీ కార్యక్రమం వలన పశ్చిమ బెంగాల్లో సంక్లిష్ట పరిస్థితులేర్పడ్డా యి. బంగ్లాదేశ్ నుంచి వచ్చి బెంగాల్లో ఉండేవారి పత్రాలను చూసే పనిని బిఎస్ఎఫ్ జవాన్లకు అప్పగించారు. వెనక్కివెళ్లే సమయంలోనూ వీరే వారిపత్రాలను పరిశీ లించి పోలీసులకు పంపాల్సి ఉంటుంది. ఈ పక్రియ ఎంతో కష్టమైనది. సుదీర్ఘమైనది. బంగ్లాదేశీయుల రివర్స్ మైగ్రే షన్తో బెంగాల్ పోలీసులు సతమత మవుతున్నారు. సరైన పత్రాలు లేనివారిని నిర్బంధించి జైల్లోపెట్టే పరిస్థితి ఉంది. నిజానికి బంగ్లాదేశీయులు పశ్చిమ బెంగాల్లో ప్రవేశించిన ప్పుడు దళారీల ద్వారా ఆధార్ కార్డులు రేషన్ కార్డులు, ఓటరు ఐడీలతో ప్రవేశించారు.

# విహెచ్, జెట్టిలకు రాజ్యసభ ఇవ్వాలి

### ఆ ఇద్దరి సభ్యతంవాలపై ఆలోచన చేయాలని

### ఖర్గేను కలిసి కోరిన కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి26ప్రజా వీక్షణం:**

తెలంగాణలో ఖాళీ అవుతున్న రెండు రాజ్యసభ స్థానాల్లో కాంగ్రెస్ సీనియర్ నేత వి. హనుమంతరావు, జెట్టి కుసుమ కుమార్‌లకి ఇవ్వాలని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. ఈ మేరకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి గురువారం ఢిల్లీలో కలిశారు. ఖర్గేతో ఆయన పలు కీలక అంశాలపై చర్చించారు. తెలంగాణలో ఖాళీ కానున్న రెండు రాజ్యసభ స్థానాలపై సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్, ఇన్‌చార్జ్ మీనాక్షి నట రాజన్‌తో కూడా ఈ విషయంపై మాట్లాడానని, వి. హనుమంతరావు, జెట్టి కుసుమ కుమార్‌లకి రాజ్యసభ ఇవ్వాలని కోరానని అన్నారు. ఇదే విషయంపై రాహుల్ గాంధీని, మల్లికార్జున్ ఖర్గేని కలవడానికి ఢిల్లీకి వచ్చానని తెలిపారు. రాహుల్ గాంధీ ముందస్తు షెడ్యూల్ కారణంగా ఆయన బిజీగా ఉన్నారని చెప్పుకొచ్చారు. వి. హనుమంతరావు. జెట్టి కుసుమ కుమార్‌లకు రాజ్యసభ అవకాశాలపై ఆలోచన చేయాలని కోరానని తెలిపారు. జెట్టి కుసుమ కుమార్.. యూత్ కాంగ్రెస్ లీడర్‌గా, స్టూడెంట్ లీడర్‌గా.. కమ్మ సామాజిక వర్గం నుంచి ఉన్నారని ప్రస్తావించారు. జెట్టి కుసుమ కుమార్ ఫ్యామిలీ ఫ్రీడమ్ ఫైటర్స్ అని, వాళ్ల కుటుంబం నుంచి అంతా కాంగ్రెస్‌లోనే ఉన్నారని గుర్తుచేశారు. హనుమంతరావు తెలంగాణలో అనేక మంది ముఖ్య మంత్రులతో పని చేశారని వెల్లడించారు. మూడుసార్లు రాజ్యసభ ఎంపీగా పని చేశారని చెప్పుకొచ్చారు. ఆయనకు రాజీవ్ గాంధీ , సోనియాగాంధీ అవకాశాలు ఇచ్చారని తెలిపారు. వి.హనుమంతరావు చురుకైన వ్యక్తి అని, ఆయనకు మరోసారి రాజ్యసభకు అవకాశం ఇవ్వాలని ఖర్గేను కోరానని అన్నారు. కమిటీలో చర్చిస్తామని ఖర్గే హామీ ఇచ్చారని తెలిపారు. రాహుల్ గాంధీ నిర్ణయం మేరకు ముందుకు వెళ్తామని జగ్గారెడ్డి పేర్కొన్నారు.



# కెసిఆర్ వల్లనే తెలంగాణ అప్పలపాలు: వివేక్

**హైదరాబాద్,ఫిబ్రవరి26(ప్రజా వీక్షణం):**

కేసీఆర్ నిర్ణయాల వల్లే తెలంగాణ అప్పుల పాలైందని.. కమిషన్ల కోసమే ఆయన ప్రాజెక్టులు కట్టారని మంత్రి వివేక్ వెంకటస్వామి విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ పేరుతో బీఆర్ఎస్ లక్ష కోట్ల అవినీతికి పాల్పడిందన్నారు. రూ.లక్షా 75 వేల కోట్లు కాళేశ్వరం ప్రాజెక్ట్ కోసం ఖర్చు చేశారని.. కానీ నాలుగేండ్లకే ఆ ప్రాజెక్ట్ కుప్పకూలిందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ వల్ల తెలంగాణ ప్రజలపై మోయలేని భారం పడిందన్నారు. పదేండ్లలో బీఆర్ఎస్ పార్టీ ఆస్తులు, సొంత ఆస్తులు పెంచుకుందని అన్నారు. ప్రపంచంలోనే ధనిక రీజనల్ పార్టీ బీఆర్ఎస్ మాత్రమేనని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిని ఎప్పటికప్పుడు ప్రజలకు వివరించామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవకతవకలపై విచారణ చేసేందుకు కేసు సీబీఐకి అప్పగించామని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ పై సీబీఐ ఎంక్వైరీ చేయాలని డిమాండ్ చేశారు. కమిషన్ల కోసమే ప్రాణహిత చేవెళ్ల డిజైన్ మార్చారని అన్నారు.

# విశ్వనాథ్‌పేట్ పాఠశాల పునఃప్రారంభం చేయాలి

**ప్రజా వీక్షణం న్యూస్, నిర్మల్ బ్యూరో ఫిబ్రవరి 26.**

నిర్మల్ పట్టణంలోని విశ్వనాథ్‌పేట్‌లో ఎంపీపీఎస్ విశ్వనాథ్‌పేట్ టి/ఎం పాఠశాల అకస్మాత్తుగా మూసివేయడంతో తీవ్ర ఆందోళన నెలకొంది. ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన చిన్నారులు తమ విద్యను కొనసాగించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఒకప్పుడు 100 మందికి పైగా విద్యార్థులు, ఇద్దరు నిబద్ధత గల ఉపాధ్యాయులతో కళకళలాడిన ఈ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఇప్పుడు నిశ్శబ్దంగా మారింది. 16-06-2025 నాటికి పాఠశాలలో కేవలం 11 మంది విద్యార్థులు మాత్రమే మిగిలి ఉండగా, ఉపాధ్యాయులపై నిర్లక్ష్యం మరియు అవకతవకల ఆరోపణల నేపథ్యంలో పాఠశాలను మూసివేశారు. అనంతరం ఉపాధ్యాయులను ఇతర పాఠశాలలకు బదిలీ చేశారు.

**అయితే, ఈ పరిపాలనా చర్యకు నిజమైన బలులు చిన్నారులే.**

పాఠశాల మూసివేతతో ఇప్పటికే పలువురు విద్యార్థులు చదువు మానేశారని తల్లిదండ్రులు చెబుతున్నారు. చాలా కుటుంబాలు ప్రైవేట్ విద్యను భరించలేకపోవడం, దూర ప్రాంతాల్లోని పాఠశాలలకు రవాణా సౌకర్యం లేకపోవడం వల్ల పిల్లల భవిష్యత్తు అంధకారంలో పడింది. రోజువారీ కూలీలు మరియు బీపీఎల్ కుటుంబాలకు ఈ సమీప ప్రభుత్వ పాఠశాల కేవలం చదువు నేర్చుకునే స్థలం మాత్రమే కాదుఅది వారి ఆశల ప్రతీక, మంచి భవిష్యత్తుకు మార్గదర్శకం.

మాజీ జిల్లా పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు అతీఖ్ అహ్మద్ మరియు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సబా కలీమ్ జిల్లా విద్యాధికారి, నిర్మల్ గారికి వినతిపత్రం సమర్పించి పాఠశాలను తక్షణం పునఃప్రారంభించాలని డిమాండ్ చేశారు. పాఠశాల మూసివేత రైట్ టు ఎడ్యుకేషన్ చట్టం ఆత్మకు విరుద్ధమని, పేద పిల్లల భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టేస్తోందని వారు పేర్కొన్నారు.

"పరిపాలనా లోపాల కోసం అమాయక పిల్లలను శిక్షించడం అన్యాయం. వారి విద్య అంతరాయం లేకుండా కొనసాగేందుకు అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలి," అని వినతిపత్రంలో పేర్కొన్నారు.వారు చేసిన ప్రధాన డిమాండ్లు: ఎంపీపీఎస్ విశ్వనాథ్‌పేట్ టి/ఎం పాఠశాలను తక్షణమే పునఃప్రారంభించాలి. ప్రభావితమైన అన్ని విద్యార్థుల విద్యా నిరంతరతకు హామీ ఇవ్వాలి.

తరగతి గదులు తాళాలు వేసి, ఆట స్థలాలు వెలవెలబోతున్న ఈ సమయంలో విశ్వనాథ్‌పేట్ అంతటా ఒకే ప్రశ్న వినిపిస్తోంది: ఈ 11 మంది చిన్నారుల స్వరం వారి కలలు చెదిరిపోకముందే అధికారుల చెవిన పడుతుందా?

సమాజం ఇప్పుడు విద్యాశాఖ తక్షణ జోక్యాన్ని ఆశిస్తోందివారి ప్రియమైన పాఠశాల తలుపులు మళ్లీ తెరుచుకుని, వాటితో పాటు అవకాశాల ద్వారాలు కూడా తెరుచుకోవాలని ఎదురుచూస్తోంది.




# సహకార సొసైటీ కార్యదర్శి కృష్ణకు ఎన్సీడీసీ పురస్కారం

**ప్రజా వీక్షణం న్యూస్ ముస్తాబాద్**

రాష్ట్ర రాజధాని హైదరాబాదులో జరిగిన జాతీయ సహకార అభివృద్ధి సంస్థ వారి ఆధ్వర్యంలో సహకార శ్రేష్ఠత మరియు ప్రతిభకు ప్రాంతీయ అవార్డులు -2025 కార్యక్రమంలో వ్యవసాయం మరియు సహకార శాఖ కార్యదర్శి కే సురేంద్రమోహన్, డైరెక్టర్ శార్దుల్ జాదవ్, టిజిసిఎబి వై కృష్ణారావు చేతుల మీదుగా ప్రథమ పురస్కారాన్ని సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలము పోతుగల్ సహకార సొసైటీ కార్యదర్శి జంగ కృష్ణకు అందజేసి అభినందించారు.




# పాఠశాలలను తనిఖీ చేసిన ఎంఈఓ

**ప్రజా వీక్షణం న్యూస్ ప్రతినిధి ఆర్మూర్ టౌన్**

ఆర్మూర్ మండలంలోని పలు పాఠశాలలను గురువారము ఎంఈఓ రాజా గంగారం ఆకస్మికంగా తనిఖీ జరిపారు. సురేబిర్యాల, ఖానాపూర్, ఖానాపూర్ వడ్డెర కాలనీ, ఫాతేపూర్ ప్రాథమిక పాఠశాలలను, సురేబిర్యాల ఉన్నత పాఠశాల, ఫాతేపూర్ ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. ప్రాథమిక పాఠశాలలో ఎఫ్ఎల్ఎస్ కార్యక్రమంలో చేపడుతున్న చర్యలు, పిల్లలలో భాషాంశాల అవగాహన తీరు, గణిత బోధనలో అనుసరిస్తున్న మెలకువలు ఆరా తీశారు. విద్యార్థులకు భాషా, గణిత అంశాలపై అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు.



# ఆయిల్ పామ్ సాగుకు రైతులు ముందుకు రావాలి : కలెక్టర్ గరిమ అగ్రవాల్

ప్రజా వీక్షణం న్యూస్ ముస్తాబాద్



ఆయిల్ పామ్ పంట సాగు ద్వారా అధిక దిగుబడితో పాటు దీర్ఘకాలంపాటు అధిక ఆదాయాన్ని పొందవచ్చని, పంట సాగుకు రైతులు ముందుకు రావాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు. ఆయిల్ పామ్ సాగు, ఫెర్టిలైజర్ యాప్, వ్యవసాయ యాంత్రీకీకరణ, రైతుల వివరాల నమోదు, క్రాప్ బుకింగ్ తదితర అంశాలపై రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ లో గురువారం వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించగా, కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. జిల్లాలో క్రాప్ బుకింగ్ కోసం ఏఈఓలకు సహాయం అందించేందుకు 165 మంది వాలంటీర్లను నియమించామని కలెక్టర్ దృష్టికి జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం తీసుకువెళ్ళారు. క్రాప్ బుకింగ్ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. లిఫార్మర్స్ రిజిస్ట్రీలి కింద జిల్లాలోని అందరు రైతుల వివరాలు ఆన్లైన్లో నమోదు చేయాలని ఆదేశించారు. చనిపోయిన, డబుల్ ఎంట్రీ వివరాలు జాబితాలో లేకుండా పకడ్బందిగా చేయాలని స్పష్టం చేశారు. ఏవోలు, ఏఈవోలు సంయుక్తంగా ఈ ప్రక్రియను రెండు వారాల్లో పూర్తి చేయాలని సూచించారు. వ్యవసాయ యాంత్రీకీకరణ కింద జిల్లాకు మంజూరు అయిన పరికరాలకు రైతులు దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. లిఫెర్టిలైజర్ యాప్‌లి వినియోగం, రైతులకు అందుతున్న సేవలపై మండలాల వారీగా కలెక్టర్ సమీక్ష చేశారు. ప్రతి ఎరువుల షాప్, పీఏసీఎస్, ప్రైవేట్ షాప్స్ వద్ద హెల్ప్ డెస్క్, సహాయకులు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు.

### ఆయిల్ పామ్ సాగు పెంచాలి

జిల్లాలోని రైతులకు ఆయిల్ పామ్ సాగుతో అధిక దిగుబడి, లాభాలు తదితర అంశాలు వివరించి సాగు విస్తీర్ణం పెంచేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. త్వరలో 100 ఎకరాల్లో ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ కు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులను వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు నేరుగా కలిసి మాట్లాడాలని, వారిని క్షేత్ర స్థాయి పర్యటనకు తీసుకువెళ్లాలని ఆదేశించారు. ప్రతి ఏవో, ఏఈవో 10 ఎకరాల చొప్పున ఆయిల్ పామ్ సాగు కు డీడీలు రైతులు చెల్లించేలా చూడాలని సూచించారు. రైతు వేదికల్లో కనీస వసతులు కల్పించాలని జడ్పీ సీఈవో వినోద్ కుమార్ ను కలెక్టర్ ఆదేశించారు. సమీక్ష సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శరత్ బాబు ఉన్నారు.

# శ్రీ వాణి హై స్కూల్లో ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

ప్రజా వీక్షణం న్యూస్ ప్రతినిధి ఆత్మకూరు వనపర్తి జిల్లా.

జిల్లా కలెక్టర్ గా పూజిత, డీఈవోగా రవీందర్ విద్యార్థులు పాత్ర పోషించారు

ఒకరోజు ఉపాధ్యాయ పాత్ర పోషించినందుకు ఆనందాన్ని వ్యక్తం చేసిన పదవ తరగతి విద్యార్థులు.వనపర్తి జిల్లా ఆత్మకూరు పట్టణంలోని శ్రీ వాణి హై స్కూల్ లో పదవ తరగతి విద్యార్థులకు స్వయం పరిపాలన దినోత్సవ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా పదవ తరగతి విద్యార్థులు ఒకరోజు ఉపాధ్యాయ వృత్తిలో పాత్రలను పోషించారు.గురువారం నాడు పదవ తరగతి విద్యార్థులకు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాదాపు 70 మంది విద్యార్థులు ఉపాధ్యాయ పాత్రలతో తోటి విద్యార్థులకు బోధన చేశారు.విద్యార్థులు ఉపాధ్యాయులుగా తమ వంతు పాత్రను పోషించారు.జిల్లా కలెక్టర్ గా పూజిత,జిల్లా విద్యాధికారిగా రవీందర్ , మండల విద్యాధికారిగా శ్రీకాంత్ , ప్రిన్సిపాల్ గా సాత్విక్ మరియు శ్రీ నిత్య, వైస్ ప్రిన్సిపల్ గా టి.శృతి, కరస్పాండెంట్ గా రామ్ స్వరూప్ గౌడ్,ఉపాధ్యాయులుగా మిగతా విద్యార్థిని,విద్యార్థులు వ్యవహరించి తమ విధులను సమర్థవంతంగా నిర్వహించి,వారి అనుభవాలను పంచుకున్నారు. వీరికి పాఠశాల ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు సహకరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అడ్వైజర్ టీ.జె విశ్వేశ్వర్, ప్రిన్సిపాల్ గంగాధర్ లతా మేడమ్ ఉపాధ్యాయులు, నేడు ఒకరోజు ఉపాధ్యాయ పాత్ర పోషించిన విద్యార్థులు మాట్లాడుతూ సమాజంలో విద్యార్థులను, సమాజాన్ని సరైన మార్గంలో ముందుకు తీసుకువెళ్లటంలో ఉపాధ్యాయుని కృషి అనిర్వచనీయమైందని తెలిపారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా ఒకరోజు పాత్రను పోషించుటకు సహకరించిన పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలియజేశారు.విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందించడం,వారిని క్రమశిక్షణ గల వ్యక్తులుగా మార్చడంలో ఉపాధ్యాయుని పాత్ర ముఖ్యమైనది అని వారు తెలియచేశారు.




# రైతు భరోసా,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధులు విడుదల చేయాలి

## తెలంగాణ వ్యవసాయకార్మిక సంఘ జిల్లా అధ్యక్షులు ఎస్.అజయ్ డిమాండ్.

ప్రజా వీక్షణం న్యూస్ ప్రతినిధి మదనపూర్ వనపర్తి జిల్లా.

మదనపూర్ మండలం లోని దుప్పల్లిగ్రామం గురువారం విలేకరుల సమావేశం లో మాట్లాడుతూ డిసెంబర్ లోనే రైతు భరోసా నిధులను విడుదల చేయాల్సి ఉన్న ప్రభుత్వం ఊరించడం తప్ప రైతు భరోసా అమలు లో నిర్లక్ష్యం వ్యవహరించడం దారుణమని విమర్శించారు. భూమి లేని పేదలకు ప్రతి యేటా 12000 రూపాయలు నగదు చెల్లిస్తామని కాంగ్రెస్ రెండు యేండ్ల పాలనలో కేవలం 6000వేల రూపాయలు మాత్రమే చెల్లించారని అన్నారు.ఇంకా 18000 రూపాయలు నగదు ఇవ్వ లేదని ప్రభుత్వతీరును దుయ్య బట్టారు. ఈ విదంగా కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ లు ప్రకటన లకే పరిమితం అయ్యాయని విమర్శించారు. మున్సిపాల్ ఎన్నికల కోడ్ ముగియా గానే రైతు భరోసా నిధులను రైతుల ఖాతా ల్లో జమ చేస్తామనిచెప్పి తీరా కేబినెట్ ఎజెండా లోనే రైతు భరోసా ఊసే ఎత్త లేదని అన్నారు. కేంద్రం లోని బీజేపీ మహాత్మా జాతీయ గ్రామీణ ఉపాధిచట్టం ను మర్చి వీబీజీ రాంజీ గా మార్చడం ను విరమించు కోవాలని డిమాండ్ చేశారు. ఉపాధి లో ఏడాదికి 200రోజుల పనులు కల్పించాలని రోజు కూలి పని జరిగే ప్రదేశం లో కనీస వసతులు ఏర్పాటు చేయాలనీ కోరారు. ఈ సమావేశం లో కేవీపీయస్ జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్రాములు,వ్యకస జిల్లా నాయకులు చిరంజీవులు, వెంకటేష్, మొగిలి చంద్రయుడు, వేణు గోపాల్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.





# ఇసుక ర్యాంపుల దగ్గర జిపిఓ అధికారులు...

## నియమించిన తహసీల్దార్ శ్రీనివాస్

ప్రజా వీక్షణం న్యూస్ కృష్ణ... నారాయణపేట జిల్లా

మండలంలోని కృష్ణ నది నుండి పట్ట పగలు రాత్రి అని తేడా లేకుండా కొందరు నాయకులు అక్రమంగా ఇసుకను తోడి కర్ణాటక రాష్ట్రానికి అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని కృష్ణ మండల తహసిల్దార్ శ్రీనివాసు ఇసుక ర్యాంపుల దగ్గర గురువారం నుంచి జిపిఓ అధికారులను నియమించారు.అనంతరం తహసిల్దార్ మాట్లాడుతూ పట్ట పగలు కానీ రాత్రి వేళల్లో అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.



# ఇసుక లారీ పట్టివేత.. కేసు నమోదు

ప్రజా వీక్షణం న్యూస్ ప్రతినిధి బాల్కొండ

కథలాపూర్ నుంచి చిట్టాపూర్ మీదుగా అక్రమ రవాణా అవుతున్న ఇసుక లారీ(టీఎస్16 యుబి 7717 )ని స్వాధీనం చేసుకొని, డ్రైవర్ రజినీకాంత్, ఓనర్ రమేష్ పై కేసు నమోదు చేసినట్లుగా గురువారం బాల్కొండ ఎస్సై కే.శైలందర్ ఒక ప్రకటనలో తెలిపారు.



# ఆత్మకూరు రూపు రేఖలు మారుస్తాను రాష్ట్ర క్రీడా, యువజన సర్వీసుల, పాడి పరిశ్రమ, పశుసంవర్ధక, మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి.

ప్రజా వీక్షణం న్యూస్ ప్రతినిధి

ఆత్మకూరు వనపర్తి జిల్లా.

మక్తల్ నియోజకవర్గం ఆత్మకూరు మండల కేంద్రం లో నూతనంగా నిర్మించిన శ్రీ వాసవి కళ్యాణ మండపాన్ని మంత్రి ప్రారంభించారు. కళ్యాణ మండప ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథి గా విచ్చేసిన మంత్రికి అర్చకులు పూర్ణ కుంభం తో స్వాగతం పలికారు. వాసవి మాత ఆలయంలో మంత్రి శ్రీహరి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి శ్రీహరి మాట్లాడుతూ వైశ్యులు అంటే ఒక నమ్మకమని, అన్ని రంగాల్లో వైశ్యులు రాణించగలుగుతున్నారని అన్నారు.సమాజంలో ప్రజల ఆలోచన విధానాలు మార్చగలిగే శక్తి వైశ్యులకు ఉంటుందన్నారు. కిరాణా కొట్టు నడిపే వ్యాపారికి చుట్టు పక్కల ఉండే ఐదు వందల కుటుంబాలను ప్రభావితం చేసే సామర్థ్యం వారికి ఉంటుందన్నారు. ఆత్మకూరు ప్రాంతం బాగుపడాలనే తపన తో శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నానని తెలిపారు. రాబోయే రోజుల్లో ఆత్మకూరు రూపు రేఖలు మారుస్తానని మంత్రి హామీనిచ్చారు.ఎవరూ ఊహించని విధంగా ఆత్మకూరు, అమరచింత ను అభివృద్ధి చేసి చూపిస్తానని స్పష్టం చేశారు. జూరాలపై బ్రిడ్జి నిర్మించి వనపర్తి నుండి వయా ఆత్మకూరు మంత్రాలయం వరకు 4 లేన్ రోడ్డు మంజూరు అయ్యిందని గుర్తు చేశారు. సాయంత్రం 7 తర్వాత రవాణా బంద్ అయ్యే ఆత్మకూరు లో త్వరలో 24 గంటలు రవాణా సదుపాయం ఉండబోతుందన్నారు. ఎక్కడైతే ట్రాన్స్పోర్ట్ సౌకర్యం ఉంటదో అక్కడే అభివృద్ధి చెందు తుందన్నారు. పరమేశ్వర చెరువు రోడ్డు పై నుండి చెరువు మీదుగా ఆలయం వరకు భక్తుల సౌకర్యార్థం ఒక కోటి రూపాయలతో బ్రిడ్జిని నిర్మిస్తున్నట్లు మంత్రి తెలిపారు.ఇప్పటికే ఆత్మకూరు లో డయాలసిస్ సెంటర్ ను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. 25 కోట్ల తో హాస్పిటల్ ను నిర్మిస్తున్నట్లు మంత్రి తెలియజేశారు. 5 ఎకరాల భూమి ప్రభుత్వ డిగ్రీ కాలేజీ కి కేటాయించామని తెలిపారు. అదేవిధంగా పట్టణంలో సీసీరోడ్లు, డ్రైనేజిల నిర్మాణం ప్రారంభమయ్యాయని మంత్రి స్పష్టం చేశారు. ఆత్మకూరు కు రెవిన్యూ డివిజన్ కల సాకారం దిశగాఅడుగులు పడుతున్నాయని వెల్లడించారు.మీరు నాపై పెట్టుకున్న నమ్మకాన్ని ఓమ్ము చేయనని మంత్రి హామీనిచ్చారు.గతంలోభూ కబ్జాల వల్ల ఆత్మకూరు లో భూములు కొనే పరిస్థితి ఉండేది లేదన్నారు. ఇప్పుడు ధైర్యంగా భూములు కొనొచ్చని భరోసానిచ్చారు.మీకు ఏ ఆపద వచ్చినా మీకు అండగా వాకిటి శ్రీహరి ఉంటాడని స్పష్టం చేశారు.వాసవి మాతా కళ్యాణ మండపానికి సహకరించిన దాతలకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలిపారు మంత్రి వాకిటి శ్రీహరి. త్వరలో హైదరాబాద్ లో 40 వేల మంది తో చేయనున్న వాసవి మాతా పారాయణం గిన్నిస్ బుక్ అఫ్ వరల్డ్ రికార్డు ను విజయవంతం చేయాల్సిందిగా పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ రాజ్యసభ సభ్యులు టీ. జి. వెంకటేష్, రాష్ట్ర ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత, టీపీసీసీ కల్లుగీత సెల్ చైర్మన్ కేశం నాగరాజు గౌడ్,ఆత్మకూరు మున్సిపల్ చైర్ పర్సన్ నాగమణి, వైస్ చెర్మన్ నల్లగొండ శ్రీనివాసులు, మార్కెట్ కమిటి చైర్మన్ ఎం. డి. రహమతుల్లా తో పాటు తదితరులు పాల్గొన్నారు.



ప్రజావీక్షణం
దినపత్రిక

# కరీంనగర్ నూతన కలెక్టర్ గా చిత్ర మిశ్రా

ప్రజా వీక్షణం



నూతన కలెక్టర్ గా చిత్ర మిశ్రా పదవి బాధ్యతలు చేపట్టనున్నారు. ములుగు జిల్లా ఏటూరు నాగారంలో ఐటిడిఏ ప్రాజెక్టు ఆఫీసర్ గా పనిచేస్తున్న ఆమె బదిలీపై ఇక్కడికి రానున్నారు. వీరిది 2019 బ్యాచ్ తెలంగాణ కేడర్, 2020- 21 నాగర్‌కర్నూల్‌లో శిక్షణ పొందారు. జూన్ 2021 - ఫిబ్రవరి 2024 - అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు, నిజామాబాద్ లో పనిచేసారు. దీనికి ముందుగా సెప్టెంబర్ 2021- జూలై 2023 మున్సిపల్ కమిషనర్, నిజామాబాద్ (ఏపీసి) బాధ్యతలు నిర్వహించారు.

# ఒక పేచీకి వెళితే రోజు గడిచిపోతుంది..

ప్రజా వీక్షణం న్యూస్ ముస్తాబాద్

ప్రతిపక్షంలో ఉన్న రాజకీయ నాయకులు ప్రజాసేవ అంటూ అత్యుత్సాహంగా ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ చేసిన నిరసన కార్యక్రమాలకు ప్రత్యక్షంగా పరోక్షంగా భారీ మూల్యమే చెల్లిస్తున్నారు. కోర్టు కేసులు ఇబ్బందికరంగా మారాయి. ధర్నా నిరసనలు ప్రజల దైనందిన జీవనానికి ఆటంకం కలిగిస్తున్నాయనే అంశంపై పోలీసు కేసులు అవడంతో కోర్టు కేసులను ఎదుర్కొంటున్నారు. ఒక్కోసారి పేచీకి వెళితే ఒకరోజు గడిచిపోవడం సాధారణంగా తయారయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్టీలో, ప్రజల్లో పేరు మాట, పార్టీలో గుర్తింపు అంశాల మాట దేవుడెరుగు.. ఎందుకొచ్చిన కోర్టు కేసులు అంటూ ఆందోళనలకు గురవుతున్నారు.



# ప్రధాని నరేంద్రమోడీ అరుదైన రికార్డు

## ఇన్‌స్టాలో వంద మిలియన్ల దాటిన ఫాలోవర్లు

న్యూఢిల్లీ,ఫిబ్రవరి26ప్రజా వీక్షణం:

భారత ప్రధాని నరేంద్ర మోదీ మరో అరుదైన గుర్తింపును సొంతం చేసుకున్నారు. ప్రపంచంలో 100 మిలియన్ ఇన్‌స్టా ఫాలోవర్లు కలిగిన తొలి రాజకీయ నేతగా సరికొత్త రికార్డును నెలకొల్పారు. 2014లో ప్రధాని మోదీ తొలిసారిగా ఇన్‌స్టాగ్రామ్‌లో చేరారు. యువతరానికి కనెక్ట్ కావడంతో ఆయన ఫాలోవర్ల సంఖ్య నాటి నుంచీ పెరుగుతూనే ఉంది. ఫాలోవర్ల సంఖ్యాపరంగా ప్రధాని మోదీ తరువాతి స్థానంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిలిచారు. ఆయనను ఇన్‌స్టాలో ఫాలో అయ్యే వారి సంఖ్య 43.2 మిలియన్‌లు. ఆ తరువాతి స్థానాల్లో ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబొవో సుబియాంతో (15 మిలియన్ ఫాలోవర్లు), బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డి సిల్వా (14.4 మిలియన్ ఫాలోవర్లు), తుర్కియే అధ్యక్షుడు ఎర్డొగాన్ (11.6 మిలియన్ ఫాలోవర్లు), అ÷−జ్గ÷ంటీనా ప్రెసిడెంట్ జేవియర్ (6.4 మిలియన్ ఫాలోవర్లు) ఉన్నారు. ట్రంప్‌తో పాటు ఆ తరువాత నాలుగు స్థానాల్లో ఉన్న నేతల ఫాలోవర్లు సంఖ్యను కూలిపి చూసినా ప్రధాని మోదీ కంటే తక్కువగానే ఉండటం గమనార్హం. ఇక భారతీయ నేతల్లో కూడా ఫాలోవర్ల సంఖ్యాపరంగా ప్రధాని నెం.1గానే ఉన్నారు. ప్రధాని తరువాతి స్థానంలో ఉన్న యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌కు 16.1 మిలియన్ ఇన్‌స్టా ఫాలోవర్లు ఉండగా ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి ఉన్న ఫాలోవర్ల సంఖ్య 12.6 మిలియన్లు. సోషల్ మీడియాలో నిత్యం యాక్టివ్‌గా ఉండే ప్రధాని ఇన్‌స్టా వేదికగా వివిధ అధికారిక కార్యక్రమాలు, అంతర్జాతీయ పర్యటనలు, రాజకీయ కార్యక్రమాలకు సంబంధించిన ఫొటోలు వివరాలను పంచుకుంటూ ఉంటారు. తన మనసులోని భావాలను కూడా ఫాలోవర్లతో షేర్ చేసుకుంటుంటారు.



# మున్సిపాలిటీ పరిధిలో ఉన్న సమస్యలను యుద్ధప్రాతిపదికంగా పూర్తి చేయాలి.

## రాష్ట్ర పాడి పరిశ్రమల మత్స్య, క్రీడల శాఖ యువజనల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి.

ప్రజా వీక్షణం న్యూస్ ప్రతినిధి ఆత్మకూరు వనపర్తి

మున్సిపాలిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశి ఉద్దేశించి అయన మాట్లాడుతూ పట్టణంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు, కౌన్సిలర్లు సమన్వయంతో కృషి చేయాలని రాష్ట్ర పశు సంవర్ధక, క్రిడలు, యువజన శాఖల మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశించారు.గురువారం ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయ సమావేశం మందిరంలో కొత్తగా ఎంపికైన వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, ఇతర శాఖల అధికారులు సిబ్బందితో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో విద్యుత్ సమస్య, మంచినీటి సమస్య, పారిశుధ్యం సమస్యలు లేకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మున్సిపాలిటీలో సాయంత్రం 6 గంటలకు వీధి దీపాలు వెలగాలని, ఉదయం 6 గంటలకు ఆఫ్ కావాలని సూచించారు. మధ్యాహ్నం సమయంలో వీధి దీపాలు వెలగడం, రాత్రి వీధి దీపాలు వెలగకపోవడం వంటి సమస్యలు లేకుండా చూడాలని అందుకు అవసరమైన విద్యుత్ సామాగ్రి అడిగితే వెంటనే మంజూరు చేయిస్తానని అన్నారు. లో ఓల్టేజ్ ఇబ్బంది ఎక్కడ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. ఒక్కో వార్డు ఆఫీసర్ ను వార్డులో ఉన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు ఇచ్చారు. తాగు నీరు సమస్య లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని, ప్రతివారం వార్డు ఆఫీసర్లు, కౌన్సిలర్లు సమావేశం ఏర్పాటు చేసుకొని సమస్యల పరిష్కారానికి సమన్వయంతో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. డ్రైనేజీలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని, పారిశుధ్యం విషయంలో నిర్లక్ష్యం వీడాలని, దోమల బెడద లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మున్సిపాలిటీలో తాగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చేపట్టాలని, అందుకు అవసరమైన నిధులు మంజూరు చేయడం జరుగుతుందని




తెలిపారు. ప్రజలకు మెరుగైన ప్రభుత్వ వైద్య సేవలు అందించాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని ఆదేశించారు. ఆత్మకూరులో ఇప్పటికే మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లు పూర్తి అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని, అన్ని పూర్తి అయితే మరో 152 ఇళ్లు మంజూరు చేస్తానని తెలియజేశారు.అధికారులు అంకిత భావంతో పనిచేయాలని ఆదేశించారు. అధికారులకు తమ పనిమీద పట్టు లేకుంటే మాత్రం చర్యలు తప్పవని అధికారులు, సిబ్బందిని హెచ్చరించారు.ఈ సమావేశం లో లోకల్ బాడీ అదనపు కలెక్టర్ యాదయ్య, చైర్పర్సన్ నాగమణి, వైస్ చైర్మన్ నల్లగొండ శ్రీనివాసులు, కౌన్సిలర్లు, కమిషనర్ శశిధర్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# పెన్షన్ల హామీ గుదిబండ కానుందా?

పెంచితే ఖజానాపై భారీగా భారం

పెంచకుంటే విపక్షాల నుంచి విమర్శలు

మల్లగుల్లాలు పడుతున్న

## అధికార పక్షం

హైదరాబాద్,ఫిబ్రవరి26

ప్రజా వీక్షణం:

ఆరు గ్యారెంటీలు, పెన్షన్ల పెంపు, తులం బంగారంపై విపక్ష బీఆర్ఎస్ ఎక్కడిక్కడ నిలదీస్తోంది. దీనికితోడు వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో సర్కార్‌ను నిలదీసేందుకు సన్నద్ధం అవుతోంది. బడ్జెట్ లెక్కలు వేసుకుంటున్న ప్రభుత్వం ఈ మొత్తాలకు మరింత వెచ్చించాలంటే జంకుతోంది. ఇప్పటికే వేలకోట్లు అప్పులకు గాను వడ్డీలు చెల్లిస్తోంది. 2024 సామాజిక సర్వే లెక్కల ప్రకారం ప్రస్తుతం 42.7 లక్షల మందికి పింఛను అందుతోంది. ఇందుకోసం ప్రతి నెలా రూ.950 కోట్ల వరకు ఖర్చవుతోంది. ఈ పింఛన్‌ను ప్రస్తుతానికి రూ.500 చొప్పున పెంచితే.. నెలకు సుమారు రూ.210 కోట్లు అదనంగా అవసర మవుతాయి. అంటే ఏడాదికి రూ.2500 కోట్లకు పైగా భారం ప్రభుత్వంపై పడనుంది. దీనిపై తుది నిర్ణయానికి వచ్చాక బడ్జెట్‌లో కూడా ప్రస్తావించే అవకాశాలున్నాయి. తొలి విడతలో పెంచాలని భావిస్తున్న మొత్తాన్ని కూడా కలిపి బడ్జెట్‌లో కేటాయింపులు చేయనున్నట్లు తెలుస్తోంది. కాగా, దివ్యాంగుల పింఛను పొందేవారు తక్కువ సంఖ్యలోనే ఉన్నారని, వీటి వరకు కొంత ఎక్కువ మొత్తం పెంచాలన్న విజ్ఞప్తులు కూడా ఉన్నాయి. అయితే అందరికీ ఒకే విధంగా, సమ స్థాయిలోనే పెంచాలని ప్రభుత్వం ప్రాథమికంగా ఒక అభిప్రా యానికి వచ్చినట్లు సమాచారం. చేయూత ఫించన్లను ఇలా విడతల వారీగా పెంచుతూ ఎన్నికల నాటికి రూ.4 వేలకు తీసుకెళ్లాలన్న యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై ఇప్పటివరకు అధికారుల స్థాయిలో మాత్రం చర్చలు మొదలుకాలేదు. ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకున్నాకే తమకు సమాచారం చేరుతుందని ఉన్నతాధికారి ఒకరు పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు చేయూత పథకం కింద ఇస్తున్న పింఛన్‌ను పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. అయితే రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా.. పింఛను మొత్తాన్ని విడతల వారీగా పెంచాలన్న అభిప్రాయంతో ఉంది. ప్రస్తుతం చేయూత పథకం ద్వారా వృద్ధులు, ఒంటరి మహిళలు, ఎయిడ్స్ రోగులు, డయాలసిస్ రోగులు, చేనేత, గీత కార్మికులు, బీడీ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.2016 చొప్పున, దివ్యాంగులకు రూ.4016 చొప్పున పింఛను ఇస్తోంది. కానీ, ఎన్నికల సమయంలో చేయూత పింఛన్‌ను రూ.4 వేలకు, దివ్యాంగుల పింఛన్‌ను రూ.6 వేలకు పెంచుతామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఇప్పటికే ఆరు గ్యారంటీల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, సన్నబియ్యం వంటి హామీలను అమలులోకి తెచ్చిన రేవంత్‌రెడ్డి సర్కారు.. ఇప్పుడు పింఛన్ల పెంపుపై దృష్టి సారించింది. అయితే ఈ హామీని కొంతకాలం ఆగాక నెరవేర్చడమా? లేదంటే ఇప్పటి నుంచే విడతల వారీగా పింఛను పెంచుతూ వెళ్లడమా? అని ఉన్నత స్థాయిలో చర్చ జరిగినట్లు సమాచారం. విడతలవారీగా పెంచితే.. తొలి విడతలో రూ.500 పెంచాలన్న అభిప్రాయంతో ప్రభుత్వం ఉందని తెలుస్తోంది.

# కుమ్మెర ఘటనపై లోతుగా దర్యాప్తు

## బాధ్యులపై కేసు నమోదు: ఎస్పీ

నాగర్ కర్నూల్,ఫిబ్రవరి26(ప్రజా వీక్షణం):

జిల్లాలోని కుమ్మెర మల్లన్న జాతరలో జరిగిన ఘటన కలకలం రేపిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై ఇరు వర్గాల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు పోలీసులు. ఈ క్రమంలో కుమ్మెర ఘటనపై ప్రెస్ మీట్ నిర్వహించిన జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఘటనపై ఇరు వర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. దేవాలయ పూజారి పెద్ద సాయిలు యాదవ్ సాక్ష్యం ప్రకారం... చిలకేశ్వర మౌనిక, చంద్రకళ అలియాస్ చాకలి కర్రెమ్మ, భౌరమ్మ కుమ్మెర మల్లన్న దర్శనం కోసం వచ్చిన టైంలో రద్దీ ఎక్కువగా ఉందని.. ఆ సమయంలో వారు బారికేడ్ దాటటానికి ప్రయత్నించారని.. క్యూ లైన్ లో వెళ్లమని చెప్పినందుకు తన బావ కొడుకు గణెళిశ్ కు ఫోన్ చేసి పిలిచిందని తెలిపారు. భౌరమ్మ బావ కొడుకు చాకలి గణెళిష్ కుమ్మెర గ్రామం వార్తలు అనే వాట్సప్ గ్రూప్ లో శ్రీనివాస్ రెడ్డి గురించి అశ్లీల ఆడియో పోస్ట్ చేయటంతో గణెళిశ్ ను శ్రీనివాస్ రెడ్డి ప్రశ్నించాడని తెలిపారు. ఈ క్రమంలో శ్రీనివాస్ రెడ్డి మరికొంతమంది గణెళిశ్, చంద్రకళను కొట్టారని అన్నారు. దీంతో రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో శ్రీనివాస్ రెడ్డి తలకు గాయమైనట్లు తెలిపారు. ఫిబ్రవరి 18న గణెళిష్ పోలీస్ స్టేషన్ లో ఇచ్చిన ఫిర్యాదులో తన భార్య, పాపపై దాడి గురించి ప్రస్తావించలేదని.. ఇరువర్గాల వారు ఒకరిపై ఒకరు పోలీస్ స్టేషన్ లో కంప్లైంట్ ఇచ్చారని తెలిపారు పోలీసులు. ఫిబ్రవరి 20న గణెళిశ్ అతని కుటుంబసభ్యులు పోలీస్ స్టేషన్ కు వచ్చి పిటిషన్ ప్రోగ్రెస్ గురించి అడిగారని.. 21న మౌనిక తన రెండు నెలల శిశివు కదలటం లేదని నాగర్ కర్నూల్ ప్రభుత్వాసు పత్రికి వెళ్లగా... డాక్టర్లు పరీక్షించి బ్రెయిన్ డెడ్ అని అదే రోజు ఉదయం 7.55 గంటలకు ప్రకటించినట్లు తెలిపారు. హాస్పిటల్ రికార్డు ప్రకారం కుటుంబం మెడికో లీగల్ కేసు, పోస్ట్ మార్టంకు ఒప్పుకోలేదని..పాప తండ్రి గణెళిశ్ తల్లి మౌనిక రిజిస్టర్ లో సంతకాలు చేసారని తెలిపారు.పోస్ట్ మార్టం నివేదిక ప్రకారం పాపకు లోపల బయట ఎలాంటి గాయాలు లేవని నిర్ధారణ అయ్యిందని.. తెలిపారు. శ్వాసకోశ సమస్య వల్ల నిలోఫర్ లోని ఎన్.ఐ.సీ.యూలో 30 రోజుల పాటు చికిత్స అందించినట్లు తెలిపారు పోలీసులు.ఫిబ్రవరి 22న మౌనిక తాను ఎస్సి అని మరో కంప్లైట్ ఇచ్చిందని... తనను శ్రీనివాస్ రెడ్డి అనే వ్యక్తి దేవాలయ ప్రవేశం కోసం వంద రూపాయలు అడిగి కులం పేరుతో దూషించాడని తిట్టడంతోపాటు కొట్టాడని ఆరోపించింది. తనను, తన భర్తను, తన పాపపై దాడి చేసారని, మధు రెడ్డి పాపను తన్నటం వల్ల పాప రెండు మీటర్ల దూరం పడి చనిపోయిందని పిర్యాదు చేసారు. ఎస్సీ, ఎస్టీ పీఓఏ యాక్ట్ కింద కేసు నమోదు చేసి నాగర్ కర్నూల్ డీఎస్పీ విచారణ ప్రారంభించారు.ఈ కేసులో ముగ్గురు నిందితులు శ్రీనివాస్ రెడ్డి, మధు రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి లను 23న అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించామని తెలిపారు. మిగత ముగ్గురు పరారీలో ఉన్నారని... ప్రత్యేక బృందాలు వారి కోసం గాలిస్తున్నాయని తెలిపారు.

# అప్పడు అన్న... ఇప్పడు చెల్లి

## స్కూల్‌లో గుండెపోటుతో బాలిక మృతి

జయపుర,ఫిబ్రవరి26ప్రజా వీక్షణం

రాజస్థాన్‌లో ఈ విషాదకర ఘటన చోటు చేసుకుంది. కార్డియాక్ అరెస్ట్ కారణంగానే ఆ బాలిక చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మరో విషాదకర విషయం ఏంటంటే.. ఆ బాలిక అన్న కూడా కొన్ని నెలల కిందట కార్డియాక్ అరెస్ట్ కారణంగానే ప్రాణాలు కోల్పోయాడు. రాజస్థాన్‌లోని నాగౌర్ జిల్లాకు చెందిన రాజేంద్ర బపేడియా అనే వ్యక్తి తొమ్మిదేళ్ల కూతురు దివ్య స్థానికంగా ఉన్న ఓ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఐదో తరగతి చదువుతోంది. ఈనెల 23వ తేదీన ఎప్పటిలాగానే దివ్య స్కూల్‌కు వచ్చింది. ఉదయం ప్రేయర్ సమయానికి ముందు తోటి పిల్లలతో కలిసి స్కూల్ గ్రౌండ్‌లో ఆడుకుంది. ఆ సమయంలో ఉన్నట్టుండి దివ్య కుప్పకూలిపోయింది. పాఠశాల సిబ్బంది వెంటనే ఆ బాలికను హాస్పిటల్‌కు తరలించారు. హాస్పిటల్‌కు తీసుకెళ్లే సమయానికే ఆ బాలిక ప్రాణాలు కోల్పోయింది . బాలిక శరీరంపై ఎలాంటి గాయాలూ లేవు. దీంతో ఆ బాలిక కార్డియాక్ అరెస్ట్ కారణంగానే చనిపోయి ఉంటుందని వైద్యులు తెలిపారు.

# వివాహ బంధంతో ఒక్కటైన విరోష్

హైదరాబాద్,ఫిబ్రవరి26ప్రజా వీక్షణం:

నటులు విజయ్ దేవరకొండ, రష్మిక వివాహబంధంతో ఒక్కటైనట్లు తెలుస్తోంది. గురువారం ఉదయం 10.10కి రష్మిక మెడలో విజయ్ మూడుముళ్లు వేసినట్లు సమాచారం . దీంతో ఈ జంటకు అభిమానులు శుభాకాంక్షలు తెలుపుతూ పోస్టులు పెడుతున్నారు. ఈ పెళ్లి వేడుక రెండు సంస్కృతులు, సంప్రదాయాల కలయికగా జరుగుతోంది. ఉదయం విజయ్ వైపు నుంచి హిందూ సంప్రదాయ పద్ధతిలో వివాహం జరిగింది. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ వేదికగా జరుగుతోన్న ఈ వివాహానికి ఇండస్ట్రీ ప్రముఖులు హాజరయ్యారు. ఈ వివాహ సంబరాల్లో భాగంగా విజయ్ – రష్మిక 'విరోష్ ప్రీమియర్ లీగ్' పేరుతో సరదాగా ఓ చిన్న క్రికెట్ మ్యాచ్‌ను నిర్వహించినట్లు ఇన్‌స్టా వేదికగా పంచుకున్నారు. అలాగే బుధవారం హల్దీ వేడుకను నిర్వహించినట్లు విరోష్ జోడీ తెలియజేసింది. ఇక వీరి వివాహ విందును మార్చి 4న హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు.

# చిన్నారి మృతి కారకులను శిక్షించాలి

## లేదంటే హైదరాబాద్‌ను దిగ్బంధిస్తాం

## మాజీమంత్రి తలసాని హెచ్చరిక

నాగర్‌కర్నూల్,ఫిబ్రవరి26(ప్రజా వీక్షణం):

కుమ్మెర మల్లన్న జాతరలో రెండు నెలల చిన్నారి మృతికి కారణమైన వారిని శిక్షించాలని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం నాగర్ కర్నూల్ కేంద్రంలో కుమ్మెర బాధితుల పక్షాన చేపట్టిన దీక్ష శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 రోజులలో దోషులపై చర్యలు తీసుకోకుంటే హైదరాబాద్‌ను దిగ్బంధం చేస్తామని , అవసరమైతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అభం శుభం తెలియని చిన్నారి మృతికి కారకులపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. నిందితులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 79 సంవత్సరాలు అవుతున్న బడుగు బలహీన వర్గాల ప్రజల పట్ల కొనసాగుతున్న వివక్ష, దాడులు, దౌర్జన్యాలు, ఆలయాల్లో ప్రవేశంపై ఆంక్షలు కొనసాగడం బాధాకరమని అన్నారు.దేవుడిని దర్శించుకునే అర్హత బలహీన వర్గాలకు లేదా ? అని ప్రశ్నించారు. కుమ్మెర దోషులను రక్షించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

# ఇంటర్ పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్

## పట్టుబడ్డ నలుగురు విద్యార్థులు

హైదరాబాద్,ఫిబ్రవరి26(ప్రజా వీక్షణం):

రాష్ట్రంలో బుధవారం నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్షల రెండో రోజు గురువారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం సెకండ్ లాంగ్వేజ్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఇంటర్‌మీడియట్ బోర్డు సెక్రటరీ తెలిపారు. మొత్తం 4,63,354 మంది విద్యార్థులకు గాను 4,52,980 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని వివరించారు. 10,374 మంది గైర్హాజరయ్యారని వెల్లడించారు. వరంగల్‌లో 3, రంగారెడ్డి జిల్లాలో ఒకరు మాల్ ప్రాక్టీసు కు పాల్పడుతూ అధికారులకు పట్టుబడ్డారని పేర్కొన్నారు. వనపర్తి, వికారాబాద్, భద్రాద్రి, ఆదిలాబాద్, మంచిర్యాల, వరంగల్, సిద్ధిపేట, మెదక్, కరీంనగర్, ములుగు, పెద్దపల్లి పరీక్షా కేంద్రాల పర్యవేక్షణకు పరిశీలకులను నియమించినట్లు తెలిపారు.

# సిఎం రేవంత్‌తో హిమాచల్ మంత్రి భేటీ

హైదరాబాద్,ఫిబ్రవరి26(ప్రజా వీక్షణం):

హిమాచల్ ప్రదేశ్ మంత్రి విక్రమాదిత్య సింగ్ హైదరాబాద్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసారు. మంత్రిని సిఎం సాదరంగా స్వాగతించి సన్మానించారు.



# పల్టీలు కొట్టు రిజర్వాయర్‌లోకి దూసుకెళ్లిన కారు

జనగామ,ఫిబ్రవరి26(ప్రజా వీక్షణం):

జనగామ జిల్లాలో ఘోర ప్రమాదం జరిగింది. స్టేషన్ ఘన్ పూర్ లో స్విఫ్ట్ కారు పల్టీలు కొట్టి రిజర్వాయర్ లోకి దూసుకెళ్లింది . గురువారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.. జనగామ జిల్లా చిల్పూరు మండలం దేశాయి తాండా దగ్గర ఘోర ప్రమాదం జరిగింది. స్టేషన్ ఘన్ పూర్ నుంచి దేశాయి తండాకు స్విఫ్ట్ కారు వెళ్తుండగా పల్టీలు కొట్టి రిజర్వాయర్ లోకి దూసుకెళ్లింది . ఈ ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలవ్వగా.. డ్రైవర్ గల్లంతైనట్లు తెలుస్తోంది. గాయాలతో బయటపడ్డ దారావత్ చరణ్ ను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

# తెలంగాణలో భారీగా ఐఏఎస్‌ల బదిలీలు

## మొత్తం 45మందిని బదిలీ చేస్తూ ఉత్తర్వులు

## పలు జిల్లాలకు కొత్త కలెక్టర్ల నియామకం

హైదరాబాద్,ఫిబ్రవరి26ప్రజా వీక్షణం:

తెలంగాణలో భారీగా ఐఏఎస్ అధికారుల బదిలీలు జరిగాయి. మొత్తం 45 మందిని బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలనా అవసరాల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఒకేసారి 45 మంది ఐఏఎస్ అధికారులకు బదిలీలు, పోస్టింగ్‌లు ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బదిలీల్లో కలెక్టర్ల స్థాయిలో పెద్దఎత్తున మార్పులు చోటుచేసుకున్నాయి. పలు జిల్లాలకు కొత్త కలెక్టర్ల నియామకం జరిగి ంది. మహబూబాబాద్, మెదక్, రాజన్న సిరిసిల్ల, భద్రాద్రి జిల్లాలకు కొత్త కలెక్టర్లను నియమించారు. టీఎస్‌జీపీడీసీఎల్‌కు కొత్త సీఎండీ నియామకం జరిగింది. సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ) ముఖ్యకా ర్యదర్శిగా రాహుల్ బొజ్జా నియమి తులయ్యారు. బీసీ సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శిగానూ ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగించారు. పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సంజయ్‌కుమార్, విపత్తు నిర్వహణ, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా దాన కిషోర్‌ను నియమించారు. ఫైనాన్స్ అండ్ ప్లానింగ్ విభాగం కార్యదర్శిగా గౌరవ్ ఉప్పల్, దేవాదాయశాఖ కమిష నర్‌గా ఎం.హనుమంతరావు, ప్రజావాణి రాష్ట్ర నోడల్ అధికారిగా డి.దివ్యను ప్రభుత్వం నియమించింది. వీరితో పాటు పలు జిల్లా కలెక్టర్లనూ ప్రభుత్వం బదిలీ చేసింది. యాదాద్రి భువనగిరి కలెక్టర్‌గా అనురాగ్ జయంతిని నియమి ంచింది. పంచాయతీరాజ్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా సంజయ్ కుమార్‌ను నియమి ంచారు. విపత్తు నిర్వహణ, రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా దాన కిషోర్‌కు బాధ్యతలు అప్పగించారు. ఇరిగేషన్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా శ్రీధర్‌ను నియ మించారు. ఎండోమెంట్స్ కమిషనర్‌గా హనుమంతరావుకు కొత్త బాధ్యతలు అప్పగించారు. ఫైనాన్స్ శాఖ సెక్రటరీగా గౌరవ్ ఉప్పల్‌ను నియమించారు. ఐటీ, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా ఎన్.శ్రీధర్‌కు బాధ్యతలు అప్పగించారు. కరీంనగర్ జిల్లా కలెక్టర్‌గా చిత్రా మిశ్రాను నియమించారు. విజయేంద్ర – మహబూబ్‌నగర్ కలెక్టర్ పదవి నుంచి సోషల్ వెల్ఫేర్ శాఖ కార్యదర్శిగా నియామకం అయ్యారు. అద్వైత్ కుమార్ సింగ్ – మహబూబాబాద్ నుంచి ఢిల్లీ తెలంగాణ భవన్ సమన్వయ శాఖకు బదిలీ అయ్యారు. సిక్తా పట్నాయక్ – నారా యణపేట్ నుంచి ఆర్థిక శాఖకు ప్రత్యేక కార్యదర్శిగా బదిలీ అయ్యారు. సందీప్ కుమార్ ఝా – జనగాం కలెక్టర్‌గా నియామకం అయ్యారు. ముష్రఫ్ అలీ ఫారూఖీ – టీఎస్‌జీపీడీసీఎల్ సీఎండీగా నియామకం అయ్యారు. జితేష్ వి.పాటిల్ – టీఎస్‌జీపీడీసీఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు. స్నేహ శబరీష్ – మహబూబాబాద్ కలెక్టర్‌గా నియామకం అయ్యారు. గరిమా అగర్వాల్– రాజన్న సిరిసిల్ల కలెక్టర్‌గా నియామకం జరిగింది. ప్రతిమ సింగ్ – మెదక్ కలెక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. అనికేత్ – భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్‌గా ,చాహత్ బజ్పాయి – హనుమ కొండ కలెక్టర్‌గా,ఖుష్బూ గుప్తా – మహ బూబ్‌నగర్ కలెక్టర్‌గా , పమేలా సత్పతి – లేబర్ కమిషనర్‌గా, అనురాగ్ జయంతి – యాదాద్రి కలెక్టర్‌గా ,ప్రదీప్ జైన్ – నారాయణపేట్ కలెక్టర్‌గా నియామకం జరిగింది.

# గిరిజన కళపై ఐదు రోజుల శిక్షణ

హైదరాబాద్,ఫిబ్రవరి26ప్రజా వీక్షణం:

గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సబ్యసాచి ఘోష్ సూచనల మేరకు గిరిజన సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో మొట్టమొదటిసారిగా వినూత్నంగా 20 మంది క్రాఫ్ట్ టీచర్స్ మరియు 10 మంది గిరిజన ఆర్టిజన్స్ మొత్తం 30 మందికి గిరిజన సంప్రదాయక కళల పైన ఫ్యాబ్రిక్ బ్లాక్ ప్రింటింగ్ అనే అంశంపై ఐదు రోజుల రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. హైదరాబాదులో 26 వ తేదీ నుండి 2 మార్చ్ వరకు నిర్వహిస్తున్నారు.శిక్షణలో పాల్గొన్న అభ్యర్థులు ఐటిడిఏ ఉట్నూర్, ఏటునాగారం, భద్రాచలం, ప్లెయిన్ ఏరియా నుండి సంబంధిత ఐటిడిఏ అధికారుల ద్వారా నామినేట్ చేయబడి రావడం జరిగింది. వీరందరికీ భోజనం, వసతి, రవాణా సౌకర్యాలు కల్పిస్తున్నారు. అదేవిధంగా పదిమంది గిరిజన ఆర్టిజన్స్ కు ప్రతిరోజు వెయ్యి రూపాయల చొప్పున ఆనరోరియం కూడా ఇవ్వడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో టిఆర్ఐ సంచాలకులు డాక్టర్ వి సముజ్వల , టి ఆర్ ఐ సంగ్రహాలయ సంరక్షకులు డాక్టర్ డి సత్యనారాయణ , శిక్షణనిస్తున్న డైరెక్టర్ డా. సునీతా ప్రసాద్ బృందం, ట్రైనింగ్ కోఆర్డినేటర్ శ్రీమతి అజ్మీరా శైలజ , టిఆర్ఐ సిబ్బంది పాల్గొన్నారు.

# కట్టుదిట్టంగా వాహన తనిఖీలు

హైదరాబాద్,ఫిబ్రవరి26(ప్రజా వీక్షణం):

సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో పోలీసులు నిఘా కట్టుదిట్టం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా 'విజిబుల్ పోలీసింగ్'ను ముమ్మరం చేస్తూ.. గల్లీ గల్లీలో గస్తీ పెంచారు. ఇందులో భాగంగా బాలానగర్ ఏసిపి నరేష్ రెడ్డి పర్యవేక్షణలో బాలానగర్, అల్లాపూర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో గురువారం ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పద కదలికలపై నిశితంగా దృష్టి సారించిన పోలీసులు.. వాహనదారులకు నిబంధనలపై అవగాహన కల్పించారు. బాలానగర్ ఇన్‌స్పెక్టర్ నరసింహ రాజు ఆధ్వర్యంలో గురుమూర్తినగర్ ప్రధాన రహదారి వద్ద తనిఖీలు చేపట్టారు. ప్రయాణికుల లైసెన్సులు, వాహన పత్రాలను పరిశీలించడంతో పాటు పెండింగ్ చలానాలు ఉన్న వాహనాలను గుర్తించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే ఎదురయ్యే పరిణామాలను వాహనదారులకు వివరించారు. అటు అల్లాపూర్ ఇన్‌స్పెక్టర్ వెంకట్ రెడ్డి నేతృత్వంలో విష్ణు విస్తారా రోడ్డులో ముమ్మరంగా తనిఖీలు జరిగాయి. అనుమానిత వ్యక్తులను విచారించడంతో పాటు వాహనాల కదలికలపై నిఘా ఉంచారు. ప్రజల భద్రత దృష్ట్యా ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని పోలీసులు స్పష్టం చేశారు.

# వ్యవసాయాధికారి సస్పెన్షన్

పెద్దపల్లి,ఫిబ్రవరి26(ప్రజా వీక్షణం):

పెద్దపల్లి మండల వ్యవసాయ అధికారి కే.అలివేణిని సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఉత్తర్వులు జారీ చేశారు. ఫిబ్రవరి 24వ తేదీన ఏసీబీ అధికారులు జరిపిన ఆకస్మిక తనిఖీల నేపథ్యంలోనే ఆమెను సస్పెండ్ చేసినట్లుగా చర్చ జరుగుతోంది. కొన్నేళ్లుగా వ్యవసాయ శాఖ అధికారుల మధ్య ఆధిపత్య పోరు కారణంగా సమన్వయం లోపించింది. ఈ క్రమంలోనే వ్యవసాయ అధికారులకు సంబంధించి ఒకదాని తర్వాత మరో సంఘటనలు బయటకొస్తున్నాయని పెద్దపల్లిలో చర్చ నడుస్తోంది. గత వారం రోజులుగా అధికారుల మధ్య జరుగుతున్న వివిధ రకాల పర్యావసానాలే మండల వ్యవసాయ శాఖ కార్యాలయంపై ఏసీబీ తనిఖీలకు దారి తీసిందని.. అందులో వెలుగు చూసిన విషయాల ఆధారంగానే క్రమశిక్షణ చర్యలు కొనసాగుతున్నాయని సమాచారం. ఏసీబీ విచారణ పూర్తయ్యే వరకు ఆమె సస్పెన్షన్ అమలులో ఉంటుందని కలెక్టర్ తెలిపారు. అనుమతి లేకుండా హెడ్ క్వార్టర్స్ విడిచి వెళ్లరాదని ఆదేశించారు.

# రెండోపెళ్లి కోసం దారుణం

## నిండుగర్భిణిని హత్య చేసిన భర్త

నిజామాబాద్,ఫిబ్రవరి26(ప్రజా వీక్షణం):

నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలం గన్నారంలో దారుణం జరిగింది. నిండు గర్భిణీని గొంతు నులిమి చంపాడు భర్త. ఈ నెల 22వ తేదీ రాత్రి నిద్రిస్తున్న భార్య సుమలతను చంపాడు భర్త నాగేష్. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. భార్యను చంపి రెండో పెళ్లి చేసుకోవాలని నాగేష్ ఈ దారుణానికి పాల్పడ్డాడు. నిపోయాక సహజ మరణంగా చిత్రీకరించే యత్నం చేశాడు. అల్లుడు ప్రవర్తనపై అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది సుమలత తల్లి. ఈ మేరకు పోలీసులు నాగేష్?ను అదుపులోకి తీసుకుని తమదైన శైలీలో విచారించారు.

# హైదరాబాద్ షాపింగ్ మాల్‌లో అగ్నిప్రమాదం

హైదరాబాద్,ఫిబ్రవరి26(ప్రజా వీక్షణం):

జూబ్లీహిల్స్‌లోని మంగళగౌరి షాపింగ్ మాల్‌లో గురువారం ఉదయం భారీ అగ్నిప్రమాదం జరిగింది. సకాలంలో ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పింది. ఈ విషయంపై హైదరాబాద్ డిస్టిక్ట్ర ఫైర్ ఆఫీసర్ రాందాస్ మాట్లాడారు. ఈ ప్రమాదం ఎలా జరిగిందనే విషయంపై ఇంకా నిర్ధారణకు రాలేదని చెప్పుకొచ్చారు. బిల్డింగ్ లోపల రెన్యువేషన్ పనులు జరుగుతున్నాయని వెల్లడించారు.ప్రమాద సమయంలో షాపులో సిబ్బంది ఎవరూ లేరని స్పష్టం చేశారు. రెన్యువేషన్ పనులు జరుగుతుండటంతో మెటీరియల్స్ వేరే ప్రాంతానికి తరలించారని తెలిపారు. ఈ ఘటన షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిందా..?, లేక వెల్డింగ్ పనుల జరిగిందా.. అనే విషయం దర్యాప్తులో తేలాల్సి ఉందని అన్నారు. ఈ ఘటన సమయంలో ఐదుగురు మాత్రమే షాపులో ఉన్నారని.. అంతా సురక్షితంగా బయటపడ్డారని పేర్కొన్నారు. షాపులో మెటీరియల్ లేకపోవడంతో ప్రమాద తీవ్రత తక్కువగా ఉందని చెప్పారు. అగ్ని ప్రమాదంపై దర్యాప్తు జరుగుతోందని అన్నారు. వేసవి సమీపించింది కాబట్టి అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. షాపుల్లో ÷ర్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని రాందాస్ ఆదేశించారు.

# సురక్షిత బాల్యంతోనే సుస్థిర భవిష్యత్తు

## ఆపరేషన్ 'చిన్నారి తల్లి' ప్రత్యేక డ్రైవ్

## ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా

అమరావతి,ఫిబ్రవరి26(ప్రజా వీక్షణం):

సురక్షిత బాల్యంతోనే సుస్థిర భవిష్యత్తు ఉంటుందని ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా వ్యాఖ్యానించారు. ఏపీ వ్యాప్తంగా 'ఆపరేషన్ చిన్నారి తల్లి' ప్రత్యేక డ్రైవ్ ప్రారంభించి నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన 'ఆపరేషన్ చిన్నారి తల్లి' పోస్టర్‌ను మంగళగిరి డీజీపీ కార్యాలయం లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీజీపీ మీడియాతో మాట్లాడారు. చిన్నారులపై లైంగిక నేరాల నివారణెళి లక్ష్యంగా చర్యలు చేపట్టామని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా పేర్కొన్నారు. పోక్సో కేసుల్లో జీరో పెండెన్సీ – 60 రోజుల్లో ఛార్జ్‌షీట్లు, స్పీడ్ ట్రయిల్ మానిటరింగ్ ద్వారా శిక్షల శాతం పెంచుతున్నామని తెలిపారు. తరచూ లైంగిక నేరాలకు పాల్పడే వారిపై సెక్సువల్ ఆఫెండర్స్ షీట్స్ (÷ూక్షా) నమోదు చేస్తున్నామని స్పష్టం చేశారు. సున్నిత ప్రాంతాల్లో పటిష్టమైన రాత్రి గస్తీ నిర్వహిస్తున్నామని తెలిపారు. పాఠశాలలు, అంగన్వాడీలు, హాస్టళ్లలో 'గుడ్ టచ్ – బ్యాడ్ టచ్'లపై అవగాహన కార్యక్రమాలు... చిన్నారుల తల్లులను అప్రమత్తం చేస్తున్నామని వివరించారు. బాధితులకు కౌన్సిలింగ్, పునరావాస సహాయం కల్పిస్తున్నామని చెప్పుకొచ్చారు. మహిళలు, చిన్నారుల భద్రతకు పెద్దపీట వేస్తున్నామని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా స్పష్టం చేశారు.

# కుమ్మెర ఘటనపై స్పందించిన ఎన్‌హెచ్‌ఆర్‌సి

## నాలుగు వారాల్లో

## నివేదిక అందించాలని ఆదేశం

న్యూఢిల్లీ,ఫిబ్రవరి26(ప్రజా వీక్షణం):

నాగర్‌కర్నూల్‌లో జరిగిన కుల వివక్ష దాడి , పోలీసుల నిర్లక్ష్యంపై జాతీయ మానవ హక్కుల కమిషన్ సీరియస్ అయ్యింది. ఘటనపై నాలుగు వారాల్లోగా నివేదిక ఇవ్వాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించింది. న్యాయవాది వినోద్ హిందుస్థానీ దాఖలు చేసిన ఫిర్యాదుపై స్పందిం చిన కమిషన్, నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్, ఎస్పీకి నోటీసులు జారీ చేసింది. ఈ ఘటనపై తీసుకున్న చర్యల నివేదికను నాలుగు వారాల్లోగా సమర్పించాలని ఆదేశించింది. ఈనెల 18న కుమ్మెర మల్లన్న స్వామి జాతర సందర్భంగా చిలుకేశ్వరం చంద్రకళ కుటుంబాన్ని ఆలయంలోకి ప్రవేశాన్ని నిరాకరించడంతో పాటు రెండు నెలల పసికందును ఉద్దేశపూర్వకంగా తొక్కడంతో ఆ శిశువు మరణించింది. నిందితులపై చర్యలు తీసుకోవాల్సిన చర్యలపై పోలీసులు నిర్లక్ష్యం వహించడాన్ని తప్పుపడుతూ న్యాయవాది కమిషన్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితులు నాగర్‌కర్నూల్ పోలీసు స్టేషన్‌కు వెళ్లినప్పుడు, నిందితులకు ఉన్న రాజకీయ పలుకుబడి కారణంగా ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేయడానికి అధికారులు నిరాకరించారని ఆరోపించారు. పోలీసులు రాజ్యాంగ రక్షణలు, సుప్రీంకోర్టు మార్గదర్శకాలను సైతం ఉల్లంఘించారని కమిషన్ గుర్తించిందన్నారు.

ప్రజావీక్షణం
దినపత్రిక

# 6వ " ఫయాస్ " పై ప్రత్యేక కార్యక్రమం.



ప్రజా వీక్షణం, గోదావరిఖని :

అర్జీ.1 జియం కార్యాలయం సమావేశ హాలు నందు సింగరేణి సంస్థలో సిఎంపిఎఫ్ అధ్వర్యంలో 6వ "ప్రయాస్" అనే ప్రత్యేక కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉద్యోగుల భవిష్య నిధి పెన్షన్ దావాలను తక్షణ పరిష్కారానికి సంబంధించి చురుకైన చర్యలు తీసుకోవడం ద్వారా జీరో పెండెన్సీ" సాధించడం ముఖ్య లక్ష్యంగా ఈ సమావేశము నిర్వహించటం జరిగింది. ఈ సమావేశంలో సిఎంపి.ఎఫ్ రీజినల్ కమిషనర్-1 (రామగుండం) హరి పచౌరి, సిఎంపిఎఫ్ రీజినల్ కమిషనర్-2 (రామగుండం) కె గోవర్ధన్ ప్రత్యేక అతిధులుగా పాల్గొన్నారు. ఈ సందర్భముగా 100 రివైజ్డ్ పి.పి. ఓ ఆర్డర్స్ ను జియం ఆర్జీ. శ్రీ లలిత్ కుమార్ అందజేయడం జరిగినది. ఈ సందర్భంగా జియం గారు తెలియజేస్తూ ఆర్జీ.1 ఏరియా ఉద్యోగులకు సంభంధించిన సిఎంపిఎఫ్ నెంబర్ అలాట్ మెంట్, పదవి విరమణ పొందిన ఉద్యోగుల క్లయిమ్స్ త్వరితగతిన పూర్తీ చేయాలనీ కోరారు. ఈ సందర్భంగా సిఎంపి.ఎఫ్ రీజినల్ కమిషనర్-1 (రామగుండం) హరి పచౌరి మాట్లడుతూ సింగరేణి ఉద్యోగులకు సంభందించిన పెండింగ్ సియంపియఫ్ కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ సమస్యలను పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. మధ్య దళారుల ప్రమేయం లేకుండా సీఎంపీఎఫ్ సేవలను పారదర్శకంగా పొందవచ్చునని తెలిపారు. సిఎంపిఎఫ్ కు సంబధించి ఏదేని పెండింగ్ ఉన్నచొ గనుల సంక్షేమాదికారులను సంప్రదించలని తెలిపారు. క్లెయిమ్ ల తక్షణ పరిష్కారం చేయాలనీ అలాగే మార్చి నెల చివరలో అందరు కూడా పెన్షన్ కొరకు జీవన్ ప్రమాణ్ చేయాలనీ, తెలిపారు. ఈ సందర్భంగా ఈ నెల చివరలో పదవి విరమణ పొందనున్న సిఎంపి.ఎఫ్ రీజినల్ కమిషనర్-1 (రామగుండం) హరి పచౌరి జియం శ్రీ లలిత్ కుమార్ మరియు పర్సనల్ అధికారులు వారిని శాలువాలతో సన్మానించి జ్ఞాపికను అందజేసి వారి శేష జీవితం సుఖ శాంతులతో, ఆయురారోగ్యాలతో, అష్ట ఐశ్వర్యాలతో ఉండాలని కోరారు. ఈ సమావేశములో యస్. ఓ టు జియం చంద్ర శేఖర్, డి.జి.యం.ఫైనన్స్ ధనలక్ష్మిభాయ్ పర్సనల్ అధికారులు వేణు, శ్రావణ్ కుమార్, హన్మంతరావు, ఫిరోజ్ ఖాన్, గనుల సంక్షేమ అధికారులు గణేష్, నిహాల్ సాయి,నాగరాజు మరియు అకౌంట్స్ ఆఫీసర్ రజిని సీఎంపీఎఫ్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మధురా నగర్ లో ప్రధాన మంత్రి సంసద్ క్రీడా మహోత్సవం పోస్టర్ ఆవిష్కరణ

చొప్పదండి ని.వ పిబ్రవరి 26ప్రజా వీక్షణం



గంగాధర మండలంలోని మధుర నగర్ చౌరస్తాలోబీజేపి పార్టీ చొప్పదండి నియోజకవర్గం అసెంబ్లీ కన్వీనర్ పెరుక శ్రావణ్ కుమార్ ఆద్వర్యంలో "ప్రధానమంత్రి సంసద్ క్రీడా మహోత్సవం 2025--26" పోస్టర్ ను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా నాయకులు గాజ శ్రీనివాస్ మాట్లాడుతూ, యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడమే ఈ మహోత్సవం ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. గ్రామీణ స్థాయి నుండి ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని పేర్కొన్నారు.కబడ్డీ, వాలీబాల్, ఖో-ఖో, హాకీ (పార్లమెంట్ పరిధిలో) మరియు పార్లమెంట్ స్థాయిలో అథ్లెటిక్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు.ఫిబ్రవరి 25 నుండి 27 వరకు మండల కేంద్రాల్లో టీమ్‌ల నమోదు ప్రక్రియ జరుగుతుందని, మార్చి 1 నుండి 3 వరకు అసెంబ్లీ స్థాయిలో, మార్చి 5 నుండి 7 వరకు పార్లమెంట్ స్థాయిలో పోటీలు నిర్వహించబడతాయని తెలిపారు. మార్చి 8, 2026న కరీంనగర్‌లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి శ్రీ బండి సంజయ్ కుమార్ గారి చేతుల మీదుగా బహుమతి ప్రదానోత్సవం నిర్వహించనున్నట్లు చెప్పారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని ముఖ్య అతిథి పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా ఉపాధ్యక్షులు బింగి వేణు, కటకం లత, బీజేపీ అధ్యక్షులు పరశురాములు, తుమ్ నారాయణ, మండల ఉపసర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు గుండారం మధు, రేండ్ల శ్రీనివాస్, పోచంపల్లి నరేష్, వడ్నాల రాజు, తాళ్ల రాజశేఖర్, దయ్యాల ప్రణయ్, బీజేపీ నాయకులు ఆకుల మనోహర్, తుమ్ కరుణాకర్, పృథ్వి గౌడ్, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.గంగాధర మండల బీజేపీ నాయకులు, కార్యకర్తలు మరియు క్రీడాభిమానులు కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కుమ్మెర ఘటనపై తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం తీవ్ర ఆగ్రహం.

## ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షులు దుగ్యాల స్వామి

జయశంకర్ భూపాలపల్లి.ఫిబ్రవరి 26, (ప్రజా వీక్షణం)



కుమ్మెర మల్లన్న జాతరలో 2 నెలల పసి పాపను కాలుతో తొక్కి చంపిన ఘటనపై జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండల కేంద్రంలో నిర్వహించిన వేలేకరుల సమావేశంలో కాంగ్రెస్ ఎస్టీ సెల్ చైర్మన్, ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షులు దుగ్యాల స్వామి మాట్లాడుతూ...కులం పేరుతో కులాహంకరం. కులం అంటే ఏంటో తెలియని వయసు దేవుడంటే ఎవరో తెలియని పసి మనసు గుడిలోకి అడుగుపెట్టింది అని ఆ తల్లికి ఆమె చేతిలో ఉన్న 2నెలల పాపకు ఈ అగ్రవర్ణ రెడ్ల కులస్తుల సమాజం చేసిన అన్యాయం ఇది అంతే కాకుండా ఈ వ్యవస్తలు ఎవరికోసం పని చేస్తున్నాయి అని మండ్డిపడ్డారు ఆ పాప చావుకు కారణం ముమ్మాటికీ ఈ రాష్ట్ర ప్రభుత్వ హత్యగా ఎరుకల సంఘం తరుపున తీవ్రంగా కండ్డిస్తున్నాం ఇప్పటికైనా ఈ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఆ పాప చావుకు కారణమైన వారిని వెంటనే ఉరి తియ్యాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేస్తున్నాం లేకుంటే పెద్ద ఎత్తున్న ఉద్యమిస్తాం అని హెచ్చరిస్తున్నాం అంతేకాకుండా అధికార పార్టీ అండ ఉందని బీసీ కులాలపై అలాగే ఎస్సి, ఎస్టీ కులస్థులను తక్కువ జాతి కులస్థులని అగ్రవర్ణ కులస్థులు దాడికి దిగితే కాలు కింద వేసి తొక్కుతాం అని హెచ్చరించారు.

# స్పందించిన సింగరేణి అధికారులు.

కమాన్ పూర్ ప్రజా వీక్షణం ఫిబ్రవరి 26.


రామగిరి మండలం పన్నూరు గ్రామపంచాయతీ పరిధిలోని వకీల్ పల్లె లో డ్రైనేజీ అస్తవ్యస్తమని గ్రామ సర్పంచ్ చిందం మహేష్ పటేల్ పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షకు వినతిపత్రం అందజేశారు. వెంటనే జిల్లా కలెక్టర్ ఆర్ జి త్రీ జి ఎం సుంకర మధుసూదన్ కు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేయడంతో గురువారం సింగరేణి అధికారులు పరిశీలించారు. దీంతో జిఎం మధుసూదన్ స్వయంగా వకీల్ పల్లె ప్లాట్ లను స్వయంగా పరిశీలించారు. ప్రజలకు ఎటువంటి ఆరోగ్య సమస్య రాకుండా పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటామని మరమ్మతులు చేయిస్తానని మధుసూదన్ తెలిపారు. సమస్యపై స్పందించిన పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కు ఆర్.జి.3 జిఎం మధుసూదన్ కు గ్రామ సర్పంచ్ చిందం మహేష్ పటేల్ తో పాటు గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు.



# కన్నీటి పర్యంతమైన మాజీ ఎమ్మెల్యే గండ్ర దంపతులు...

జయశంకర్ భూపాలపల్లి.ఫిబ్రవరి 26,ప్రజా వీక్షణం

నవాబ్‌పేట గ్రామ వాస్తవ్యులు, సింగిల్ విండో మాజీ డైరెక్టర్ కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి సతీమణి కసిరెడ్డి రమ క్యాన్సర్ వ్యాధితో స్వర్గస్థులయ్యారు. ఈ విషయం తెలిసి భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి, వరంగల్ జిల్లా జడ్పీ మాజీ చైర్పర్సన్ ఁ భూపాలపల్లి జిల్లా భారత రాష్ట్ర సమితి పార్టీ అధ్యక్షు రాలు గండ్ర జ్యోతి నవాబ్‌పేట గ్రామానికి చేరుకుని మృతురాలి పార్థివ దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి,తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.ఈ సంఘ టనతో గండ్ర జ్యోతి కన్నీటి పర్యంతమయ్యారు.ఈ కార్యక్రమంలో చిట్యాల మండల మరియు స్థానిక బిఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# జాతీయ కుటుంబ ప్రయోజన పథకానికి దరఖాస్తులు

## - జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లిప్రతినిధి, ప్రజా వీక్షణం:



జాతీయ కుటుంబ ప్రయోజన పథ కానికి అర్హులైన వారు దరఖాస్తు చేసు కోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలి పారు. జాతీయ కుటుంబ ప్రయోజనం పథకానికి అర్హులైన వారు పంచాయతీ కార్యదర్శి, ఎంపిడిఓ కార్యాలయం, తహసిల్దార్ కార్యా లయం లేదా ఆన్లైన్లో దరఖాస్తు చేసు కోవాలని అన్నారు. బి.పి.ఎల్ కుటుంబాలలో కుటుంబాన్ని పోషించే ప్రధాన వ్యక్తి 18 నుంచి 60 సంవత్సరాల వయసు గలవారు మరణిస్తే వారు కుటుంబానికి ఈ పథకం కింద 20 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించడం జరుగు తుందని కలెక్టర్ వెల్లడించారు. ఈ పథకానికి సంబం ధించి మరణించిన వ్యక్తి కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఎటువంటి ఇతర ఆర్థిక సహాయాలు అందకుండా ఉండాలని , అప్పుడే ఈ పథకం అమలు అవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.

# ట్రంప్‌కు మరో ఎదురుదెబ్బ

## వసలదారుల పట్ల అనుసరిస్తున్న విధానంపై కోర్టు ఆగ్రహం

న్యూయార్క్,ఫిబ్రవరి26ప్రజా వీక్షణం:

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు ఆ దేశ న్యాయస్థానాల్లో వరుసగా ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ప్రపంచ దేశాలపై సుంకాల విషయాల ఇప్పటికే కోర్టు నుంచి వ్యతిరేక తీర్పు రాగా.. తాజాగా వలసదారుల విషయంలోనూ అదే అనుభవం ఎదురైంది. అక్రమ వలసదారులను వారికి సంబంధం లేని ఇతర దేశాలకు తరలించడాన్ని అక్కడి ఫెడరల్ కోర్టు తప్పుబట్టింది అక్రమ వలసదారుల విషయంలో ట్రంప్ కార్యవర్గం తీసుకున్న నిర్ణయాన్ని తాత్కాలికంగా సస్పెండ్ చేస్తూ మసాచుసెట్స్‌లోని యూఎస్ డిస్టిక్ట్ జడ్జి తీర్పునిచ్చారు. డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అక్రమ వలసదారులను టా÷-గ్గ÷ట్ చేసిన సంగతి తెలిసిందే. అక్రమ వలసదారులను అమెరికా నుంచి గ్వాటమాల, దక్షిణ సూడాన్, కోస్టారికా వంటి ఇతర దేశాలకు తరలించారు. దీంతో ఈ తరలింపు ముప్పును ఎదుర్కొంటున్న వలసదారులు కోర్టులో దావా వేశారు. దావాపై తాజాగా న్యాయస్థానంలో విచారణ జరిగింది. సరైన భద్రతా చర్యలు తీసుకోకుండా, ముందస్తు నోటీసులు ఇవ్వకుండా, తగిన సమయం ఇవ్వకుండా వారికి సంబంధం లేని వేరే దేశాలకు తరలించడం చట్ట విరుద్ధమని కోర్టు తీర్పునిచ్చింది (÷బిఱటుసజీ ఇనీబీసబి తిపపతిణసజీబితినీని ఇజీబు). ట్రంప్ కార్యవర్గం నిర్ణయాన్ని తాత్కాలికంగా సస్పెండ్ చేసింది. ఈ తీర్పుపై సుప్రీంకోర్టులో అప్పీల్ చేసుకునేందుకు ట్రంప్ యంత్రాంగానికి 15 రోజుల సమయం ఇచ్చింది.

# ది కేరళ స్టోరీ విడుదలకు బ్రేక్

## సెన్సార్ బోర్డును తప్పుపట్టిన హైకోర్టు

తిరువనంతపురం,ఫిబ్రవరి26ప్రజా వీక్షణం:



సరిగ్గా విడుదలకు ఒక్కరోజు ముందు 'ది కేరళ స్టోరీ2' మూవీకి న్యాయపరంగా ఎదురుదెబ్బ తగిలింది. సినిమా ప్రచార చిత్రంలో కేరళను తప్పుగా చూపించారని, మతపరమైన ఉద్రిక్తతలకు దారితీసే అంశాలు ఉన్నాయని సామాజిక మాధ్యమాల వేదికగా చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సినిమా విడుదలపై స్టే విధించాలని, సెన్సార్ సర్టిఫికేషన్ రద్దు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై గురువారం రాష్ట్ర హైకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) తీరును హైకోర్టు తప్పుపట్టింది. సినిమా పునః పరిశీలించాల్సిందిగా జస్టిస్ కురియన్ థామస్ సీబీఎఫ్‌సీకి సూచించారు. అప్పటివరకూ సినిమా విడుదలపై స్టే విధిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. 2023లో వివాదాల నడుమ విడుదలైన 'ది కేరళ స్టోరీ'కి సీక్వెల్‌గా ఈ సినిమా రూపొందింది. దీనికి కామాఖ్యా నారాయణ్ సింగ్ దర్శకత్వం వహించగా విపుల్ అమృత్‌లాల్ షా నిర్మించారు. ఉల్కా గుప్తా, అదితి భాటియా, ఐశ్వర్య ఓజా నటించారు. ప్రేమ మాయలో పడి కొందరు అమ్మాయిలు.. కన్నవాళ్లను ఎదురించి తమ ప్రియుడితోనే జీవితం అనుకుని దూరమవుతుంటారు. కానీ రోజులు గడుస్తున్నకొద్దీ ఆ ప్రేమే ఓ పెద్ద మోసమని తెలుసుకున్నాక దిక్కుతోచని పరిస్థితుల మధ్య ఎవరికీ చెప్పుకోలేని హింసని భరిస్తుంటారు. అలాంటి నిజజీవిత కథాంశంతో 'ది కేరళ స్టోరీ 2: గోస్ బియాండ్' రూపొందింది. ఫిబ్రవరి 27న ఈ మూవీని విడుదల చేస్తున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. కేరళ హైకోర్టు ఉత్తర్వులతో ప్రస్తుతం వాయిదా పడింది.

# మూడుముళ్ల బంధంతో ఒక్కటైన విరోష్

## పెళ్లి ఫోటోలను షేర్ చేసిన రష్మిక

ఉదయ్‌పూర్,ఫిబ్రవరి26(ప్రజా వీక్షణం):

విజయ్ దేవరకొండ, రష్మిక మూడు ముళ్ల బంధంతో ఒక్కటయ్యారు. గురువారం ఉదయం 10.10కి రష్మిక మెడలో విజయ్ మూడు ముళ్లు వేశారు. ఈ వేడుకకు సంబంధించిన ఫొటోలను రష్మిక అభిమానులతో పంచుకుంటూ 'హాయ్ మై లవ్స్.. నా భర్తను మీకు పరిచయం చేస్తున్నా మిస్టర్ విజయ్ దేవరకొండ ' అని పేర్కొన్నారు. ఇకపోతే పరిమిత సంఖ్యలోనే పెళ్లి వేడుకకు అతిథులు హాజరయ్యారు. ఇరు కుటుంబ సభ్యుల మధ్య వేడుక జరిగిందని సమాచారం. 4న హైదరాబాద్‌లో రిసెప్షన్ ఏర్పాటు చేశారు.


# మంథనిలో అవినీతి రహిత పాలన అందిస్తాం

## -పట్టణాభివృద్ధికి జర్నలిస్టులు సహకరించాలి

## -మంథని మున్సిపల్ చైర్మన్ ఒడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముసుకుల మహేందర్ రెడ్డి






**మంథని ప్రతినిధి,ప్రజా వీక్షణం, ఫిబ్రవరి 26:**

మంథని మున్సి పాలిటిలో అవినీతి రహిత పాలనను అందిస్తామని, మంథని పట్టణాభివృద్ధికి జర్నలిస్టులు సహకరించాలని మంథని మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి లు అన్నారు. గురువారం మంథని ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి లను జర్నలిస్టులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో జర్నలిస్టులు ఎంతో కీలకమైన వ్యక్తులని ఎక్కడ ఎలాంటి సంఘటన జరిగిన వారికే ముందుగా తెలుస్తుందన్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి జర్నలిస్టులు ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. జర్నలిస్టులు పట్టణంలో ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ఎంపికలో అర్హులను గుర్తించేందుకు సహకరించాలన్నారు. జర్నలిస్టుల సహకారంతో మంథని పట్టణ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అనంతరం జర్నలిస్టులతో కలిసి అల్పాహారం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అంకరి కుమార్, ఉపాధ్యక్షులు బర్ల సంపత్, ప్రధాన కార్యదర్శి పోతరాజు సమ్మయ్య, సహాయ కార్యదర్శి గంధం ఆంజనేయులు, కోశాధికారి తగరం రాజు, సీనియర్ జర్నలిస్టులు కొమురోజు మారుతి, కొమురోజు చంద్రమోహన్, అంకరి ప్రకాష్, కంది కృష్ణారెడ్డి, ఆర్ల బాపు, పెండ్యాల రాంకుమార్, లక్కాకుల నాగరాజు, బాసాని సాగర్, ఒజ్జల శ్రీనివాస్, లింగాల సురేష్, దొరగొర్ల రవీందర్, కేసారపు రవి, బండారి సమ్మయ్య తో పాటు పలువురు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల ఫలితాల తర్వాత ఎవరికీ మతిభ్రమించిందో ప్రజలకు తెలుసు

## -బోయిని పేట్ 6వ వార్డ్ కౌన్సిలర్ పోతరవేని శ్రీలతక్రాంతి

**మంథని ప్రతినిధి, ప్రజా వీక్షణం, ఫిబ్రవరి 26:**



మొన్నటికి మొన్న జరిగిన మున్సిపల్ ఎన్నికల ఫలితాల తర్వాత ఎవరికీ మతిభ్రమించిందో బోయిని పేట ప్రజలకు తెలుసునని, ఈ విషయాలను ప్రజలే గమనిస్తున్నారనిబోయిన్ పేట్ 6వ వార్డ్ కౌన్సిలర్ పోతరవేని శ్రీలతక్రాంతి అన్నారు. బోయిని పేట్ ప్రజాక్షేత్రంలో ప్రజలతో ఎన్నోకోబడ్డ ఒక బీసీ మహిళా కౌన్సిలర్ ని మతి భ్రమించింది అని మాట్లాడుతున్న అవివేకుల విజ్ఞతకే వదిలేస్తున్నా మన్నారు. బడుగు బలహీన వర్గానికి చెందిన ఒక మహిళా ప్రజాప్రతినిధిని గౌరవించలేని సంస్కారహీనులను మంత్రి శ్రీధర్ బాబు వారిని ఎలా ఉపేక్షిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు.ఇందిరమ్మా ఇల్లులకు సంబంధించిన అధికారులే ఎన్నికల ముందు ఇందిరమ్మ ఇల్లుల లబ్దిదారుల్లో ఆర్థిక పరిస్థితులు సరిగా లేని నిరుపేదలకు తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన తర్వాత మేము గెలిచినాకా మా దగ్గరికి వచ్చిన ఆ పేదలకు నాయ్యం చేయాలనీ ఒక మంచి ఉద్దేశంతో ఏఈ ని సంప్రదించిగా వారి సమక్షంలోనే ఇండ్లు కట్టే మేస్త్రిని పిలిపించి లబ్దిదారుల ముందే సంబంధిత అధికారితో మాట్లాడించడం జరిగిందన్నారు.దీనిని జీర్ణించుకొని కొందరు కాంగ్రెస్ నాయకులు పేద ప్రజల పొట్టకొడుతూ వాట్సఆప్ గ్రూపుల్లో ఇస్తానుసారంగా పోస్టు పెడుతూ ఆ యొక్క మేస్త్రికి, సంబంధిత అధికారులను బెదిరింపులకు గురిచేస్తే ఆ యొక్క మేస్త్రి బయపడి తెల్లారే పని మొదలు పెడుతా అని చెప్పి ఈరోజు వరకు రాకపోవడంతో ఇల్లులు కూల్చి వేసుకొని పిల్ల పాపలతో రోడ్డు మీద జీవనం సాగిస్తున్న వారి పరిస్థితి ఏమి కావాలని ప్రశ్నించారు. ఇందిరమ్మా ఇండ్ల కమిటీ సభ్యులం అని చెప్పుకునే వారికి ఒకటే చెప్తున్నాం బోయిన్ పేట్ నిరుపేదల జోలికి వచ్చిన వారిని బెదిరించిన ఊరుకునేది లేదు వీలైతే వారికి తోడుగా నిలబడండి లేదంటే బోయిన్ పేట్ జనం ఇచ్చిన తీర్పు ప్రకారం ఇంట్లో కూర్చోండి అని సూచించారు. మా బోయిన్ పేట్ ప్రజల దగ్గర డబ్బులు లేవు కావచ్చు కాని చాలా విజ్ఞాన వంతులు అందుకే ఎవరికీ ఏ పదవులు ఇవ్వాలి ఎవరిని ఇంట్లో కూర్చోబెట్టాలో నిర్ణయించి వారికి ఓటు అనే ఆయుధంతో తీర్పు చెప్పారని పేర్కొన్నారు.ఇకనైనా మంత్రి శ్రీధర్ బాబు ఇలాంటి వారిపై ప్రత్యేక దృష్టి పెట్టి ఒక బీసీ మహిళా ప్రజాపతినిధిని గౌరవించలేని ఇలాంటి సంస్కార హీనులను దూరం పెట్టి నిరుపేద పేద ప్రజలకు మీరు ఇచ్చే ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్య సహకార సంఘం అధ్యక్షులు పోతరవేని క్రాంతి కుమార్, ఇందిరమ్మా ఇండ్ల లబ్దిదారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# దేశంలో కులాలను సృష్టించింది కాంగ్రెస్ పార్టీనే

## - ప్రపంచాన్ని చూడకముందే పసిపాప ప్రాణం తీసిన కులవివక్ష

## -పసిపాప మృతిపై మేధావులు,పాలకులు ఎందుకు స్పందించడం లేదు

## -పసిపాప మృతికి కారకులపై వెంటనే చర్యలు తీసుకోవాలే-మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్






**మంథని ప్రతినిధి, ప్రజా వీక్షణం, ఫిబ్రవరి 26:**

కులాలకు సృష్టికర్త కాంగ్రెస్ పార్టీ అని దేశంలో కులాలను పుట్టించిన ఆ పార్టీ మనుషులను మనుషులుగా చూడటం లేదని మంథని మాజీఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. నాగకర్నూల్ జిల్లా కుమ్మెర మల్లన్న దేవాలయంలో దర్శనానికి వెళ్లిన చాకలి కులానికి చెందిన కుటుంబంపై కులవివక్షతో దాడి చేసి రెండు నెలల పసిగుడ్డు మృతికి కారకులైన వారిని తక్షణమే అరెస్ట్ చేసి చట్టపరంగా శిక్షించాలనే డిమాండ్ తో గురువారం మంథని పట్టణంలోని జ్యోతిరావు పూలే విగ్రహం నుంచి అంబేద్కర్ చౌరస్తా మీదుగా ఆర్టీఓ కార్యాలయం వరకు మౌన ర్యాలీ నిర్వహించి అనంతరం ఆర్డీవో కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పుట్ట మధు మాట్లాడుతూ గణేష్ మౌనిక దంపతుల కూతురు బేబీ మౌనిక ప్రపంచాన్ని చూడకముందే కులవివక్ష ఆ పసిపాప ప్రాణం తీసిందన్నారు. ఈ ఘటన మనం ఏ దశాబ్దంలో ఉన్నామో అర్థం కావడం లేదని, ఇంకా అనాగరికతలోనే ఉన్నామా అనే ఆలోచన కలుగుతుందని ఆయన వాపోయారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు అధికారంలోకి వచ్చినా అప్పుడు తన నైజాన్ని చూపుతుందని, ఇలాంటి ఘటనలు జరుగుతూనే ఉంటాయన్నారు. 1991 చుండూరులో కులాలకు కులాలకు మధ్య జరిగిన తగువులాటలో దళితులు చనిపోయారని, తాజాగా నల్గొండ జిల్లాలో రాజేష్ అనే యువకుడు లాకప్ డెత్లో చనిపోతే అక్కడ ఎస్హెచ్ఓగా ఉన్న ఓసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని రక్షిస్తూ సంఘటనకు బాధ్యుడిని చేస్తూ బీసీ సామాజిక వర్గానికి చెందిన సీఐని సస్పెండ్ చేశారని ఆయన వివరించారు. ఓసీలను రక్షిస్తూ బీసీ, ఎస్సీ ఎస్టీలను ఇబ్బందులకు ఎలా గురి చేస్తున్నారో నల్గొండ జిల్లాలో జరిగిన సంఘటనే అర్థం అవుతుందన్నారు. మంథని ప్రాంతంలో స్థానిక ఎమ్మెల్యే ఎవరు చనిపోయినా తన కుటుంబ సభ్యుల కంటే ఎక్కువగ కన్నా బాధపడ్డారని, ఏడ్చి కమలహాసన్ను మించి వ్యవహరించారని ఎద్దేవా చేశారు. కులాలను పుట్టించిన కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు అధికారంలోకి వచ్చినా కులాల మధ్య వైశమ్యాలను లేపడం అవమానపర్చడం సాధారణమైందన్నారు. సీఎంగా హోం మినిష్టర్గా ఉన్న రేవంత్రెడ్డి ఈ సంఘటనపై స్పందించకపోవడం బాధాకరమన్నారు. ప్రత్యక్షంగా ఉన్న ఎనిమిది మందిని అరెస్ట్ చేయకుండా కాపాడటం, చనిపోయిన వారి కుటుంబంపై కేసులు పెట్టించడం, వాళ్లకు వాళ్లే గలాటా సృష్టించి మళ్లీ దానిని బాధితులను బాధ్యులను చేయడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్ర నలుమూలలలో ఇలాంటి ఘటనలే జరుగుతాన్నాయని, పోలీసులు పూర్తిగా కాంగ్రెస్ కండువాలు కప్పుకుని పనిచేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బారత రాజ్యాంగాన్ని అంబేద్కర్ను ఏనాడు గౌరవించలేదు అవమానస్తూనే ఉన్నారని అన్నారు. రాష్ట్రంలో దేశంలో ఉన్న మేధావులుగా చెలామణి అవుతు కాంగ్రెస్ పార్టీకి వత్తాసు పలుకుతున్న వాళ్లు ఇలాంటి ఘటనలపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. రెండు నెలల పసిపాప చనిపోతే ఎందుకు మాట్లాడటంలేదని ఆయన అసహనం వ్యక్తం చేశారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందిస్తాం

## -మంథని మున్సిపల్ వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి

## -కూచిరాజ్ పల్లి లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ

**మంథని ప్రతినిధి, ప్రజా వీక్షణం, ఫిబ్రవరి 26:**

అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించి మేలు చేయడమే మా ముఖ్య లక్ష్యమని మంథని మున్సిపల్ వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి అన్నారు. గురువారం మంథని మున్సిపల్ ఐదవ వార్డ్ పరిధిలోని కూచిరాజ్ పల్లి లో కామనీ భాగ్య, కొమురయ్య లకు ఇందిరమ్మ ఇల్లు నూతనంగా మంజూరు కాగా మంథని మున్సిపాలిటీ వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి చేతుల మీదుగా నూతన ఇంటి నిర్మాణానికి భూమి పూజా నిర్వహించారు. ఈ సందర్భంగా సహేందర్ రెడ్డి మాట్లాడుతూ మంథని నియోజకవర్గానికి ఎక్కువ మొత్తంలో అర్హులైన ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందించేందుకు మంత్రి శ్రీధర్ బాబు ఎక్కువ మొత్తంలో నిధులు మంజూరు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఐదవ వార్డు మాజీ కౌన్సిలర్ నక్క నాగేంద్ర శంకర్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంబటి సత్తయ్య, కామణి రమేష్,మిట్టపల్లి కిషోర్,మాదేశి పద్మ,అంబటి సాయి తదితరులు పాల్గొన్నారు.



# పేదింటి వివాహానికి కౌన్సిలర్ దంపతుల చేయూత

## 26 వ వార్డులో రూ.10,116 అందించిన కేసిరెడ్డి లావణ్య నర్సింహారెడ్డి దంపతులు

**హుజురాబాద్ రూరల్ ఫిబ్రవరి 26 : ప్రజా వీక్షణం:**

హుజురాబాద్ మున్సిపల్ పరిధిలోని 26 వార్డులో పేద కుటుంబాలకు చేయూత గా ఉంటామని ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఇచ్చిన భరోసా మేరకు కౌన్సిలర్ కేసిరెడ్డి లావణ్య - నర్సింహారెడ్డి దంపతులు ఓ నిరుపేద కుటుంబంలో వివాహానికి ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచారు. 26 వ వార్డుకు చెందిన నారోజు రాజ్యలక్ష్మి - రత్నా చారి దంపతుల కుమార్తె తరుణి వివాహము కందుకూరి రాజేందర్ తో గురువారం స్థానిక మధువని గార్డెన్ లో జరిగింది. ఈ వివాహ వేడుకకు కౌన్సిలర్ కేసిరెడ్డి లావణ్య నర్సింహా రెడ్డి దంపతులు హాజరయ్యారు. వధూవరులను ఆశీర్వదించి రూ.10,116 /- ఆర్థిక సహాయం అందించి వారి కుటుంబానికి శుభాకాంక్షలు తెలిపారు. పేదింటి వివాహానికి ఆర్థిక సహాయం అందించిన కౌన్సిలర్ లావణ్య నర్సింహా రెడ్డి దంపతులను పలువురు అభినందించారు.



# మేయర్ ను సన్మానించిన బిజెపి నాయకులు

**కమాన్ పూర్ ప్రజా వీక్షణం ఫిబ్రవరి.26.**

కమాన్ పూర్ మండలం జూలపల్లి లో ఒక ప్రైవేట్ ఫంక్షన్ కు విచ్చేసిన కరీంనగర్ మేయర్ కోల గాని శ్రీనివాస్ ని కలసి పెద్దపెల్లి బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు మచ్చ గిరి రాము ఆధ్వర్యంలో వారికి సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ... కరీంనగర్లో చాలామంది కార్యకర్తల కష్టం వల్ల బండి సంజయ్ తెగువ వల్ల నేను మేయరు కావడం జరిగిందని, నాలాంటి సామాన్య కార్యకర్తకు ఇలాంటి పదవి ఒక బీజేపీ లోనే మాత్రమే దక్కుతుంది అని అన్నారు. అలాగే కమాన్ పూర్ లో చాలా మహిమగల ఆది వరహాస్వామి ని త్వరలోనే దర్శించుకుంటాను అన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు మట్ట శంకర్, కమాన్ పూర్ బిజెపి మాజీ మండల అధ్యక్షులు జంగ పల్లి అజయ్, మల్లరపు అరుణ్, కమాన్ పూర్ మండల బిజెపి ఉపాధ్యక్షులు బర్ల సదానందం, కొమ్ము శ్రీనివాస్, గొట్టే సంపత్, బర్ల రమేష్, బండ రాయలింగు,చొప్పరి రాజు, ఇరుగు రాల రవి తదితరులు పాల్గొన్నారు.



ప్రజావీక్షణం
దినపత్రిక

# గ్రామ సచివాలయాలు..వార్డుల మార్పు

## పంచాయితీరాజ్ చట్టసవరణకు అసెంబ్లీ ఆమోదం

## స్వర్ణగ్రామం, స్వర్ణవార్డులుగా ఇక పిలుపు

**అమరావతి,ఫిబ్రవరి26ప్రజా వీక్షణం:**

ఏపీ శాసనసభలో గ్రామ, వార్డు సచివాలయాల చట్ట సవరణ బిల్లుకు ఆమోదం లభించింది. ఈ బిల్లు ద్వారా రాష్ట్రంలోని గ్రామ, వార్డు సచివాలయాలను ఇకపై స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డులుగా పిలుస్తారు. గురువారం మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి ఈ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. కూటమి ప్రభుత్వం స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యంతో పనిచేస్తోందని, ఈ విజన్‌కు అనుగుణంగా సచివాలయాల విధుల్లో మార్పులు చేశామని మంత్రి వివరించారు. అందుకు తగినట్లుగా సచివాలయాల పేర్లను స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డులుగా మారుస్తూ చట్ట సవరణను ప్రతిపాదించినట్లు తెలిపారు. దీనిపై ఈ ఏడాది జనవరిలో గవర్నర్ గెజిట్ ద్వారా ఆర్డినెన్స్ జారీ చేశారన్నారు మంత్రి. సచివాలయాలు చాలా చోట్ల అ÷-దదె భవనాల్లో నడుస్తున్నాయని, ప్రభుత్వ భవనాలున్న చోటికి వాటిని మారుస్తున్నామని మంత్రి తెలిపారు. స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సిబ్బందికి పదోన్నతులు కల్పిస్తామని, అన్ని విభాగాల్లో సిబ్బందికి పదోన్నతులు వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వెల్లడించారు. జిల్లా స్థాయిలో జాయింట్ కలెక్టర్ స్థాయి అధికారిని గవర్నింగ్ బాడీగా నియమించామని మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి పేర్కొన్నారు. ఃాయదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు మాట్లాడుతూ.. వికసిత్ ఆంధ్రప్రదేశ్ లక్ష్య సాధనకు ఈ చట్ట సవరణ ఉపయోగపడుతుందన్నారు. స్వర్ణ గ్రామాలు, స్వర్ణ వార్డుల పేర్లు ప్రజలను మానసికంగా సిద్ధం చేస్తాయని అన్నారు. రాయలసీమలో ఉద్యాన పంటలు ఎక్కువగా ఉండటంతో అక్కడి సిబ్బందిలో హార్టికల్చర్ నిపుణులను నియమించవచ్చని సూచించారు. అభివృద్ధికి అసలైన చిరునామాగా ఆంధ్రప్రదేశ్‌ను మార్చాలన్నారు. సంపద సృష్టించే క్రమంలో అందరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు అన్నారు. విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ.. వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర 2047 ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రభుత్వం పీ4 కార్యక్రమాన్ని సచివాలయాల ద్వారా అమలు చేస్తోందని చెప్పారు. సచివాలయ సిబ్బందికి గవర్నింగ్ బాడీ ఎవరనే విషయంలో స్పష్టత లేదని.. దీనిపై చట్ట సవరణ ద్వారా స్పష్టత ఇవ్వాలని ఎమ్మెల్యే కోరారు.

# గాలేరు-నగరిపై మండలిలో వాదోపవాదాలు

## రాయసలీమ ఎత్తిపోతల ఎప్పటికి పూర్తి చేస్తారన్న బొత్స

## వినే ఓపిక ఉండాలని మంత్రి నిమ్మల ఎదురుదాడి

**అమరావతి,ఫిబ్రవరి26ప్రజా వీక్షణంపజా వీక్షణం:**

గాలేరు-నగరిపై చర్చలో అధికార, ప్రతిపక్షం మధ్య వాదోపవాదాలు చోటు చేసుకున్నాయి. గాలేరు నగరి ప్రాజెక్టుపై వైసీపీ సభ్యులు ప్రశ్న లేవనెత్తారు. వరద నీరు కేవలం 30 రోజులు మాత్రమే వస్తుందని.. జగన్ ప్రభుత్వం 3,825 కోట్ల రూపాయలతో రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని తీసుకొచ్చిందన్నారు. గాలేరు నగరి ప్రాజెక్టుకు ఎంత బడ్జెట్ కేటాయించారని.. ఎప్పటిలోగా పూర్తి చేస్తారని ప్రశ్నించారు. మూడోసారి వాయిదా అనంతరం ఏపీ శాసనమండలి తిరిగి మొదలైంది. రాయలసీయ నీటి ప్రాజెక్టులపైనే మండలిలో మరోసారి రచ్చ జరిగింది. గాలేరు నగరి ప్రాజెక్టు, రాయలసీమ ఎత్తిపోతల పథకం విషయాలపై వైసీపీ సభ్యులు ప్రశ్నలు సంధించగా మంత్రులు సమాధానాలు ఇచ్చారు. మంత్రి నిమ్మల రామానాయుడు సమాధానం ఇస్తూ.. రాయలసీమ ఎత్తిపోతల పథకానికి ఇతర ఎత్తిపోతల పథకాలకు ఉన్న తేడా తెలుసుకుని ప్రశ్నలు అడగాలని సూచించారు. ధైర్యంగా వాకౌట్ చేయకుండా సమాధానాలు వినాలన్నారు. రాయలసీమ ఎత్తిపోతల పథకంపై మరోసారి వివరాలు చెబుతానని మంత్రి తెలిపారు. సందర్భంగా బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. రాయలసీమ ఎత్తిపోతల పథకం అందరికీ అవసరమన్నారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు వాస్తవమా? కాదా? అని ప్రశ్నించారు. ఈ పథకాన్ని ఎప్పటిలోగా ప్రారంభించి, ఎప్పటిలోగా పూర్తి చేస్తారో స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్ని ట్రిబ్యునల్ గొడవలు వచ్చినా ఆనాటి ప్రభుత్వం ముందుకు వెళ్లిందని బొత్స సత్యనారాయణ గుర్తు చేశారు. మంత్రి నిమ్మల రామానాయుడు మరోసారి స్పందిస్తూ.. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడిన రోజే మాజీ మంత్రి హరీశ్ రావు కూడా మాట్లాడారని అన్నారు. 'జగన్‌తో మాట్లాడాం... అంతకుమించి ముందుకు వెళ్ళవద్దని జగన్‌కు చెప్పినట్లు బీఆర్ఎస్ నాయకులు చెప్పారు' అని తెలిపారు. తెలంగాణ రాజకీయ ప్రయోజనాల కోసం వారు మాట్లాడారని మంత్రి చెప్పారు.




మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ.. రాయలసీమ లిఫ్ట్ విషయంలో తప్పంతా వైసీపీదే అని ఆరోపించారు. ప్రాజెక్టును ఆపి తప్పు చేసింది ఎవరో వైసీపీ నేతలు తెలుసుకోవాలన్నారు. సభా సాక్షిగా రాయలసీమకు జగన్ సర్కారు ఏమీ చేయలేదని వైసీపీ సభ్యులు నిరూపించారని చెప్పారు. 'జగన్‌తో మాట్లాడి రాయలసీమ లిఫ్ట్‌పై తామే స్టే తెచ్చామని ఆనాటి ఇరిగేషన్ మంత్రిగా ఉన్న హరీశ్ రావు స్పష్టంగా చెప్పారు. ఈ విషయాన్ని తెలంగాణ శాసనసభ వేదికగా హరీశ్ రావు తెలిపారు' అని మంత్రి గుర్తుచేశారు. చేతకాని వైసీపీ దద్దమ్మ ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టిందని విమర్శించారు. ప్రాజెక్టు ఆపితే... చేతకాకుండా కోర్టుకు వెళ్లి అఫిడవిట్ వేస్తే దానికి తాము సమాధానం చెప్పాలా అంటూ మంత్రి పయ్యావుల కేశవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# డయేరియా నివారణకు అన్ని చర్యలు తీసుకున్న ప్రభుత్వం

## ముందస్తు చర్యలతో ప్రాణనష్టాన్ని నివారించిన అధికారులు

## డయేరియాప్రాంతాల్లో కేంద్రమంత్రి రామ్మోహన్ పర్యటన

**శ్రీకాకుళం,ఫిబ్రవరి26ప్రజా వీక్షణం:**

డయేరియా ప్రభావిత ప్రాంతాల్లో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు గురువారం పర్యటించారు. అనంతరం కేంద్రమంత్రి మీడియాతో మాట్లాడుతూ.. ప్రస్తుతం శ్రీకాకుళం కార్పొరేషన్‌లో డయేరియా అదుపులోకి వచ్చిందన్నారు. ప్రభుత్వం డయేరియా వ్యాప్తి జరుగుతుందని తెలిసిన వెంటనే అన్ని రకాల చర్యలు చేపట్టిందన్నారు. ప్రస్తుతానికి 102 మంది మాత్రమే చికిత్స పొందుతున్నారని.. మొత్తం 120 కేసులు రిపోర్ట్ అయ్యాయని వెల్లడించారు. ప్రజలను ఆదిలోనే అప్రమత్తం చేయటంతో ప్రాణనష్టం నివారించగలిగామని కేంద్రమంత్రి చెప్పుకొచ్చారు. ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరించిందని అన్నారు. మంచినీటి సమస్య ఉందనే అపోహలు ఉన్నాయని... దానిపై మరింత విస్తృతంగా పరీక్షలు చేస్తున్నామని రామ్మోహన్ నాయుడు చెప్పారు. శ్రీకాకుళం కార్పొరేషన్‌లో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత జరిగిన అభివృద్ధిపై చర్చకు రాగలరా అంటూ వైసీపీకి సవాల్ విసిరారు కేంద్రమంత్రి. గత ప్రభుత్వంలో పనులన్నీ అయినవారికి కేటాయించి డబ్బులు తినేశారని ఆరోపించారు. రూ.100 కోట్లు పైగా గ్రాంట్స్ మంజూరుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. డయేరియా విషయంలోనూ వైసీపీ శవ రాజకీయం చేస్తోందని మండిపడ్డారు. వైసీపీ హయాంలో కాంట్రాక్టులు సిండికేట్ చేసి కమిషన్లు తీసుకున్నారని కేంద్రమంత్రి ఆరోపించారు. విమర్శలు చేస్తున్న వైసీపీ నేతలు.. వారి హయాంలో ఎందుకు పనులు మొదలు పెట్టలేదని కేంద్రమంత్రి రామ్మోహన్ ప్రశ్నించారు. డయేరియా వల్ల చనిపోయిన ఒకరికి ఎక్స్‌గ్రేషియా ప్రకటించామని.. మిగతా వారి మరణాలపై పోస్టుమార్టం రిపోర్ట్ ఆధారంగా నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. వైసీపీ నేతలు.. ప్రజల చావులను కోరుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.



కమిషనర్ కూర్మారావు సేవలు కార్పొరేషన్‌కు అవసరమని అన్నారు. హీట్ ఆఫ్ మూమెంట్‌లో ఆయన్ను సస్పెండ్ చేశారని.. దీనిపై ప్రభుత్వంతో మాట్లాడతానని చెప్పారు. కమిషనర్ కూర్మారావు విధుల్లో చేరిన 20 రోజుల్లో మంచి పనులు చేపట్టారని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

# తిరుమల లడ్డూపై మండలిలో స్వల్పకాలిక చర్చ

## పరస్పర విమర్శలతో సభలో గందరగోళం

## చర్చకు ముందే ప్రకటన చేస్తామన్న మంత్రి కేశవ్

## చర్చకు ముందు కుదరదన్న ఛైర్మన్

## గందరగోళం మధ్యే సభ నేటికి వాయిదా

**అమరావతి,ఫిబ్రవరి26ప్రజా వీక్షణం:**

ఏపీ శాసనమండలిలో తిరుమల లడ్డూ అంశంపై స్వల్పకాలిక చర్చలో వాదోపవాదాల మధ్య చర్చ ప్రారంభం అయ్యింది. అయితే పరస్పర విమర్శలతో సభను ఛైర్మన్ కొయ్యే మోషేన్ రాజు శుక్రవారానికి వాయిదా వేశారు. చర్చ సందర్భంగా అధికార, విపక్ష సభ్యుల ఆందోళనలతో గందరగోళం ఏర్పడటంతో సమావేశాలను ఛైర్మన్ శుక్రవారం వాయిదా వేశారు. స్వల్పకాలిక చర్చలో భాగంగా తొలుత వైసీపీ సభ్యుడు పర్వతనేని చంద్రశేఖర్ రెడ్డికి మాట్లాడేందుకు అవకాశం ఇచ్చారు ఛైర్మన్. చర్చ సాగుతుండగా ప్రభుత్వం తరఫున స్టేట్‌మెంట్ ఇచ్చేందుకు తనకు అవకాశం కల్పించాలని మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. స్వల్పకాలిక చర్చలో స్టేట్‌మెంట్ చేసే అవకాశం మంత్రికి ఉండదని.. రిప్లై మాత్రమే ఉంటుందని మండలి ఛైర్మన్ స్పష్టం చేశారు. స్టేట్‌మెంట్ కాపీలు సిద్ధం చేయాలని మండలి ఛైర్మన్ లేఖ రాశారని పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. తన అనుమతి లేకుండా ఆ లేఖ సిద్ధం చేశారని ఛైర్మన్ తెలిపారు. ఈ క్రమంలో కల్తీ నెయ్యి అంశంపై శాసనమండలిలో గందరగోళం నెలకొంది. చర్చకు ప్రతిపక్షానికి ముందుగా అవకాశం ఇస్తామని మండలి ఛైర్మన్ మోషేను రాజు అన్నారు. దీంతో ప్రభుత్వం నుంచి స్టేట్‌మెంట్ వద్దంటారా అంటూ మంత్రి పయ్యావుల కేశవ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. 'స్టేట్‌మెంట్ ఇస్తామని మేము ముందే చెప్పాం. లఘు చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఎంత సమయమైనా చర్చకు అనుమతించండి. అర్ధ రాత్రి వరకు చర్చ కొనసాగించినా మాకు ఇబ్బంది లేదు. వినేందుకు కూడా ఓపిక లేనప్పుడు ప్రశ్నలు ఎందుకు అడగాలి. చర్చకు వైకాపా సభ్యులు ఎందుకు భయపడుతున్నారు' అని ప్రశ్నించారు. తిరుమల లడ్డూపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ముందుగా ప్రభుత్వం నుంచి స్టేట్‌మెంట్‌కు అవకాశం కల్పించాలన్నారు మంత్రి. చర్చకు ప్రభుత్వం భయపడుతోందని విపక్ష నేత బొత్స సత్యనారాయణ ఆరోపించారు. దేవదేవుడి ప్రసాదాన్ని రాజకీయాలకు వాడుకుంటున్నారని ఆయన విమర్శించారు.

# ప్రైవేట్ విద్యుత్ బస్సులకు ఆర్టీసీ డిపోలు

## ఆర్టీసికి ప్రయోజకరం కాదన్న లెఫ్ట్

## పునరాలోచన చేయాలని సిపిఎం లేఖ

**అమరావతి,ఫిబ్రవరి26ప్రజా వీక్షణం:**

ప్రయివేటు విద్యుత్ బస్సులకు ఆర్‌టిసి డిపోలను అప్పగించడాన్ని ఆపాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు లేఖ రాశారు. పిఎంఇ పేరుతో ప్రయివేటు విద్యుత్ బస్సులను పూణెకు చెందిన పినాకల్ కంపెనీ నిర్వహిస్తున్నట్లు, దానికోసం 11 డిపోలకు చెందిన 12 స్థలాలను వారికి అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు పత్రికల్లో వార్తలు రావడం ఆందోళనకరమని తెలిపారు. పిఎం ఇ-బస్సు సేవ పథకంలో గ్రాస్ కాస్ట్ కాంట్రాక్టు పద్ధతిలో ప్రయివేటు సంస్థల ద్వారా బస్సులు నిర్వహించే పద్ధతి అటు ఆర్‌టిసికి, ఇటు ప్రజలకు ప్రయోజనం కాదని పేర్కొన్నారు. విజయవాడలోని విద్యాధరపురం, గుంటూరు-2, నెల్లూరు-2, తిరుపతిలో మంగళం డిపోలను పూర్తిగా, మరో ఎనిమిది డిపోలను పాక్షికంగా ప్రయివేటు వారికి ఇవ్వాలని ఆర్‌టిసి ఉత్తర్వులివ్వడం, మనుగడకు, ప్రజల ప్రయోజనాలకు నష్టకరమని పేర్కొన్నారు. మరికొన్ని సిఎన్‌జి బస్సులనూ నడపనున్నట్లు వార్తలొస్తున్నాయని, ఈ కొత్త విధానంపై కార్మిక సంఘాలతో, నిపుణులతో చర్చించడంతో పాటు, ఇతర రాష్ట్రాల్లో అమలుతీరుపై సమగ్రంగా అధ్యయనం చేసిన తర్వాతనే తుది నిర్ణయం తీసుకోవాలని కోరారు. విద్యుత్ బస్సులను నడపాల్సి వస్తే దశలవారీ ఆర్‌టిసి సంస్థ ద్వారానే నడపాలని, అందుకు అనుగుణంగా ప్రభుత్వ నిర్ణయం వుండాలని తెలిపారు. విద్యుత్ బస్సుల పేరుతో ప్రయివేటు కన్సార్టియంలకు రూ.కోట్లు విలువ చేసే డిపోలు, స్థలాలను ఇచ్చేసే ప్రతిపాదనలు అంతిమంగా ఆర్‌టిసికి, ప్రజల ప్రయోజనాలకు నష్టం కలుగజేస్తాయని వివరించారు. స్త్రీ శక్తి పథకం అమలు వల్ల ప్రయాణికుల రద్దీ పెరిగిందని, సిబ్బందిపై పని ఒత్తిడి పెరిగిందని తెలిపారు. డిమాండ్‌కు అనుగుణంగా 4 వేల బస్సులు, 11 వేల మంది ఉద్యోగుల అవసరం వుందని కార్మిక సంఘాలు చెబుతున్నాయని, డిపోలను విస్తరించి రవాణా సౌకర్యాలను మరింత పెంచాల్సి వుందని పేర్కొన్నారు. డిపోల ప్రయివేటీకరణను ఉపసంహరించుకుని, రద్దీకి అనుగుణంగా బస్సులను, సిబ్బందిని నియమించాలని శ్రీనివాసరావు కోరారు.

# అసైన్డ్ భూముల చట్టసవరణకు అసెంబ్లీ ఆమోదం

## సౌర విద్యుత్ సంస్థలకు లీజుకు ఇచ్చేలా చట్టం

## రాష్ట్రంలో 10వేల మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టుల లక్ష్యం

**అమరావతి,ఫిబ్రవరి26ప్రజా వీక్షణం:**

ఏపీ శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో అసైన్డ్ భూముల చట్ట సవరణ బిల్లును రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రవేశపెట్టారు. ఈ బిల్లుకు సభ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా మంత్రి అనగాని మాట్లాడుతూ.. అసైన్డ్ భూములను సౌర విద్యుత్ సంస్థలకు లీజుకు ఇచ్చేలా చట్టసవరణ చేశామని.. హరిత ఇంధన సంస్థలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. కర్బన ఉద్గారాలు సున్నాకు తీసుకురావటమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. రాష్ట్రంలో 10వేల మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టులు ఏర్పాటవుతున్నాయని తెలిపారు. ఈ ప్రాజెక్టుల ద్వారా 7 లక్షల 50 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కలుగుతాయని అంచనా వేస్తున్నామన్నారు. గతంలో ఇలాంటి ప్రాజెక్టులకు అసైన్డ్ భూములు తీసుకోవడం సాధ్యమయ్యేది కాదని, చట్ట సవరణ ద్వారా అసైన్డ్ భూములు లీజుకు ఇచ్చే వెసులుబాటు కలుగుతోందని మంత్రి తెలిపారు. తద్వారా అసైన్డ్ భూముల యజమానులకు అ÷-దదె రూపంలో ఆదాయం వస్తుందన్నారు. రెండేళ్లకు ఒకసారి లీజు మొత్తాన్ని పెంచేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇప్పటి వరకు వివిధ ప్రభుత్వాలు కలిపి 35 లక్షల ఎకరాల భూములను అసైన్డ్ చేశాయని మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ.. అసైన్డ్ భూములు చాలా చోట్ల చేతులు మారాయని.. పేదల నుంచి భూములు తీసుకున్నవారు లబ్ధి పొందుతున్నారని తెలిపారు. అసలు లబ్ధిదారులకే లీజు డబ్బు అందేలా చూడాలని సూచించారు. కొన్ని చోట్ల అసైన్డ్ భూముల్లో పండ్ల తోటలు సాగు చేస్తున్నారని, అలాంటి రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. వైసీపీ హయాంలో భూముల ఫ్రీ-హోల్డ్‌లో కుంభకోణం జరిగిందని, దీనిపై ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టాలని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు.

# పవిత్ర రోజాలో ఆరోగ్య రహస్యం

**గుంటూరు,ఫిబ్రవరి26ప్రజా వీక్షణం:**

రంజాన్ మాసంలో ఉపవాసదీక్ష ప్రత్యేకతే వేరు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉపావాస దీక్ష చేయడం ఆరోగ్య రక్షణ రహస్యం దాగివుంది. పవిత్ర గ్రంథమైన ఖురాన్ ప్రకారం ఉపవాస దీక్షలు పాటించడం ఆరోగ్యానికి మంచిదేనని గ్రంథాలు తెలుపుతున్నాయి. రంజాన్ మాసంలో ముస్లింలు ఉపవాసదీక్షలు చేపట్టడడంవల్ల ఎంతో పుణ్యం, మంచి ఆరోగ్యంగా ఉంటామని ఇస్లామిక్ గ్రంథాలు పేర్కొం టున్నాయి. సూర్యోదయానికి ముందు సూర్యాస్తమయం తర్వాత ఆహారం తీసుకోవడం ద్వారా జీర్ణకోశ సంబంధ వ్యాధులు దూరమవుతాయని ప్రకృతి వైద్యులు స్పష్టం చేస్తున్నారు. రోజావల్ల జీర్ణకోశ వ్యాధులు దూరం సహర్, ఇఫ్తార్ వేళలో ఆహారాన్ని తీసుకోవడంలో ఎన్నో శాస్త్రీయ కారణాలు కనిపిస్తున్నాయి. రుషులు, సూర్యోదయానికి ముందు సూర్యాస్తమయం తర్వాత ఆహారాన్ని తీసుకునేవారని, ఉద యం, సాయంత్రం వేళల్లో ఆహారాన్ని స్వీకరించడం ద్వారా ఎన్నో లాభాలున్నాయి. తీసుకున్న ఆహారం సంపూర్ణంగా జీర్ణమవుతుందని, జీర్ణశక్తి పెరుగుతుందని, దీంతో రోగనిరోధక శక్తి కూడా పెరుగుతుంది. రోజా సమయంలో ఎక్కువగా పండ్లు ఫలాలు తీసుకుంటారని వీటిలో ఫోరిక్ యాసిడ్, కాల్షియం ఉంటాయి. ఇవి ఎనిమియాను దూరం చేస్తాయి. సంవత్సరంలోని 12 నెలల్లో పవిత్రమైన రంజాన్ మాసానికి విశేష ప్రాముఖ్యత ఉంది. సూర్యోదయానికి ముందు ఆహారం తీసుకోవడంలోనే ఆరోగ్యం దాగి వుందని ఇస్లాం బోధిస్తుంది. మహ్మద్ ప్రవక్త కూడా ప్రాతఃకాలానికి ముందే ఆహారాన్ని స్వీకరించేవారని ఆయన అనుచరులు ఎన్నో హదీసులలో వివరించారు. ఉపవాస వ్రతం రోజా ఈ మాసంలోనే విధిగా నిర్ణయించబంది. వేయి మాసాలకన్నా అత్యంత విలువైన రాత్రి లైలతుల్ ఖద్ర్ మానవాళి మార్గదర్శనం కోసం దైవం పంపిన పవిత్ర గ్రంథం ఖురాన్ కూడా ఈ మాసంలోనే అవతరించింది. ఇన్ని ప్రత్యేకతలు ఉన్న రంజాన్ మాసం రోజాలు ఉండేవారికి అంత పుణ్యం ఉంటుందని ఇస్లామిక్ గ్రంథాలు తెలుపుతున్నాయి. రోజా వల్ల మానవులను మంచివారుగా సౌశీల్యవంతులుగా, దైవభీతి గలవారుగా తీర్చిదిద్ద డం, దీనివల్ల భక్తిని పెంచే అవకాశం ఉంది. స్త్రీ పురుషులందరూ రోజా వ్రతాన్ని తప్పనిసరిగా పాటించాలని దేవుడు ఆదేశించాడు. ఎవరైనా దీన్ని తిరస్కరిస్తే మతభ్రష్టులు, మార్గభ్రష్టులు అయ్యే అవకా శముంది. మానవుల బలహీనతలను, వారి కష్టసుఖాలను బాగా తెలిసిన దేవుడు ఉపవాసాలను విధిగా చేసినప్పటికీ కొంద రికి కొన్ని మినహాయింపులు కూడా ప్రసా దించారు. చిన్నపిల్లలు, బాటసారులు, వ్యాధిగ్రస్తులు, వృద్ధులు, గర్భవతులు, బాలింతలు, మతిస్థిమితంలేని వారు అపరి శుద్ధావస్తలో ఉన్న స్త్రీలు ఉపవాసవ్రతం నుంచి మినహాయింపు ఉంది. ఉపవాసాలు ఉండటంవల్ల మనుషులు ఆరోగ్య వంతులుగా ఉంటారని బ్లడ్ ప్రెషర్, షుగర్ సాధారణ స్థితికి వస్తుందని వైద్యులు సూచిస్తున్నారు.

# గంభీర్‌కు రహానే చురకలు



మిండియా వెటరన్ ప్లేయర్ అజింక్యా రహానే భారత జట్టు మేనేజ్‌మెంట్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. 2026 టీ20 వరల్డ్ కప్‌లో భాగంగా సౌత్ ఆఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో భారత్ ఎదుర్కొన్న ఘోర పరాజయంపై ఆయన స్పందించారు. ఈ సందర్భంగా జట్టు ఎంపికలో మేనేజ్‌మెంట్ అనుసరించిన వ్యూహాలను ఆయన తప్పుబట్టారు. మరీ ముఖ్యంగా అక్షర్ పటేల్‌ను కాదని వాషింగ్టన్ సుందర్‌ను జట్టులోకి తీసుకోవడంపై ఆయన ప్రశ్నించారు. భారత క్రికెట్ జట్టు మేనేజ్‌మెంట్ తీసుకున్న కొన్ని వివాదాస్పద నిర్ణయాలపై అజింక్యా రహానే తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ముఖ్యంగా టీ20 ప్రపంచకప్ సూపర్-8 దశలో సౌత్ ఆఫ్రికాతో జరిగిన కీలక పోరులో భారత్ అనుసరించిన 'మ్యాచ్-అప్' వ్యూహాలను ఆయన తప్పుబట్టారు. ఎంపిక విషయంలో 'అతి తెలివి'ప్రదర్శించడం జట్టు ప్రదర్శనపై ప్రతికూల ప్రభావం చూపుతుందని ఆయన హెచ్చరించారు. ఒక రకంగా కోచ్ గంభీర్‌కు చురకలు అంటించాడు.సౌత్ ఆఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో స్టార్ ఆల్‌రౌండర్, జట్టు వైస్ కెప్టెన్ అక్షర్ పటేల్‌ను తుది జట్టు నుంచి తప్పించడం తనను ఆశ్చర్యానికి గురిచేసిందని రహానే పేర్కొన్నారు. "అక్షర్ పటేల్ జట్టులో లేకపోవడం చూసి నేను నిజంగా షాక్ అయ్యాను. జట్టులో ఏం జరుగుతుందో నాకు అర్థం కావడం లేదు. వాషింగ్టన్ సుందర్ మంచి ఆటగాడే కావచ్చు, అందులో ఎవరికీ సందేహం లేదు. కానీ అక్షర్ గత కొంతకాలంగా అన్ని రకాల పరిస్థితుల్లోనూ అద్భుతంగా రాణిస్తున్నాడు. జట్టులో ప్రధాన ఆటగాడిని పక్కన పెట్టి ప్రయోగాలు చేయడం సరికాదు" అని రహానే 'క్రిక్ బజ్'తో మాట్లాడుతూ వ్యాఖ్యానించారు.సౌత్ ఆఫ్రికా టాప్ ఆర్డర్‌లో ముగ్గురు లెఫ్ట్ హ్యాండర్ బ్యాటర్లు (క్వింటన్ డికాక్, రియాన్ రికెల్టన్, డేవిడ్ మిల్లర్) ఉన్నారనే కారణంతో ఆఫ్-స్పిన్నర్ వాషింగ్టన్ సుందర్‌ను జట్టులోకి తీసుకున్నారు. ఈ నిర్ణయంపై రహానే స్పందిస్తూ.. "కేవలం అవతలి జట్టులో ఎడమచేతి వాటం బ్యాటర్లు ఉన్నారని ఒక ఆఫ్-స్పిన్నర్‌ను తీసుకురావడం ఎప్పుడూ సరైన వ్యూహం కాదు. ఆఫ్-స్పిన్నర్లు లెఫ్ట్ హ్యాండర్లను కచ్చితంగా అవుట్ చేస్తారనే గ్యారెంటీ ఎక్కడుంది? అక్షర్ పటేల్‌కు లెఫ్ట్ హ్యాండర్లకు వ్యతిరేకంగా మంచి రికార్డు ఉంది. సెలక్షన్ విషయంలో అతి తెలివి ప్రదర్శిస్తే అది జట్టుకు నష్టం కలిగిస్తుంది" అని విమర్శించారు.సౌత్ ఆఫ్రికాతో జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ 76 పరుగుల భారీ తేడాతో ఓటమి పాలైంది. జస్ప్రీత్ బుమ్రా ఆరంభంలోనే డికాక్, రికెల్టన్ అవుట్ చేసినప్పటికీ, ఆ తర్వాత వచ్చిన డేవిడ్ మిల్లర్, డెవాల్డ్ బ్రెవిస్ భారత బౌలింగ్‌ను చితక్కొట్టారు. వ్యూహాత్మక మార్పుగా వచ్చిన వాషింగ్టన్ సుందర్ కేవలం రెండు ఓవర్లు మాత్రమే బౌలింగ్ చేసి విఫలమయ్యాడు. దీనిపై రహానే అసహనం వ్యక్తం చేస్తూ.. కేవలం ఇద్దరు ఓవర్ల కోసమే అక్షర్ వంటి కీలక ఆటగాడిని పక్కన పెట్టడం సమర్థనీయం కాదని అన్నారు. కోచ్ గౌతమ్ గంభీర్, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలోని టీమ్ మేనేజ్‌మెంట్ ప్లాన్-బి లేకుండా బరిలోకి దిగిందని విమర్శలు వస్తున్నాయి. మ్యాచ్ అనంతరం జరిగిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మేనేజ్‌మెంట్ తమ నిర్ణయాన్ని సమర్థించుకున్నప్పటికీ, అందులో తర్కం లేదని రహానే అభిప్రాయపడ్డారు. "అక్షర్ పటేల్ జట్టు వైస్ కెప్టెన్. అతనికి ఏదైనా గాయం అయితే తప్ప, ఫిట్‌గా ఉన్నంత కాలం అతను జట్టులో ఉండాల్సిందే. జింబాబ్వేతో జరగబోయే తదుపరి మ్యాచ్ భారత్‌కు 'డూ ఆర్ డై' లాంటిది. ఇప్పటికైనా మేనేజ్‌మెంట్ మేల్కొని సరైన నిర్ణయాలు తీసుకోవాలి" అని రహానే సూచించారు. ఈ ఓటమితో భారత్ సెమీఫైనల్ అవకాశాలు ప్రమాదంలో పడ్డాయి. టీమ్ మేనేజ్‌మెంట్ కేవలం గణాంకాలు, మ్యాచ్-అప్‌ల మీద ఆధారపడకుండా ఆటగాళ్ల ప్రస్తుత ఫామ్, నైపుణ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని మాజీ క్రికెటర్లు, అభిమానులు సోషల్ మీడియా వేదికగా కోరుతున్నారు.

# జింబాబ్వేతో మ్యాచ్ నుంచి అభిషేక్ ను తీసేయండి




టీ20 వరల్డ్ కప్ 2026 ఆరంభం నుంచే ఫామ్ కోల్పోయి పరుగులు చేయలేకపోతున్న టీమిండియా ఓపెనర్ అభిషేక్ శర్మపై మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ తీవ్ర వ్యాఖ్యలు చేశాడు. ఫిబ్రవరి 26న జింబాబ్వేతో భారత్ ఆడబోయే 'మస్ట్-విన్' మ్యాచ్‌కు ముందు, అభిషేక్ శర్మకు విశ్రాంతి ఇచ్చి ప్రత్యామ్నాయంగా సంజూ సాంసన్‌కు అవకాశం ఇవ్వాలని భారత జట్టు మేనేజ్‌మెంట్‌కు సెహ్వాగ్ సూచించాడు.ఫిబ్రవరి 22న అహ్మదాబాద్‌లో దక్షిణాఫ్రికా చేతిలో భారత్ 76 పరుగుల తేడాతో ఓడిపోయింది. ఆ మ్యాచ్‌కు ముందు అభిషేక్ శర్మ వరుసగా మూడు మ్యాచ్‌ల్లో డక్ (హ్యాట్రిక్ డక్స్)తో పెవిలియన్ చేరాడు. యునైటెడ్ స్టేట్స్, చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్, నెదర్లాండ్స్‌లపై అతను సున్నాకే అవుట్ అయ్యాడు. అయినా కూడా గౌతమ్ గంభీర్ మార్గదర్శకత్వంలో, సూర్యకుమార్ యాదవ్ నాయకత్వంలోని టీమిండియా అభిషేక్ శర్మపై నమ్మకాన్ని కొనసాగిస్తూ అతనికి టోర్నీలో అవకాశాలు ఇస్తూనే వచ్చింది. ఈ పరిస్థితిపై స్పందించిన వీరేంద్ర సెహ్వాగ్, చెన్నైలో జరిగే జింబాబ్వే మ్యాచ్‌కు అభిషేక్ శర్మకు బ్రేక్ ఇచ్చి సంజూ సాంసన్‌ను ఆడించాలన్నాడు. "నేను ఉంటే అభిషేక్ శర్మకు విశ్రాంతి ఇచ్చి సంజూ సాంసన్‌ను ప్రయత్నించేవాడిని. ఎందుకంటే ఈ మ్యాచ్ ఒక్కటే ప్రయోగాలు చేయగలిగే అవకాశం. ఈ మ్యాచ్‌లో భారత్ ఓడితే టోర్నీ నుంచి బయటపడతారు," అని క్రిక్‌బజ్‌తో మాట్లాడుతూ సెహ్వాగ్ అన్నాడు.ఈ మ్యాచ్ ప్రాధాన్యతను గుర్తుచేస్తూ, ఫామ్ ఆధారంగా బెస్ట్ ప్లేయింగ్ ఎలెవన్‌ను ఎంపిక చేయాలని ఆయన జట్టు మేనేజ్‌మెంట్‌కు సూచించాడు. "ఇంత కీలకమైన మ్యాచ్‌లో ఫామ్‌లో ఉన్న ఆటగాళ్లతోనే భారత్ బరిలోకి దిగాలి. అభిషేక్ పూర్తిగా ఫామ్ కోల్పోయినట్లుగా కనిపిస్తున్నాడు కాబట్టి అతనికి కొంత విరామం ఇవ్వాలి," అని సెహ్వాగ్ చెప్పాడు. అయితే అభిషేక్ శర్మను ఈ కీలక మ్యాచ్‌లో పక్కన పెడతారా? అన్న ప్రశ్నకు జట్టు బ్యాటింగ్ కోచ్ సితాంశు కోటక్ మద్దతుగా మాట్లాడాడు. దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో అభిషేక్ 15 పరుగులు చేసిన విధానం తనకు ఆశాజనకంగా అనిపించిందని, అతనిపై ఎక్కువ ఒత్తిడి పెట్టడం సరికాదని కోటక్ అన్నాడు. "గత మ్యాచ్‌లో అభిషేక్ బాగానే కనిపించాడు. ఒక్క వ్యక్తిపై ఎక్కువగా ఆలోచించడం అవసరం లేదు. అలా చేస్తే అతనిపై ఒత్తిడి పెరుగుతుంది. మళ్లీ అతను బ్యాట్‌తో బాగా కనెక్ట్ చేయడం మొదలుపెడితే పాత అభిషేక్‌ను మళ్లీ చూస్తాం," అని కోటక్ వ్యాఖ్యానించాడు. "ఈ మ్యాచ్‌లో అతను తప్పకుండా రాణిస్తాడని హామీ ఇవ్వలేం. కానీ అతను పాత ఫామ్‌కు చాలా దగ్గరలోనే ఉన్నాడు," అని కూడా కోటక్ మీడియాకు తెలిపాడు.

# విండీస్ విజయంతో మారిన టీమిండియా సెమీస్ లెక్కలు



హాట్ ఫేవరెట్స్ ట్యాగ్‌తో టి20 ప్రపంచకప్ 2026 లో అడుగు పెట్టిన భారత జట్టుకు సెమీస్ చేరే అవకాశాలు సన్నగిల్లుతున్నాయి. గ్రూప్ దశలో వరుస విజయాలతో సూపర్ 8కు చేరిన భారత జట్టు.. ఒకే ఒక్క ఓటమితో సెమీస్ అవకాశాలను క్లిష్టంగా చేసుకున్నాయి. ఇప్పుడు భారత్ సెమీస్ చేరాలంటే మరో జట్టుపై ఆధారపడాల్సిన పరిస్థితి దాపురించింది. ఆదివారం జరిగిన పోరులో సౌతాఫ్రికా చేతిలో టీమిండియా ఘోరంగా ఓడింది. ఏకంగా 76 పరుగుల తేడాతో ఓటమిని చవిచూసింది. ఫలితంగా టీమిండియా నెట్ రన్ రేట్ పాతాళానికి (-3.88) పడిపోయింది. ఇక సోమవారం జింబాబ్వేపై వెస్టిండీస్ గెలవడంతో టీమిండియా సెమీస్ చేరే అవకాశాలు మరింతగా సన్నగిల్లాయి. జింబాబ్వేపై వెస్టిండీస్ ఏకంగా 107 పరుగుల భారీ తేడాతో గెలిచింది. ఫలితంగా వెస్టిండీస్ నెట్ రన్ రేట్ ం5.350కి చేరుకుంది. ఇక జింబాబ్వే నెట్ రన్ రేట్ -5.350. ఈ స్థితి నుంచి జింబాబ్వే సెమీస్ చేరడం దాదాపు కష్టమే. అయితే భారత్ పరిస్థితి ఏంటంటే మాత్రం.. కష్టమనే చెప్పాలి. ఇప్పుడు భారత్ సెమీస్ చేరాలంటే రెండు పనులు జరగాలి.అందులో మొదటిది మిగిలిన రెండు మ్యాచ్‌ల్లోనూ భారత్ భారీ తేడాతో నెగ్గాలి. ఇక రెండోది సౌతాఫ్రికా వెస్టిండీస్, జింబాబ్వేలపై గెలవాలి. అప్పుడు భారత్ 4 పాయింట్లతో సెమీస్ చేరుతుంది. ఒకవేళ సౌతాఫ్రికా వెస్టిండీస్ చేతిలో ఓడితే మాత్రం టీమిండియా సెమీస్‌కు చేరడం కష్టమే. ఎందుకంటే.. జింబాబ్వేపై సౌతాఫ్రికా గెలిచే అవకాశాలు ఎక్కువ. దాంతో అప్పుడు సౌతాఫ్రికా వద్ద 4 పాయింట్ల ఉంటాయి. ఇక వెస్టిండీస్ సౌతాఫ్రికాపై గెలిచి భారత్ చేతిలో ఓడితే అప్పుడు విండీస్‌కు కూడా 4 పాయింట్లు ఉంటాయి. భారత్ తన చివరి రెండు మ్యాచ్‌ల్లో గెలిస్తే అప్పుడు టీమిండియా దగ్గర కూడా 4 పాయింట్లు ఉంటాయి. ఈ సమయంలో నెట్ రన్ రేట్ లెక్కలోకి వస్తుంది. ప్రస్తుతం విండీస్, సౌతాఫ్రికాల నెట్ రన్ రేట్ భారత్ కంటే ఎంతో మెరుగ్గా ఉంది. అలాంటి పరిస్థితుల్లో విండీస్, సౌతాఫ్రికాలు సెమీస్ కు చేరతాయి. భారత్, జింబాబ్వేలు ఇంటిదారి పడతాడు. గురువారం జింబాబ్వేతో జరిగే పోరులో టీమిండియా భారీ విజయాన్ని అందుకోవాల్సి ఉంది. ఎలా అంటే 150 పరుగుల లక్ష్యాన్ని 11 ఓవర్లలోపు ఛేదించడం.. లేదంటే 100 పరుగుల తేడాతో గెలవడం వంటివి చేయాలి. అప్పుడే భారత జట్టు నెట్ రన్ రేట్ మెరుగవుతుంది. పోరాడి గెలిస్తే మాత్రం నెట్ రన్ రేట్ మైనస్‌లోనే ఉంటుంది. సౌతాఫ్రికాతో జరిగిన పోరులో టీమిండియా ప్లేయింగ్ ఎలెవెన్ పై కూడా విమర్శలు వస్తున్నాయి. అక్షర్ పటేల్‌ను పక్కన పెట్టడం ఏంటంటూ గంభీర్‌పై అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక అదే సమయంలో వరుసగా విఫలం అవుతున్న తిలక్ వర్మ, అభిషేక్ శర్మలకు ఛాన్స్‌లు ఇవ్వడంపై కూడా మండిపడుతున్నారు. భారత్ తన చివరి రెండు మ్యాచ్‌లను ఫిబ్రవరి 26న జింబాబ్వేతో.. మార్చి 1న వెస్టిండీస్‌లతో ఆడుతుంది.

# విండీస్‌ను చిత్తు చేసిన సౌతాఫ్రికా..

## 9 వికెట్ల తేడాతో వెస్టిండీస్ జట్టు చిత్తు

## సౌతాఫ్రికా జట్టు సెమీస్‌కు క్వాలిఫై

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీలో సౌతాఫ్రికా జైత్రయాత్ర కొనసాగుతోంది. వరుస విజయాలతో లీగ్ దశను అజేయంగా ముగించిన సఫారీ టీమ్.. సూపర్-8 దశలోనే అదే జోరు కొనసాగిస్తోంది. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో పటిష్ట భారత్‌ను మట్టికరిపించిన మార్క్రమ్ సేన.. తాజాగా డేంజరస్ టీమ్ అయిన వెస్టిండీస్‌ను చిత్తు చేసింది.గురువారం అహ్మదాబాద్ వేదికగా జరిగిన తమ రెండో సూపర్-8 మ్యాచ్‌లో సౌతాఫ్రికా 9 వికెట్ల తేడాతో గెలుపొందింది.



బ్యాటింగ్, బౌలింగ్‌లో పూర్తి ఆధిపత్యం చెలాయించి విండీస్‌ను చిత్తు చేసింది. ఈ విజయంతో సౌతాఫ్రికా గ్రూప్-1 నుంచి సెమీస్ బెర్త్‌ను దాదాపు ఖరారు చేసుకోగా వెస్టిండీస్ సంక్లిష్టం చేసుకుంది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 176 పరుగులు చేసింది. జాసన్ హోల్డర్(31 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లతో 49), రొమారియో షెఫర్డ్(37 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్స్‌లతో 52 నాటౌట్) అసాధారణ ప్రదర్శన కనబర్చారు. ఈ ఇద్దరూ 8వ వికెట్‌కు 89 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. సౌతాఫ్రికా బౌలర్లలో లుంగి ఎంగిడి(3/30) మూడు వికెట్లు తీయగా.. కగిసో రబడా, కార్బిన్ బోష్ రెండేసి వికెట్లు పడగొట్టారు.అనంతరం సౌతాఫ్రికా 16.1 ఓవర్లలో వికెట్ నష్టానికి 177 పరుగులు చేసి గెలుపొందింది. ఎయిడెన్ మార్క్రమ్(46 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్స్‌లతో 82 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీతో రాణించగా.. క్వింటన్ డికాక్(24 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లతో 47), ర్యాన్ రికెల్టన్(28 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లతో 45 నాటౌట్) కీలక ఇన్నింగ్స్ ఆడారు. వెస్టిండీస్ బౌలర్లలో రోస్టన్ ఛేజ్ ఒక వికెట్ తీసాడు. సౌతాఫ్రికా విజయంతో టీమిండియా సెమీస్ అవకాశాలు మెరుగయ్యాయి. ఎలాంటి రన్‌రేట్ టెన్షన్ లేకుండా జింబాబ్వేతో పాటు వెస్టిండీస్‌తో తమ తదుపరి మ్యాచ్‌లను భారత్ గెలిస్తే సరిపోతుంది. ఇందులో ఒక్క మ్యాచ్ ఓడినా ఇంటిబాట పడుతుంది. మరోవైపు ఈ ఘోర పరాజయంతో వెస్టిండీస్ రన్‌రేట్ కూడా భారీగా పడిపోయింది. ం5.350 నుంచి 1.791కు వెస్టిండీస్ రన్ రేట్ తగ్గింది. భారత్‌తో జరిగే తమ ఆఖరి మ్యాచ్‌లో విజయం సాధిస్తేనే విండీస్ సెమీస్ చేరనుంది. లేదంటే ఇంటిబాట పట్టనుంది.

# 19 ఏళ్ల టీ20 వరల్డ్ కప్ చరిత్రలో శ్రీలంక చెత్త రికార్డు

టీ20 వరల్డ్ కప్ 2026 సూపర్ 8 దశలో భాగంగా బుధవారం కొలంబోలోని ఆర్.ప్రేమదాస స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో శ్రీలంక జట్టుకు తీరని అవమానం ఎదురైంది. న్యూజిలాండ్‌తో జరిగిన ఈ కీలక పోరులో లంక ఘోర పరాజయాన్ని మూటగట్టుకోవడమే కాకుండా, టీ20 ప్రపంచకప్ 19 ఏళ్ల చరిత్రలోనే ఎన్నడూ లేని ఒక అత్యంత చెత్త రికార్డును తన ఖాతాలో వేసుకుంది. పరుగుల వేటలో తడబడిన శ్రీలంక ఆటగాళ్లు పవర్‌ప్లేలో చేతులెత్తేయడం అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది.మొదట టాస్ గెలిచిన శ్రీలంక బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ ఇన్నింగ్స్ ఆరంభంలో చాలా నిలకడగా సాగింది. ఒకానొక దశలో 75 పరుగుల వద్ద కేవలం 2 వికెట్లు మాత్రమే కోల్పోయిన కివీస్, భారీ స్కోరు సాధించేలా కనిపించింది. అయితే శ్రీలంక బౌలర్లు పుంజుకోవడంతో సీన్ రివర్స్ అయింది. కేవలం 9 పరుగుల వ్యవధిలోనే 4 కీలక వికెట్లు కోల్పోయిన న్యూజిలాండ్, 84 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. కనీసం 120 పరుగులు చేస్తుందా అని అనుకుంటున్న తరుణంలో కెప్టెన్ మిచెల్ సాంట్నర్, కోల్ మెక్కాన్చీలు అద్భుతం చేశారు. వీరిద్దరూ ఏడో వికెట్‌కు ఏకంగా 47 బంతుల్లో 84 పరుగుల అజేయ భాగస్వామ్యాన్ని నెలకొల్పి, జట్టు స్కోరును 20 ఓవర్లలో 168/7కి చేర్చారు. 169 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంకకు ఆరంభంలోనే చుక్కలు కనిపించాయి. కివీస్ బౌలర్ల ధాటికి లంక బ్యాటర్లు క్రీజులో నిలవడానికి నానా తంటాలు పడ్డారు. ఈ క్రమంలోనే టీ20 వరల్డ్ కప్ చరిత్రలోనే శ్రీలంక తన అత్యల్ప పవర్‌ప్లే స్కోరును నమోదు చేసింది. మొదటి 6 ఓవర్లలో కేవలం 20 పరుగులు మాత్రమే చేసి 2 వికెట్లు కోల్పోయింది. ఇంతకుముందెన్నడూ లంక ఇంత ఘోరంగా పవర్‌ప్లేలో ఆడలేదు. లక్ష్యం పెద్దదైనప్పుడు ధాటిగా ఆడాల్సింది పోయి, అతి జాగ్రత్తగా ఆడి వికెట్లు పారేసుకోవడం ఆ జట్టు కొంపముంచింది. చివరికి శ్రీలంక జట్టు 20 ఓవర్లలో 107/8 పరుగులకే పరిమితమై 61 పరుగుల తేడాతో చిత్తుగా ఓడిపోయింది. జట్టులో కామిందు మెండిస్ (31 పరుగులు) మినహా ఎవరూ 30 పరుగుల మార్కును దాటలేకపోయారు. న్యూజిలాండ్ స్పిన్నర్ రచిన్ రవీంద్ర 4 వికెట్లతో లంక పతనాన్ని శాసించాడు. ఈ ఓటమితో శ్రీలంక సెమీఫైనల్ రేసు నుండి అధికారికంగా నిష్క్రమించగా, కివీస్ తన సెమీస్ అవకాశాలను మరింత మెరుగుపరుచుకుంది.


# ఇండియాతో మ్యాచ్ అంటే ఇంజెక్షన్లు ఎక్కించుకునేవాళ్లం

## పాకిస్తాన్ పేసర్ షోయబ్ అక్తర్



భారత్-పాకిస్థాన్ క్రికెట్ పోరు అంటే కేవలం మైదానంలో ఆట మాత్రమే కాదు.. అది ఒక భావోద్వేగం, ఒక యుద్ధం. అప్పట్లో 90వ దశకంలో వసీం అక్రమ్, వకార్ యూనిస్, సక్లైన్ ముస్తాక్, షోయబ్ అక్తర్ వంటి దిగ్గజ బౌలర్లు భారత్‌ను వణికించేవారు.ముఖ్యంగా సచిన్ టెండూల్కర్‌ను అవుట్ చేయడం అంటే వారికి అదొక గౌరవం, ఒక పెద్ద పందెం.ఆనాటి పంతాలు,పంతాల వెనుక ఉన్న నొప్పిని రావల్పిండి ఎక్స్‌ప్రెస్ తాజాగా బయటపెట్టింది.అప్పట్లో సచిన్ టెండూల్కర్ వర్సెస్ షోయబ్ అక్తర్ మధ్య సాగిన పోరాటం నేటికీ అభిమానుల గుండెల్లో సజీవంగా ఉంది. ఇండియా -పాకిస్థాన్ మధ్య 1999 కోల్‌కతా టెస్టును క్రికెట్ అభిమానులు ఎవరూ మర్చిపోలేరు. ఆ మ్యాచ్‌లోనే అప్పటికి పెద్దగా తెలియని పాకిస్తాన్ యువ పేసర్ షోయబ్ అక్తర్ భారత దిగ్గజాలు రాహుల్ ద్రవిడ్, సచిన్ టెండూల్కర్‌లను వరుస బంతుల్లో క్లీన్‌బౌల్డ్ చేశాడు.అక్తర్ సంధించిన పర్ఫెక్ట్ యార్కర్లకు ఈ దిగ్గజ క్రికెటర్లు పెవిలియన్ బాట పట్టడంతో ఒక్కసారిగా ఈడెన్ గార్డెన్స్ నిశబ్ధమైపోయింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో అక్తర్ మాట్లాడుతూ.. 1998-99 నాటి పాక్ భారత పర్యటనను గుర్తు చేసుకున్నాడు. ఒక షాకింగ్ నిజాన్ని వెల్లడించాడు."ఆ సిరీస్‌లో సచిన్ వికెట్ కోసం నాకు,సక్లైన్ ముస్తాక్‌కు మధ్య పెద్ద పందెం నడిచేది. 'సచిన్‌ను నేనే అవుట్ చేస్తా'అని అతను,'లేదు ఈసారి నా వంతు'అని నేను సవాళ్లు విసురుకునేవాళ్లం"అని అక్తర్ పేర్కొన్నాడు.కానీ ఆ పోరాటం వెనుక భయంకరమైన శారీరక నొప్పి ఉంది."మా ఇద్దరి మోకాళ్లు దెబ్బతిన్నాయి.నా మోకాళ్లలో వాపు వచ్చి నీరు చేరింది.కానీ మేం ఆ నొప్పిని భరిస్తూనే రహస్యంగా మందులు ఇంజెక్షన్లు తీసుకుని మైదానంలోకి దిగేవాళ్లం.మా సీనియర్లకు గనుక మా పరిస్థితి తెలిస్తే..జట్టులో నుంచి గెంటేసేవారు.కేవలం సచిన్ వికెట్ తీయాలన్న కసితోనే ఆ గొడ్డలి పెట్టు వంటి నొప్పులను భరించాం" అంటూ అక్తర్ ఆనాటి తీవ్రతను వివరించాడు.కాలం మారింది.. కానీ పాకిస్థాన్ క్రికెట్ కష్టాలు మాత్రం మారలేదు. తాజాగా జరుగుతున్న టీ20 ప్రపంచకప్ 2026లో భారత్ చేతిలో చిత్తుగా ఓడిపోయిన పాకిస్థాన్, తాజాగా ఇంగ్లాండ్‌తో జరిగిన సూపర్-8 మ్యాచ్‌లోనూ ఘోర పరాజయం మూటగట్టుకుంది. ఈ ఓటమితో సెమీస్ ఆశలు గాల్లో దీపంలా మారడంతో షోయబ్ అక్తర్ లైవ్ టీవీలోనే తీవ్ర ఆగ్రహానికి గురయ్యాడు.మ్యాచ్‌కు ముందు "ఇంగ్లాండ్ దారుణంగా ఆడాలని, భారత్ టోర్నీ నుంచి తప్పుకోవాలని" ఆకాంక్షించిన అక్తర్, ఫలితం తారుమారు కావడంతో తట్టుకోలేకపోయాడు.

# టాక్సిక్ కోసం యష్ క్రేజీ మేకోవర్..



పాన్ ఇండియా స్టార్, అందులోనూ రాకింగ్ స్టార్ యష్ అనగానే.. ఆ పొడవాటి జుట్టు, గుబురు గడ్డం, ఊరమాస్ లుక్ టక్కున కళ్లముందు మెదులుతాయి. కేజీఎఫ్ సిరీస్ నుంచి దాదాపు ఎన్నో ఏళ్లుగా అదే లుక్ మైంటైన్ చేసిన యష్.. ఎట్టకేలకు ఆ ఐకానిక్ స్టైల్‌కి ఎండ్ కార్డ్ వేశాడు. గీతూ మోహన్‌దాస్ డైరెక్షన్‌లో వస్తున్న తన అప్‌కమింగ్ మూవీ 'టాక్సిక్: ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్-అప్స్' కోసం పూర్తిగా మేకోవర్ అయ్యాడు. జుట్టు, గడ్డం ట్రిమ్ చేయించుకుంటూ న్యూ లుక్‌లోకి మారుతున్న ఓ మేకింగ్ వీడియోను తాజాగా రిలీజ్ చేయగా.. ఇప్పుడది సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. అందులో తన భార్య రాధికా పండిట్ యష్ గడ్డాన్ని పట్టుకుని.. "ఫైనల్లీ.. ఈ గడ్డానికి, జుట్టుకి విముక్తి దొరికింది" అంటూ ఎమోషనల్ అవ్వడం ఫ్యాన్స్‌ను విపరీతంగా ఆకట్టుకుంటోంది. యష్ క్లీన్ షేవ్ లుక్ బయటకు రావడంతో.. ఈ సినిమాలో అతడు డబుల్ రోల్ చేస్తున్నాడనే ప్రచారానికి ఆజ్యం పోసినట్టైంది. రీసెంట్‌గా ఫిబ్రవరి 21న విడుదలైన పోస్టర్‌లో యష్ 'టికెట్' అనే కుర్రాడి పాత్రలో కనిపించాడు. ఈ మేకోవర్ వీడియో ఆ క్యారెక్టర్ కోసమే. అంతకుముందు జనవరి 8న తన బర్త్‌డే రోజున 'రాయ' అనే మరో లుక్‌ను రిలీజ్ చేశాడు. దీంతో సినిమాలో యష్ రెండు డిఫరెంట్ రోల్స్ ప్లే చేస్తున్నట్లు దాదాపు క్లారిటీ వచ్చేసింది. ఇదంతా ఒకెత్తయితే.. టీజర్‌లో కొన్ని సెకన్ల పాటు కనిపించిన ఓ మిస్టరీ 'జోకర్' క్యారెక్టర్ మరో ఎత్తు. ఆ క్లౌన్ మేకప్‌లో ఉన్నది యష్ మూడో అవతారమా? లేక కథను మలుపుతిప్పే ఏదైనా సింబాలిక్ క్యారెక్టరా? అంటూ ఫ్యాన్స్ బాగా చర్చించుకుంటున్నారు. సినిమా రిలీజ్ అయ్యేలోపు ఈ పజిల్‌ను సాల్వ్ చేసే పనిలో పడ్డారు నెటిజన్లు. ఈ పీరియడ్ గ్యాంగ్‌స్టర్ డ్రామాలో భారీ తారాగణమే ఉంది. రుక్మిణి వసంత్ (మెలిస్సా), నయనతార (గంగ), కియారా అద్వానీ (నాడియా), హుమా ఖురేషీ (ఎలిజబెత్), తారా సుతారియా (రెబెక్కా) లాంటి స్టార్స్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్, యశ్ హోమ్ బ్యానర్ మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని కన్నడ, ఇంగ్లీష్ భాషల్లో ఒకేసారి షూట్ చేయడం విశేషం. రాజీవ్ రవి సినిమాటోగ్రఫీ అందిస్తుండగా.. రవి బస్రూర్, విశాల్ మిశ్రా, తనిష్క్ బాగ్చీ మ్యూజిక్ ఇస్తున్నారు. ఉజ్వల్ కులకర్ణి ఎడిటర్‌గా పనిచేస్తున్నాడు. ముఖ్యంగా హాలీవుడ్ స్టంట్ మాస్టర్ జేజే పెర్రీ యాక్షన్ సీక్వెన్స్ డిజైన్ చేయడం సినిమాపై క్యూరియాసిటీని పెంచుతోంది.

## హుక్ స్టెప్ ను కాపీ చేశారా?

నేచురల్ స్టార్ నాని హీరోగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ ప్యారడైజ్. ఈ సినిమా కోసం అభిమానులు ఈగర్ గా ఎదురుచూస్తున్నారు. దసరా సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహిస్తున్నారు. కొన్ని నెలలుగా ఈ సినిమా షూటింగ్ వేగంగా జరుగుతుంది. ఇందులో నాని సరికొత్త పాత్రలో కనిపించనున్నారు. దీంతో ఇప్పటికే ఈ ప్రాజెక్ట్ పై భారీ బజ్ నెలకొంది. నాని ఈ సినిమాలో డిఫరెంట్ లుక్ తో పాటు యాక్షన్ మోడ్ లో కనిపించనున్నాడు. ఈ సినిమా నుంచి విడుదలైన పోస్టర్స్, సాంగ్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. తాజాగా ప్యారడైజ్ సినిమా నుంచి ఆయా షేర్ అనే సాంగ్ ను విడుదల చేశారు. అనిరుధ్ ఈ సినిమాకు సంగీతం అందించారు. నాని పుట్టిన రోజు సందర్భంగా ఈ సాంగ్ ని విడుదల చేశారు. విడుదలైన కొన్ని గంటల్లోనే ఈ సాంగ్ సోషల్ మీడియాలో దుమ్మురేపింది. ఎక్కడ చూసిన ఈ సాంగే వినిపిస్తుంది. అలాగే ఈ సాంగ్ లోని హుక్ స్టెప్ అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. నాని ఈ సాంగ్ లో డాన్స్ అదరగొట్టాడు. ముఖ్యంగా హుక్ స్టెప్ అందరిని విశేషంగా ఆకట్టుకుంది. అయితే ఈ సాంగ్ హుక్ స్టెప్ ను కాపీ చేశారంటూ సోషల్ మీడియాలో కొన్ని మీమ్స్ వైరల్ అవుతున్నాయి. ఉన్న ఓ ఇన్ఫ్లుయెన్సర్ సోషల్ మీడియాలో డాన్స్ వీడియోలతో పాపులర్ అయ్యాడు. డిఫరెంట్ డాన్స్ మూవీస్ తో మంచి ఫాలోయింగ్ సొంతం చేసుకున్నాడు. గతంలో ఓ ఫారెనర్ తో కలిసి ఈ డాన్స్ స్టెప్ వేశాడు. అదే స్టెప్ ను ఇప్పుడు నాని ప్యారడైజ్ సినిమాలో కాపీ చేశారని అంటున్నారు. కొంతమంది నెటిజన్స్ ఆ రెండు వీడియోలను పక్కపక్కన పెట్టి ఒరిజినల్, కాపీ అంటూ పోస్ట్ లు పెడుతున్నారు.



## ఒక్కటైన విజయ్ దేవరకొండ - రష్మిక మందన్న

విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న (విరోష్) పెళ్లి వేడుకలు రాజస్థాన్ ఉదయపూర్‌లోని ఐటిసి మెమెంటోస్ (ఏకాయా ఉదయపూర్) హోటల్‌లో ఘనంగా జరుగుతున్నాయి. సరిగ్గా ఉదయం 10 గంటల 10 నిమిషాలకు రష్మిక మెడలో విజయ్ దేవరకొండ మూడు ముళ్లు వేసినట్లు సమాచారం. అతికొద్ది మంది అతిథుల సమక్షంలో మేళ తాళాల నడుమ ఈ వేడుక అట్టహాసంగా జరిగిందని తెలుస్తోంది. ఉదయపూర్ ప్యాలెస్ వేదికగా అత్యంత సన్నిహితులు, కుటుంబ సభ్యులు సమక్షంలో వేదమంత్రాల సాక్షిగా విజయ్ దేవరకొండ -- రష్మిక మందన్న ఏడడుగుల బంధంలోకి అడుగు పెట్టారు. దాదాపు 8 సంవత్సరాలుగా డేటింగ్ చేస్తున్న ఈ జంట ఎట్టకేలకు వైవాహిక బంధంలోకి అడుగుపెట్టి అభిమానులను ఖుషీ చేశారు. విజయ్ దేవరకొండ-రష్మిక మందన్న వివాహ బంధంతో ఒక్కటి కావడంతో పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలుపుతున్నారు. అటు విజయ్ ఫ్యాన్స్, ఇటు రష్మిక ఫ్యాన్స్ ఖుషీ ఖుషీ అవుతూ ఫుల్లుగా ఎంజాయ్ చేస్తున్నారు.

# ఇంతవరకూ ఒక్క హిట్టు పడలేదు

ఎవరు ఏ రంగాన్ని ఎంచుకున్నప్పటికీ, అందులో రాణించాలంటే ప్రతిభ ఉండాలి. టాలెంట్ ఒక్కటి ఉంటే సరిపోతుందా అంటే, కొంచెం అదృష్టం కూడా ఉండాలనుకోండి అనే సమాధానం వస్తుంది. అదృష్టం అనే విషయంలో ఎవరి అభిప్రాయాలు వాళ్లకి ఉంటాయి. కాకపోతే అదృష్టం అనే దాని గురించి అప్పుడప్పుడు నమ్మవలసి వస్తుంటుంది. అందుకు కారణాలు .. కళ్లముందు కనిపించేవే అని చెప్పాల్సి ఉంటుంది. ఆశించినస్థాయిలో గుర్తింపు రానప్పుడు .. విజయాలు అందనప్పుడు .. అదృష్టం లేదని చెప్పుకుంటూ ఉంటారు. అలాంటి అదృష్టాన్ని వెతికి పట్టుకునే పనిలో ఉంటారు. ప్రస్తుతం భాగ్యశ్రీ బోర్సే అదే పనిలో ఉందని అంటున్నారు. ఇప్పుడున్న కథానాయికలలో గ్లామరస్ బ్యూటీ ఎవరంటే కుర్రకారు ఠక్కీమని చెప్పే మాట భాగ్యశ్రీ బోర్సే. తుమ్మెదల్లాంటి కళ్లతో మనసులు దోచే ఈ సుందరికి ఇంతవరకూ హిట్టు పడలేదు. ఆమె అభిమానులు బెంగపెట్టుకోవడంలోని అసలు కారణం ఇదే. ఈ నేపథ్యంలో ఆమె అఖిల్ సరసన నాయికగా 'లెనిన్' సినిమా చేస్తోంది. మురళీ కిశోర్ అబ్బూరి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను, అన్నపూర్ణ – సితార సంయుక్తంగా నిర్మిస్తున్నారు. 'మే'లో ఈ సినిమాను విడుదల చేసే ఆలోచనలో ఉన్నారు. తమన్ సంగీతాన్ని సమకూర్చిన ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. భాగ్యశ్రీ గ్లామర్ ఈ సినిమాకి ప్రత్యేకమైన ఆకర్షణగా నిలుస్తుందని అంటున్నారు. ఈ సినిమాతోనైనా ఆమెకి అదృష్టం కలిసొస్తుందేమో చూడాలి మరి.



# అందం, అభినయంతో మెస్మరైజ్ చేసింది

రీసెంట్ డేస్ లో కొంతమంది హీరోయిన్స్ ఓవర్ నైట్ లో స్టార్ డమ్ సొంతం చేసుకుంటున్నారు. ఒకే ఒక్క సినిమాతో పాపులర్ అవుతున్నారు. ఇప్పటికే మన దగ్గర యంగ్ బ్యూటీస్ చాలా మంది. ఒకొక్క సినిమాకు ఒకొక్క హీరోయిన్ పరిచయం అవుతుంది. అయితే ఓ ముద్దుగుమ్మ మాత్రం ఇండస్ట్రీలో నాయా రికార్డ్ క్రియేట్ చేసింది. కేవలం 22ఏళ్ల ఆ ముద్దుగుమ్మ ఇండస్ట్రీని షేక్ చేసింది. ఆమె అందానికి, నటనకు ప్రేక్షకులు ఫిదా అయ్యారు. ఆమె తొలి సినిమానే వందలకోట్ల కలెక్షన్స్ రాబట్టింది. స్టార్ హీరోలు కూడా ఆమె నటనకు, అందానికి ఫ్లాట్ అయ్యారు. ఇంతకూ ఆమె ఎవరో తెలుసా.? ఇటీవలే బాక్సాఫీస్ వద్ద ఓ సినిమా సంచలనం సృష్టిస్తుంది. ఆ సినిమాతో 22 ఏళ్ల హీరోయిన్ రికార్డ్స్ తిరగరాస్తుంది. ప్రస్తుతం బాలీవుడ్ ఇండస్ట్రీలో మారుమోగుతున్న పేరు అనీత్ పద్ద. వయసు 22 సంవత్సరాలు. పంజాబ్ లోని అమృత్ సర్ లో జన్మించిన ఈ వయ్యారి.. మోహిత్ సూరి దర్శకత్వం వహించిన సయ్యారా సినిమాతో కథానాయికగా సినీరంగంలోకి అడుగుపెట్టింది. ఎలాంటి అంచనాలు లేకుండా విడుదలైన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించింది. జూలై 18న విడుదలైన ఈ సినిమా రూ. 570 కోట్లకు పైగా వసూలు చేసింది. ఈ సినిమాతో ఓవర్ నైట్ స్టార్ అయిపోయింది అనీత్ పద్ద. అందం, అభినయంతో మెస్మరైజ్ చేసింది. ఈ సినిమా చూసిన ప్రతి ఒక్కరు ఈ అమ్మడు గురించి తెలుసుకోవడానికి ట్రై చేశారు. అనీత్ పద్ద.. ఢిల్లీ విశ్వవిద్యాలయంలో గ్రాడ్యుయేషన్ చేస్తుందట. నటనపై ఆసక్తితో మోడలింగ్ రంగంలోకి అడుగుపెట్టింది అనీత్ పద్ద. ఇప్పటికే పలు యాడ్స్ చేసింది. ఇక సయ్యారా సినిమాతో కథానాయికగా వెండితెరకు పరిచయమైంది. ఫస్ట్ మూవీతోనే ఊహించని విజయాన్ని ఖాతాలో వేసుకున్న ఈ సుందరి.. ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. సయ్యారా సినిమాపై చాలా మంది సెలబ్రెటీలు, స్టార్ హీరోలు కూడా ప్రశంసలు కురిపించారు. హీరోహీరోయిన్స్ పై పొగడ్తలు కురిపించారు.



Printed & published owned by K.SRAVAN KUMAR. Printed Published RK PRINTING PRESS at 6-1-948 Boyawada Street Nalgonda.Pin : 508001. Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. RNI.NO.APTEL/2009/29433.(CELL ) 9866330400 prajaveekshanam@gmail.com